శతారుణ గీతాంజలి
రూ॥ 180/-
పేజీలు: 180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



ప్రేమ పేరుతో రూ.9.35 కోట్ల మోసం

రానున్న ఏడురోజులు రాష్ట్రంలో వర్షాలు

పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి సరిపోను నిల్వలు ఉన్నాయి

03



సంపుటి 09, సంచిక: 147 | సోమవారం | 27-04-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## బిజెపిలో ఎంపిల చేరికపై ఆప్ సమీక్షించుకోవాలి

- ఈ పరిస్థితి తీవ్రమైనది
- పంజాబ్‌పై అధిక ప్రభావం
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**న్యూఢిల్లీ :** రాజ్యసభలోని తమ సభ్యులలో మూడింట రెండు వంతుల మంది బిజెపిలో చేరాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో తమ రాజ్యసభ ఎంపీలు పార్టీని వీడటానికి గల కారణాలను ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తప్పనిసరిగా తీవ్రంగా సమీక్షించుకోవాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఆయన 'ఎఎన్‌ఐ' వార్తా సంస్థతో మాట్లాడుతూ ఈ పరిస్థితిని తీవ్రమైనదిగా తరువాయి 2లో



## ప్రభుత్వానికి, ఆర్‌టిసి యాజమాన్యానికి ఆర్‌టిసి జెఎసి నేతలు కృతజ్ఞతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపిన ప్రజా ప్రభుత్వానికి, ఆర్‌టిసి యాజమాన్యానికి టిజిఆర్‌టిసి జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు ఈదురు వెంకన్న, ఎం.థామస్ రెడ్డి, ఎండి మౌలానా, కత్తుల యాదయ్య, తరువాయి 2లో



ప్రఖ్యాత ఫొటో జర్నలిస్టు

## రఘు రాయ్ కన్నుమూత

**న్యూఢిల్లీ:** భారతదేశ చరిత్రను తన కెమెరా లెన్స్‌తో ఒడిసిపట్టిన మహా మనిషి కన్నుమూశారు. దశాబ్దాల పాటు అనేక చారిత్రక ఘట్టాలను, విషాదాలను, విజయాలను ప్రపంచానికి పరిచయం చేసిన 'భారత ఫొటో జర్నలిజం పితామహుడు' రఘురాయ్(83) ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తను కుటుంబ సభ్యులు అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా వెల్లడించారు. ఢిల్లీలోని లోధి రోడ్ తరువాయి 2లో



ఎగుమతుల్లో క్షీణత

## ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ

జిటిఆర్‌ఐ నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ:** దేశ ఎగుమతుల్లో తీవ్ర క్షీణత కారణంగా భారత ఆర్థిక వ్యవస్థ గట్టిగా దెబ్బ తింది. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్‌ఐ) విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2025–26లో ఎగుమతులు 2.2 శాతం తగ్గాయి. లక్షలాది సాధారణ ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న ఈ రంగంలో ఎదురైన ఈ ఎదురు దెబ్బ దేశంలో నిరుద్యోగ రేటును పెంచుతుందనే బలమైన తరువాయి 2లో

'జన గణన - 2027'

# స్వీయ నమోదు షురూ



వివరాలు నమోదు చేసుకున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో 'తెలంగాణ సెన్సెస్ ఆఫ్ ఇండియా – 2027' స్వీయ నమోదు కార్య క్రమం ఆదివారం లాంఛనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా స్వీయ నమోదు కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ స్వయంగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తన వివరాలను నమోదు చేసుకుని, రాష్ట్రంలో స్వీయ నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో వెబ్‌సైట్‌లో తన వివరాలను స్వయంగా నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జనగణన నమోదు, ఆన్‌లైన్ విధానం తదితర అంశాలను అధికారులు సిఎంకు వివరించారు. అలాగే కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హైదరాబా ద్‌లోని దిల్ కుషా గెస్ట్‌హౌస్‌లో స్వీయ నమోదు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సెన్సెస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోలికేరి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్. వి.కర్ణన్, జాయింట్ ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్ ప్రియాంక అలా, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక, లోక్‌భవన్ అధికారి శశికిరణాచారి తరువాయి 2లో

వనరుల సమాన పంపిణీకి పునాది జనగణన : గవర్నర్ శుక్లా

దేశాభివృద్ధికి అత్యంత కీలకం : సిఎం రేవంత్‌రెడ్డి

వివరాలిస్తే వ్యక్తిగతంగా ఎలాంటి ఇబ్బందులుండవ్ : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి





మీడియా డిన్నర్‌లో

# ట్రంప్‌పై హత్యాయత్నం







- మోదీ సహా ప్రపంచ నేతల దిగ్భ్రాంతి
- నిందితుడు కాలిఫోర్నియా టీచర్ అరెస్టు
- కాల్పులకు కారణంపై ప్రశ్నిస్తున్న ఎఫ్‌బిఐ
- ఇరాన్ యుద్ధానికీ, దీనికీ సంబంధంలేదు : ట్రంప్
- ఇరాన్‌పై గెలుపు సాధనలో నన్ను వెనక్కు లాగలేరు
- బాల్ రూమ్ లేకపోవడంవల్లే ఈ అనర్థం
- ప్రాణగండం ఉందని నన్ను ముందే హెచ్చరించారు
- ఏ దేశ రాజకీయాల్లోనూ హింసకు మినహాయింపు లేదు

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై శక్తిమంతమైన ఆయుధాలతో ఒక ఉపాధ్యాయుడు హత్యా ప్రయత్నం చేశారు. వెంటనే ఎఫ్‌బిఐ, సీక్రెస్ సర్వీస్ అధికారులు, భద్రతా సిబ్బంది అప్రమత్తమై నిందితుడిని నివారించారు. అయినప్పటికీ ఈ ప్రయత్నంలో ఒక ఎఫ్‌బిఐ అధికారికి గాయాలయ్యాయి. ఆయన ఆరోగ్యంగానే ఉన్నారు. వైట్‌హౌస్ హిల్టన్ హోటల్‌లో శనివారంరాత్రి "వైట్‌హౌస్ మీడియా సిబ్బంది" తో తనకున్న బలమైన అనుబంధాన్ని చాటి చెప్పడానికి వారికోసం మొట్టమొదటి సారి ట్రంప్ ఏర్పాటు చేసిన వార్షిక విందు కార్యక్రమంలో ఈ కాల్పులు జరిగాయి. చాలా సులభంగా నిందితుడు లోనికి ప్రవేశించడంతో ట్రంప్ భద్రతావలయం సందేహాస్పదంగా మారింది. నిందితుడిని కాలిఫోర్నియా రాష్ట్రం టోర్రన్స్‌కు చెందిన ఉపాధ్యాయుడు కోల్ థామస్ అలెన్ (31)గా గుర్తించారు. ఆసుపత్రికి తీసుకువెళ్ళి వైద్యపరీక్షలు చేయించిన అనంతరం అరెస్టు చేసి విచారణ ప్రారంభించారు. సోమవారం అతడిని కోర్టుముందు హాజరుపరుస్తారు. అతడి నివాసాన్ని కూడా సీక్రెట్ సర్వీస్ సిబ్బంది తమ ఆధీనంలోకి తరువాయి 2లో

# ఇక క్షేత్ర స్థాయికి ప్రజావాణి

- తక్షణమే రెవెన్యూ డివిజన్ స్థాయికి, ఆ తర్వాత మండల స్థాయికి విస్తరించాలి
- ప్రజావాణిలో ఆటో ఎస్కలేషన్ వ్యవస్థ అమలు చేయాలి
- అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలి
- ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువు ఉండాలి.. ఆలస్యం జరగకూడదు
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

**ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువు ఉండాలి. ఆలస్యం జరగొద్దు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి చేయాలి. జిల్లా, రాష్ట్ర స్థాయిలో 'రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలి. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలి.**
**– సిఎం రేవంత్‌రెడ్డి**



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజల నుంచి అందే అర్జీలను,ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన 'ప్రజావాణి' కార్యక్రమాన్ని ఇక క్షేత్ర స్థాయికి విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'ప్రజావాణి'లో "ఆటో ఎస్కలేషన్' వ్యవస్థను అమలు చేసి, అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. క్షేత్ర స్థాయి విస్తరణలో భాగంగా వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో, ఆ తర్వాత దశలో మండల స్థాయిలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని విస్తరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో సిఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో ఆదివారం సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంపైన రేవంత్ రెడ్డి సమీక్షించారు. ప్రజలు తరువాయి 12లో

## బ్రిటిష్ పాలకులకు మోదీకి తేడా లేదు

'విభజించు...పాలించు' తరహా విధానం

ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

12






## కాసులిస్తేనే కాన్పులు

సంగారెడ్డి జిల్లా మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో అవినీతి పర్వం

- ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- డబ్బులు డిమాండ్ చేసినవారిని మందలించాం
- ఆసుపత్రి ఆర్‌ఎంఒ

ప్రజాపక్షం/సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలకు వచ్చిన అందరికి లంచాల ఇబ్బందులు తప్పడం లేదు. ఎంసిహెచ్ లో నిత్యం 50 వరకు సాదారణ శస్త్ర చికిత్సల ద్వారా కాన్పులు చేస్తుంటారు, ఉచితంగా సేవలు అందించాల్సిన సర్కార్ దవాఖానాల్లో సేవలకు డబ్బులు తీసుకోవడం వల్ల పేదలపై ఆర్థిక భారం పడుతోంది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అవినీతి పెరుగుతుందని బాలింతల కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. మంచి గుర్తింపు ఉన్నప్పటికి జిల్లా జనరల్ ఆసుపత్రిలోని మాత శిశు ఆరోగ్య కేంద్రంలో 150 పడకలున్నాయి. ఇక్కడికి నిత్యం 200 నుండి 250 వరకు గర్భిణులు వివిధ పరీక్షలు ప్రసవాలకు వస్తుంటారు. గర్భిణులు వారి వెంట వచ్చే సహాయకులతో ఆసుపత్రి నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రసవాల్లో ఎంసిహెచ్ కి మంచి గుర్తింపు ఉన్నప్పటికి లంచాలతో ఆ పేరుకు మచ్చ తెస్తున్నారు.

సంగారెడ్డి ఇర్గిపల్లికి చెందిన గర్భిణిని రెండో కాన్పునకు స్థానిక మాతాశిశు ఆరోగ్య కేంద్రం (ఎంసిహెచ్)లో కుటుంబ సభ్యులు చేర్పించారు. ఆమెకు వైద్యులు శస్త్ర చికిత్స చేయగా ఆడ శిశువు తరువాయి 2లో

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై 'నేడు'

# భారత్-న్యూజిలాండ్ సంతకాలు

- ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో ముందడుగు
- వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, న్యూజిలాండ్ మంత్రి టాడ్‌మెక్‌క్లే సమక్షంలో ఒప్పందంపై సంతకాలు



**న్యూఢిల్లీ :** భారత్–న్యూజిలాండ్ ఇరుదేశాలు సోమవారం (ఏప్రిల్ 27) తమ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయనున్నాయి. గత ఏడాది డిసెంబరు 22న చర్చలు ముగిసినట్లు ప్రకటించిన నాలుగు నెలల తర్వాత ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో ముందడుగు వేస్తున్నాయి. ఈ ఒప్పందం భారతీయ కంపెనీలకు ఆ ద్వీప దేశ మార్కెట్లలో సుంకాల రహిత ప్రవేశాన్ని కల్పించడంతో పాటు రాబోయే 15ఏళ్లలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షిస్తుంది. వాణిజ్యం మంత్రిత్వ శాఖ ప్రకారం ఇక్కడి భారత్ మండపంలో వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి తరువాయి 12లో



## మహిళలకు కుట్టుమిషన్లు

- నియోజకవర్గంలో వెయ్యిమంది మహిళలకు 100శాతం సబ్సిడీతో మంజూరు
- త్వరలో దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల (బిసి)మహిళలకు 'స్వయం ఉపాధి' కల్పించే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో వెయ్యిమంది మహిళలకు '100 శాతం సబ్సిడీ'తో అత్యాధునిక ఆటోమేటిక్ కుట్టు మిషన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరలోనే ఈ స్కీములకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టనుంది. ఈ స్కీముకు సంబంధించి బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ తరువాయి 2లో

ఎంఎల్‌సిల నియామకంపై

## నోటిఫికేషన్ జారీ

ఆరేళ్లపాటు శాసనమండలి సభ్యులుగా కొనసాగనున్న కోదండరామ్, అజారుద్దీన్

ప్రజాపక్షం/హైదరాబాద్

గవర్నర్ కోటాలో రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌లు ఎంఎల్‌సిలుగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నోటిఫికేషన్ జారీ విడుదల చేసింది. నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచి (ఏప్రిల్ 26వ తేదీ ) ఆరు సంవత్సరాల వరకు మహ్మద్ అజారుద్దీన్, తరువాయి 2లో

# మళ్ళీ ఇస్లామాబాద్‌కు అరాఘ్చి

**మధ్యవర్తి పాకిస్థాన్ నాయకులతో చర్చ**
**ప్రతిష్ఠంభన మధ్య చిగురించిన ఆశ**



**దుబాయ్ :** ఇరాన్ విదేశీవ్యవహారాల మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఆదివారం సాయంత్రానికి మళ్ళీ పాకిస్థాన్‌కు చేరుకున్నారు. ఒమన్ దేశంలో సంక్షిప్త పర్యటన తర్వాత ఆయన మళ్ళీ ఇస్లామాబాద్‌కు తిరిగి వెళ్ళారు. శనివారం ఇస్లామాబాద్‌లో చర్చల తర్వాత ఒమన్ దేశానికి ఆయన హుటాహుటిన వెళ్ళారు. ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిఖ్‌తో పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులపై చర్చించారు. తర్వాత వెంటనే ఆయన మాతృదేశం ఇరాన్‌కు వెళ్ళకుండా చర్చల్లో మధ్యవర్తిదేశం పాకిస్థాన్‌కు చేరుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. శనివారం అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు జరగాల్సి ఉంది. అమెరికా ప్రతినిధులు చివరి నిమిషంలో ఇస్లామాబాద్‌కు వెళ్ళలేదు. దీంతో అమెరికా–ఇరాన్ మధ్య రెండో విడత చర్చలపై చీకట్లు కమ్ముకున్నాయని భావించారు. కానీ పాకిస్థాన్ చెప్పినవిధంగా అబ్బాస్ అరాఘ్చి తిరిగి ఇస్లామాబాద్‌కు చేరుకుని మధ్యవర్తిదేశ ప్రతినిధులు షెహబాజ్ షరీఫ్,ఆసిమ్ మునీర్‌లతో చర్చలు సన్నద్ధం కావడం కొత్త పరిణామం. ఒమన్ రాజుతో చర్చల తర్వాత అరాఘ్చి కొత్త నిర్ణయంతో, కొత్త సందేశంతో ఇస్లామాబాద్ చేరుకున్నారని భావిస్తున్నారు. ఐతే ఇదే సమయంలో ఆదివారం కూడా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు కొనసాగాయి. ఇజ్రాయెల్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి హింసాకాండ కొనసాగిస్తోంది. చర్చలకోసం పాకిస్థాన్ వెళ్ళాల్సిన అవసరం లేదని, ''అన్ని అస్త్రాలు'' మన దగ్గర ఉన్నందువల్ల చర్చలు కావాలంటే వాళ్ళే (ఇరాన్) మనల్ని అడుగుతారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శనివారం రాత్రి చెప్పడంతో అమెరికా ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ ఇస్లాల్డ్ పర్యటన వాయిదా పడింది. అదేరోజు రాత్రి పొద్దుపోయాక ఇరాన్ దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో సంభాషిస్తూ, హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం కొనసాగినంతకాలం అమెరికాతో చర్చలకు అవకాశమే లేదని స్పష్టం చేశారు. దిగ్బంధనంతో సహా రాకపోకలకు సంబంధించిన ఆటంకాలన్నింటినీ అమెరికా మొదట తొలగించాలని, ఆ తర్వాతే తాము చర్చల గురించి ఆలోచిస్తామని షరీఫ్‌కు పెజెష్కియన్ చెప్పారు. దీంతో ఈ రెండు దేశాల మధ్య పట్టువిడుపులు లేకుండా ప్రతిష్ఠంభన కొనసాగుతున్న దశలో అబ్బాస్ అరాఘ్చి ఆదివారం మళ్ళీ ఇస్లామాబాద్ చేరుకున్నారు. శనివారం ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, ఆ దేశ సర్వసైన్యాధిపతి ఆసిమ్ మునీర్‌లతో వేరు వేరుగా సమావేశాలు నిర్వహించి ఒమన్ దేశ పర్యటనకు బయలుదేరి వెళ్ళిపోయారు. శనివారం రెండో విడత అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు జరుగుతాయని పాకిస్థాన్ ప్రచారం చేసినాగానీ అరాఘ్చి చర్చలకోసం ఆగలేదు. దీంతో ఇక ఇస్లామాబాద్ వెళ్ళవద్దని స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్‌లకు ట్రంప్ ఆదేశించారు. 18 గంటలు విమాన ప్రయాణంతో సమయం వృథా చేసుకోవాల్సిన అవసరం లేదనీ, కావాలంటే వాళ్ళే మనల్ని చర్చలకు పిలుస్తారని ట్రంప్ ప్రకటించడంతో పెజెష్కియన్ పైవిధంగా స్పందించారు. నిర్దీత ప్రకారం గడచిన మంగళవారం (ఏప్రిల్ 21) జరగాల్సిన అమెరికా–ఇరాన్ చర్చలు ఇస్లామాబాద్‌లో శనివారం కూడా జరగలేదు. ఐతే ఒమన్,రష్యా దేశాల పర్యటన ముగించుకుని అబ్బాస్ అరాఘ్చి చర్చలకోసం సోమవారం ఇస్లామాబాద్‌కు వస్తారని పాకిస్థాన్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు అమెరికా రక్షణ మంత్రి హెగ్సెత్ మీడియాతో మాట్లాడుతూ, తాము తొందరపడటంలేదని, ఒక మంచి ఒప్పందం కోసం ఎదురుచూస్తున్నామని, ఎంతకాలమైనా హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం కొనసాగుతుందని హెచ్చరించారు. అమెరికా సైన్యాధిపతి డాన్ కైన్ మాట్లాడుతూ కాల్పుల విరమణ ఒప్పందం ముగిస్తే తిరిగి దాడులకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఇజ్రాయెల్ రక్షణమంత్రి కట్జ్ మరో ప్రకటన చేస్తూ, ఖమేనీ వంశాన్ని తుడిచిపెట్టేందుకు అమెరికా నుండి ''గ్రీన్ సిగ్నల్''కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. పశ్చిమాసియాలో అమెరికా–ఇరాన్ మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతున్నప్పటికీ కాల్పుల విరమణ మాత్రం అమలులో ఉంది. ఒప్పందం కుదిరేవరకూ కాల్పుల విరమణ, హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవుల దిగ్బంధం కొనసాగుతుందని ట్రంప్ ఇంతకుముందే ప్రకటంచారు. ఏప్రిల్ ఎనిమిదో తేదీన పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలు ప్రారంభమైంది. ఇరాన్ ఆదాయాన్ని అడ్డుకుని ఒకవైపు ఆర్థికంగా, మరోవైపు దౌత్యపరంగా ఒత్తిడిచేయాలని ట్రంప్ ప్రయత్నిస్తుండగా, ఇలాంటి లొంగదీసుకునే చర్యలను ఇరాన్ తిరస్కరిస్తోంది.

# ఇప్పటివరకూ పదిసార్లు తప్పించుకున్న ట్రంప్



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గడచిన పది సంవత్సరాలలో ఇప్పటివరకూ దాదాపు పదిసార్లు హత్యా ప్రయత్నాల నుండి బయటపడ్డారు. ఇందులో కొన్ని విఫలయత్నాలు కూడా ఉన్నాయి. కొన్నింటినుండి సునాయాసంగా తప్పించుకున్నారు. అధికారంలోకి వచ్చాక రెండు సార్లు దాడులు జరిగాయి. గడచిన దశాబ్దకాలంగా చూస్తే చిన్నా చితకా అన్ని రకాల దాడులు కలిపితే పదిసార్లు ఆయన తప్పించుకున్నారు. శనివారం రాత్రి వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో ట్రంప్‌పై దాడి జరిగినట్లుగానే 1981 మార్చినెలలో నాటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పై కూడా ఇదే హోటల్‌లో కాల్పులు జరిగాయి. ఆనాడు ఆయన ఛాతీలోకి బుల్లెట్లు దూసుకెళ్ళాయి. వెంటనే ఆయనకు అత్యవసర చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఆయన ప్రెస్ కార్యదర్శి జేమ్స్ బ్రాడీతోపాటు మరో ముగ్గురు కూడా గాయపడ్డారు. పెన్సిల్వేనియాలో 2016 మార్చిలో ఓహియోలో జరిగిన ర్యాలీలో ఒక వ్యక్తి వేదికపైకి దూసుకువచ్చి దాడికి యత్నించాడు. ఆ తర్వాత జూన్ 18న జరిగిన ఎన్నికల ప్రచారంలో లాస్‌వేగస్‌లో బ్రిటన్ జాతీయుడు శాన్‌ఫోర్డ్ అనే వ్యక్తి పోలీసు అధికారి సర్వీస్ పిస్టోలు లాక్కుని ట్రంప్‌పై దాడికి యత్నించాడు. అతడికి 12 నెలలు శిక్ష విధించారు. తర్వాత అతడిని బ్రిటన్‌కు తరలించారు.2016 నవంబరులో నెవాడాలోని రెనోలో జరిగిన ర్యాలీలో కూడా ఒక వ్యక్తి దాడికి ప్రయత్నించగా ట్రంప్ చాకచక్యంగా తప్పించుకుని దూరారు. 2017 సెప్టెంబరులో అధ్యక్షుడి మోటార్ కేడ్‌పై దాడికి ఒక వ్యక్తి యత్నించాడు. ట్రంప్‌ను చంపాలనుకున్నానని చెప్పాడు. అతడికి ఇరవై సంవత్సరాలు జైలుశిక్ష విధించారు. 2018లో పోస్టుద్వారా ఆయనపై విషప్రయోగ ప్రయత్నం జరిగింది. 2020 ఆగస్టులో వైట్ హౌస్ ఫెన్సింగ్ వద్ద ఒక సాయుధ దుండగుణ్ణి కాల్చి చంపారు. ఐఫిల్‌లో అరెస్టు చేసిన కెనడా మహిళ ఫెర్రెరకు కోర్టు 22 ఏళ్ళ జైలుశిక్ష విధించింది. ఇక 2024 జులై 13వ తేదీన ట్రంప్ పెన్సిల్వేనియా బట్లర్‌లోని సభలో మాట్లాడుతుండగా, అమెరికా యువకుడు థామస్ క్రూక్ ఎఆర్–15 రకం తుపాకీతో ఎనిమిదిసార్లు కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఒక తూటా ట్రంప్ చెవి దగ్గర నుండి దూసుకుపోయింది. ఆయనకు వెంటనే సీక్రెట్ సర్వీస్ సిబ్బంది రక్షణ ఇచ్చారు. ప్రేక్షకులలో ఒక వ్యక్తి ఆనాడు మరణించారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ రాజీనామాకు దారితీసింది. 2025 సెప్టెంబరులో వెస్ట్‌పామ్ బీచ్‌లో జరిగిన మరో దాడిలో మెక్సికో వ్యక్తి రూత్‌ను అరెస్టుచేసి జీవితకాల శిక్ష విధించారు.

# 'మెటా'లో ఎనిమిది వేల ఉద్యోగాలు కోత




**మెన్లోపార్క్:** బహుళజాతి సాంకేతిక కంపెనీ మెటా కూడా కృత్రిమ మేధను ఎక్కువ ఉపయోగించేందుకు సిద్ధమైంది. అందులో ఎక్కువ పెట్టుబడులు పెట్టేందుకు సన్నద్ధమైంది. దీంతో పది శాతం ఉద్యోగాలు అంటే 8000 ఉద్యోగాల్లో మెటా కోత పెడుతోంది. అదేవిధంగా తదుపరి జరగాల్సిన మరో 6000 రిక్రూట్‌మెంట్‌లను కూడా శాశ్వతంగా భర్తీచేయకుండా నిలిపివేస్తోంది. దీనికి మరో నాలుగు వారాలు గడువు విధించారు. ఈ పరిస్థితులమధ్య రాబోయే నెల రోజులపాటు ఉద్యోగులు తీవ్ర భావోద్వేగం, నరకం అనుభవించనున్నారు. కృత్రిమ మేధ మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవడం కోసం ఈ ఏడాదిలో 115 బిలియన్ డాలర్ల నుండి 135 బిలియన్ డాలర్ల మేరకు మూలధనం పెట్టుబడులు సమకూరుస్తోంది. గత ఏడాది 72 బిలియన్ డాలర్లు మాత్రమే పెట్టుబడి పెట్టగా, ఈ ఏడాది ఈ పెట్టుబడిని రెట్టింపు చేసింది. జుకర్‌బెర్గ్ ఈ విషయంలో ఎలాంటి రహస్యాలు పాటించడంలేదు. కంపెనీలో కృత్రిమ మేధకే రాబోయేకకాలంలో ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. అమెరికా ఉద్యోగులకు 16 వారాల జీతంతోపాటు మరో రెండు వారాల అదనపు సేవల వేతనం కూడా ఇస్తారు. దీంతోపాటు 18నెలలపాటు కోబ్రా హెల్త్ సర్వీస్ సదుపాయం ఉంటుంది. 2022 నుండి మెటాలో లేఆఫ్‌లు అమలు చేస్తున్నారు. అమెరికా కాలిఫోర్నియా రాష్ట్రం మెన్లోపార్క్ కేంద్రంగా పనిచేస్తున్న మెటా కంపెనీ చీఫ్ పీపుల్ ఆఫీసర్ జానెల్లె గాల్ అంతర్గతంగా ఈ మేరకు ఒక ఉద్యోగులకు ఒక మెమో జారీ చేశారు.

ఇప్పటివరకూ రహస్యంగా ఉంచిన ఈ ప్రణాళిక బయటకు పొక్కిపోవడంతో ఇక ఈ ప్రణాళికను నిరాఘాటంగా ముందుకు తీసుకువెళ్ళాలని మెటా వర్గాలు నిర్ణయించుకున్నాయి. రాబోయే నాలుగు వారాల్లో ఎవరెవరి ఉద్యోగాలు ఊడిపోతాయన్న విషయం తేలుతుంది. దీనికి ముహూర్తం నిర్ణయించారు గానీ, ఉద్వాసన పలికే సిబ్బంది పేర్ల జాబితాను ఇంకా ఖరారు చేయలేదు. ఐతే కంపెనీలో ఉద్యోగులు ఇప్పటికే ఈ వేదనతో నరకం అనుభవిస్తున్నారు. ఈ విషాదం మధ్య జోకులు కూడా పేలుతున్నాయి.

## ఉగ్రవాదులు,సాయుధుల సమన్వయదాడుల్లో..
# మాలి రక్షణమంత్రి సాడియో కామారా హతం



**బమాకో :** పశ్చిమాఫ్రికాలోని భూపరివేష్టిత దేశం మాలిలో అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థ నాయకత్వంలో పలు సాయుధ ముఠాలు పరస్పర సమన్వయంతో ఏకకాలంలో రెండు రోజులుగా చేస్తున్న దాడుల్లో మాలి రక్షణమంత్రి సాడియో కామారా హతుడయ్యారు. 2020–2021లలో జరిగిన సైనిక కుట్రల్లో ప్రభుత్వ అధికారం స్వాధీనం చేసుకోవడంలో కామారా కీలక పాత్ర వహించారు. ఆయన హత్య మాలిలో సైనికబలగాలకు అతిపెద్ద దెబ్బ.ఉగ్రవాద సంస్థలు,సాయుధ ముఠాలు సమన్వయంతో శనివారం సైనిక స్థావరాలపై ప్రారంభించిన దాడులు ఆదివారం కూడా కొనసాగుతున్నాయి. సైన్యం ఈ దాడులను ప్రతిఘటిస్తోంది. అల్‌ఖైదీ అనుబంధ జెఎన్ఎల్ఎం సంస్థతోపాటు టువారెగ్ తిరుగుబాటు దారులు కటి సైనికస్థావర ప్రాంతంలో ఉన్న రక్షణమంత్రి నివాసంపై దాడి చేసి ఆయనను హతమార్చారు. దేశ రాజధాని బమాకో సహా అనేక ప్రాంతాలలో కర్ఫ్యూ విధించారు. రాజధాని శివార్లలో ఉన్న కటి సైనిక స్థావరం శనివారం పేలుళ్ళు, కాల్పులతో దద్దరిల్లింది. మాలి,అంతర్జాతీయ విమానాశ్రయాలు సహా అనేక ప్రధాన నగరాలలో ఒకేసారి ఈ తిరుగుబాటు దాడులు ప్రారంభమయ్యాయి. ప్రధాన ప్రభుత్వ సైనిక స్థావరంపై సాయుధ ముఠాలు సమన్వయ దాడులు చేశాయి. ''ప్రస్తుతం దాడులు కొనసాగుతున్నాయి. సాయుధ ముఠాలను తిప్పికొట్టే పనిలో ఉన్నాం, పరిస్థితి అదుపులో ఉంది'' అని రెండో రోజు ఆదివారం సైన్యం ఒక ప్రకటనలో తెలియజేసినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. ఈ ప్రాంతంలో రహదారులను సైన్యం మూసివేసింది.రాజధానికి వచ్చే విమానాలను కూడా రద్దుచేశారు. ఉత్తర మాలిలోని గావో,కిడార్, మధ్య మాలిలోని సెవారేలో కూడా దాడులు జరిగాయని ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పారు. ఇటీవలికాలంలో దేశంలో జరిగిన అతిపెద్ద జీహదీ ఇదే అని అక్కడి విశ్లేషకులు చెప్పారు.అల్‌ఖైదీ అనుబంధ జెఎన్ఎల్ఎం సంస్థ తమ అజల్లాక్ వెబ్‌సైట్ ద్వారా ఈ తిరుగుబాటుకు తామే కారణమని,అజావాద్ లిబరేషన్ ఫ్రంట్‌తో కలిసి ఈ తిరుగుబాటు చేసినట్లు ప్రకటించింది. మాలీలో గతంలో ఇదేవిధంగా ఉగ్రవాద సంస్థలు తిరుగుబాటు చేశాయి.

## రఘురాయ్ కన్నుమూత
(మొదటి పేజీ తరువాయి)

శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. రఘురాయ్‌కు రాజకీయ, మీడియా ప్రముఖులు సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఫొటో జర్నలిజంలో ఆయన సేవలను కొనియాడారు. రఘురాయ్ కెమెరా క్లిక్ మంటే అది చరిత్రే. ముఖ్యంగా భోపాల్ గ్యాస్ దుర్ఘటన సమయంలో ఆయన తీసిన ఛాయాచిత్రాలు ప్రపంచాన్ని నివ్వెరపరిచాయి. సగం పూడ్చిపెట్టిన ఒక చిన్నారి కళ్లలోని విషాదాన్ని ఆయన బంధించిన తీరు... ఆ దుర్ఘటన తీవ్రతను కళ్లకు కట్టింది. గుండెలు పిండేసే ఈ ఘటనపై ఆయన 'ఎక్స్‌పోజర్: ఏ కార్పొరేట్ క్రైమ్' అనే పుస్తకాన్ని, డాక్యుమెంటరీని కూడా రూపొందించారు. ఇందిరాగాంధీ కాలం నాటి దేశ అగ్రశ్రేణి నాయకుల అరుదైన ఫొటోలు ఆయన సేకరణలో ఉన్నాయి. మదర్ థెరిసాకు పోప్ సెయింట్ హోదా ఇవ్వడానికి చాలాకాలం ముందే రఘు రాయ్ ఆమె జీవితంపై 'సెయింట్ మదర్' అనే ప్రసిద్ధ పుస్తకం ప్రచురించారు. ఆమె సేవా కార్యక్రమాలను అత్యంత సుదీర్ఘంగా రికార్డ్ చేసిన ఏకైక ఫొటోగ్రాఫర్ ఆయనే. ఆయన దేశ నలువలలా పర్యటించి భారతీయ ఆత్మను తన చిత్రాల్లో అద్భుతంగా బంధించారు. 1962లో 'ది స్టేట్స్‌మన్' పత్రికతో వత్తి ప్రారంభించిన ఆయన... ప్రపంచ ప్రఖ్యాత 'మాగ్నమ్ ఫొటోస్'లో సభ్యుడిగా ఎదిగారు. ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్ హెన్రీ కార్టియర్ బ్రెస్సన్ స్వయంగా రాయ్‌ను నామినేట్ చేయడం విశేషం.

టైమ్, లైఫ్, న్యూయార్క్ టైమ్స్ వంటి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పత్రికల్లో ఆయన చిత్రాలు ప్రచురితమయ్యాయి. తన జీవితకాలంలో 18కి పైగా పుస్తకాలు రచించిన ఆయన... వరల్డ్ ప్రెస్ ఫొటో పోటీలకు వడుసార్లు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.

## ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ
(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మధ్య ప్రాచ్య ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి ద్వారా వస్తువుల రవాణాకు అంతరాయాలు... ఎగుమతులను ప్రభావితం చేసిన ప్రధాన కారకాలు. అయితే, మోదీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడం ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసిందని ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. వస్త్రాలు, చేనేత వస్త్రాల ప్రపంచ మార్కెట్ వాటాలో క్షీణత దేశ విదేశీ మారక నిల్వలపై ప్రభావం చూపుతుంది. వియత్నాం, బంగ్లాదేశ్ వంటి దేశాలు తమ ఉత్పత్తులను తక్కువ ధరకే మార్కెట్‌లోకి తీసుకువస్తుండగా, భారతీయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడలేకపోతున్నాయి. పెరుగుతున్న ముడిసరుకుల ధరలు, విద్యుత్ బిల్లులు చిన్న తయారీదారులను కుంగదీస్తున్నాయి. ఈ సంక్షోభం వ తయారీ రంగంపై ఆధారపడిన లక్షలాది కార్మికులు, పారిశ్రామికవేత్తలపై నేరుగా ప్రభావం చూపుతుంది. పెద్ద కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ప్రకటిస్తున్న కేంద్ర ప్రభుత్వం, దేశంలోని చిన్న వ తయారీ నిట్లను కాపాడటానికి చర్యలు తీసుకోవడం లేదు. విదేశీ మార్కెట్లలోని సవాళ్లను ముందుగానే ఊహించి ఎగుమతి ప్రోత్సాహక పథకాలను అమలు చేయడంలో విఫలమవడమే ఈ క్షీణతకు ప్రధాన కారణం. ప్రపంచ వాణిజ్యంలో భారతదేశ వాటా తగ్గడం దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థపై ఖచ్చితంగా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

## కాసులిస్తేనే కాన్పులు
(మొదటి పేజీ తరువాయి)

జన్మించింది. అక్కడి సిబ్బంది శస్త్ర చికిత్స కు రూ. 1000, దుస్తులు మర్చినందుకు రూ. 200, వార్డులోకి షిఫ్ట్ చేసినందుకు రూ. 200 చొప్పున వసూలు చేశారని బాలింత భర్త తెలిపారు. అందోలు మండలం నేరడి గుంటకు చెందిన గర్భిణిని మూడో కాన్పుకు సంగారెడ్డి ఎంసిహెచ్‌లో కుటుంబీకులు చేర్పించారు. ఆమెకు వైద్యులు శస్త్ర చికిత్స చేయగా మగ శిశువు,పుట్టాడు. ప్రతి సేవకు సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ప్రసవం రోజు మొత్తం రూ. 3వేలు లంచం ఇవ్వాల్సి వచ్చిందని బాలింత కుటుంబీలకు ఆవేదన వ్యక్తం చేశారు.

**చర్యలు తీసుకుంటాం : ఆర్ఎంఒ**

మాత శిశు ఆరోగ్య కేంద్రానికి ప్రసవాలకు వచ్చిన వారి నుంచి డబ్బులు తీసుకోవడం నేరం, ఇటీవల మగ్గురు ఆయాలు ,ఇద్దరు స్టాఫ్ నర్సులు, డబ్బులు డిమాండ్ చేసినట్లుగా తేలడంతో వారిని మందలించాం, ఎంసిహెచ్‌లో సేవలకు వచ్చే వారు ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు,.

**ఫిర్యాదు చేసినా స్పందనేది?**

ఇటీవల ఓ బాలింత నుంచి ఆసుపత్రి సిబ్బంది. రూ. 1500 తీసుకొని అదనంగా రూ. 1500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంబంధిత కుటుంబీకులు ఆసుపత్రి వైద్యులకు పిర్యాదు చేశారు. వైద్యులు విచారణ చేయించగా నిజమని తేలింది. స్టాప్ నర్సులు,సిబ్బందిని మందలించి వదిలేశారు. ఏలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో లంచాల పర్వం యథావిధిగా కొనసాగుతోంది. ఇది భాదకరమైన విషయం.

## మహిళలకు కుట్టుమిషన్లు
(మొదటి పేజీ తరువాయి)

ఉన్నతాధికారులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, బిసి కార్పొరేషన్ ఎండి మల్లయ్య బట్టు తదితరులు పాల్గొన్నారు.'టైలరింగ్ ఆధారిత స్వయం ఉపాధి' కల్పించి, బిసి మహిళలల్లో ఉత్పాదకతను పెంచి, టైలరింగ్ వ్యాపార అవకాశాలను విస్తరించడంతో పాటు, స్వయం సమృద్ధిగల పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు 'ఆటోమేటిక్ కుట్టు యంత్రాలను' మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బలహీన వర్గాల శాఖ పక్షాన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలను అమలు చేసేందుకు బిసి సంక్షేమ శాఖ ప్రణాళికలు చేస్తుందన్నారు.

## నోటిఫికేషన్ జారీ
(మొదటి పేజీ తరువాయి)

కోదండరామ్ ఎంఎల్‌సిలుగా కొనసాగనున్నారు. కాగా గవర్నర్ కోటా ఎంఎల్‌సిలుగా ఉన్న డి.రాజేశ్వర్ రావు, ఫారూఖ్ హుసేన్ పదవీకాలం 2023, మే 27వ తేదీతో ముగిసింది. దీంతో వారి స్థానంలో రాష్ట్ర మంత్రివర్గం మహ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ పేర్లను గవర్నర్‌కు సిఫారసు చేసింది. ఈ సిఫార్సులను గవర్నర్ ఆమోదించారు.

## ఆప్ సమీక్షించుకోవాలి
(మొదటి పేజీ తరువాయి)

అభివర్ణించారు. దీనికి విస్తత రాజకీయ పర్యవసానాలు ఉండవచ్చని, ముఖ్యంగా ఆప్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పంజాబ్‌లో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు. 'అసలు ఇటువంటి వ్యక్తులు ఎందుకు ఎన్నికయ్యారు? వారు ఈ విధంగా పార్టీని ఎందుకు వీడి వెళ్తున్నారు? అనే విషయాలను ఆప్ తీవ్రంగా పరిగణించాలి. దీనిపై లోతయిన విశ్లేషణ, సమీక్ష జరుపుకోవాల్సిన బాధ్యత ఆప్‌దే. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున, అక్కడ దీని ప్రభావం కచ్చితంగా ఉంటుంది.

ఇటువంటి పోకడలు ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యం పరిస్థితి ఏమవుతుంది?' అని ఆయన ప్రశ్నించారు.

## జెఎసి నేతలు కృతజ్ఞతలు
(మొదటి పేజీ తరువాయి)

సుద్దాల సురేష్, బి. యాదగిరిలు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. జెఎసి ఆధ్వర్యంలో గత రెండున్నర సంవత్సరాల నుంచి అనేక ఉద్యమాలు నిర్వహించి ఆరు సంఘాలతో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమాలు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే సమ్మె నోటీస్ ఇచ్చి సమ్మెలోకి వెళ్లడం రాష్ట్ర మంత్రుల సమక్షంలో,ప్రభుత్వ అధికారుల సమక్షంలో తమ ముఖ్య డిమాండ్లు గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీన ప్రక్రియతో పాటు పలు అంశాలను ఆమోదించడం సంతోషం కలిగించదన్నారు.తమ సమ్మెకు మద్దుతు తెలిపిన ప్రజా సంఘాలు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో పాటు పలువురు నేతలకు మీడియా మిత్రలకు వారు కృతజ్ఞతలు తెలిజయేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తమను అగౌరపరించదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## స్వీయ నమోదు షురూ
(మొదటి పేజీ తరువాయి)

తదితరులు పాల్గొన్నారు. జనగణ 2027లో ప్రతి కుటుంబం లెక్కలో చేరేందుకు స్వీయ గణనలో పాల్గొనాలని రామకృష్ణా రావు కోరారు.

**జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా**

జనగణన అనేది కేవలం అంకెల సేకరణ మాత్రమే కాదని, అది దేశ ప్రణాళిక, సుపరిపాలన, వనరుల సమాన పంపిణీకి పునాది అని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి జనగణన అని తెలిపారు. కచ్చితమైన సమాచారం ఉంటేనే లక్షిత సంక్షేమ పథకాల రూపకల్పన సాధ్యమవుతుందని, దేశ పురోగతిని అంచనా వేయడానికి ఇది కీలకమని చెప్పారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రవేశపెట్టిన 'స్వీయ గణన' విధానం ప్రగతిశీల వ్యవస్థకు నిదర్శనమన్నారు. 'ప్రతి కుటుంబం బాధ్యతగా ముందుకు వచ్చి జనగణనలో పాల్గొనాలి,ఇది మన రాష్ట్ర, దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన జాతీయ కార్యక్రమం.' అని శివప్రతాప్ శుక్లా అన్నారు.

భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు జనగణన కీలకం : సిఎం రేవంత్ రెడ్డి

దేశాభివృద్ధికి, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు జనగణన అత్యంత కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జనగణన వంటి కీలక కార్యక్రమంలో రాష్ట్ర ప్రజలంతా చురుకుగా పాల్గొని, తమ వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ఈ ప్రక్రియ ద్వారా ఖచ్చితమైన జనాభా లెక్కల సేకరణ సాధ్యమవుతుందన్నారు.

**ప్రభుత్వ పథకాలు ఆగుతాయనే భయం వదు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

జనగణనలో వివరాలను నమోదు చేస్తే ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయేమో అనే భయం ప్రజల్లో ఉండాల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చే వివరాలతో వ్యక్తిగతంగా ఎలాంటి ఇబ్బందులు కలగబోవని స్పష్టం చేశారు. జనాభా లెక్కలు కేవలం తలల లెక్క కాదని, ఇది దేశ భవిష్యత్తుకు దిక్సూచి లాంటిదన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఈ గణాంకాలు పునాదిగా మారుతాయన్నారు. ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం మే 10వ తేదీ వరకు అవకాశం కల్పించిందన్నారు. ఈ స్వీయ నమోదు విధానం వల్ల పారదర్శకతను పెంచడంతో పాటు ప్రజల విలువైన సమయాన్ని ఆదా చేస్తుందన్నారు.

## ట్రంప్‌పై హత్యాయత్నం
(మొదటి పేజీ తరువాయి)

తెచ్చుకున్నాయి. ఎఫ్ఐబి అధికారులు షాట్‌గన్,హ్యాండ్‌గన్ సహా అనేక కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అతడివద్ద అనేక ఆయుధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఐతే ట్రంప్ అధికారులపైనే తాను ప్రధానంగా గురిపెట్టినట్లు నిందితుడు ప్రాథమికంగా చెప్పాడని సిబిఎస్ న్యూస్ పేర్కొంది. కానీ దాడి వెనుక అతడి అసలుఉద్దేశం, ప్రధానంగా ఎవరిని లక్ష్యంగా ఎంచుకున్నాడు? అనే విషయం ఇంకా పూర్తిగా వెల్లడికాలేదు. నిందితుణ్ణి ప్రశ్నిస్తుంటే అధికారులకు సహకరించడంలేదని అటార్నీ జనరల్ చెప్పారు.

వేలాదిమంది అతిథులమధ్య నిందితుడు అలెన్ కూడా ఈ డిన్నర్‌కు ఒక అతిథిగా వచ్చాడు. ఈ డిన్నర్ జరుగుతున్న సమయంలో ట్రంప్ ప్రసంగించడానికి కొద్ది నిమిషాల ముందు లాబీ వద్ద స్క్రీనింగ్ ఏరియాలో ఉన్న సీక్రెస్ సర్వీసెస్ చెక్‌పాయింట్ దగ్గరకు వచ్చి అధికారులను లక్ష్యంగా చేసుకుని దుండగుడు అలెన్ ఐదు నుండి ఎనిమిది రౌండ్ల కాల్పులు జరిపాడు. కాల్పుల శబ్దం విని లోపల అందరూ అప్రమత్తమయ్యారు. ట్రంప్‌తోపాటు ఆయన సతీమణి మెలనియా, దేశ ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఇతర మంత్రివర్గ సభ్యులందరినీ సురక్షితంగా అక్కడి నుండి తరలించారు . కాల్పుల ఘటన అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, డిన్నర్‌లో శబ్దాలు విని ఏదో ఒక పళ్ళెం నేలమీద పడిపోయిందని తాను భావించానన్నారు. భద్రతా సిబ్బంది పనితీరును, వారి అప్రమత్తతను ప్రశంసిస్తూ, తమ గడి సురక్షితంగానే ఉందన్నారు. ఒకేఒక్క తోడేలు ఒంటరిగా తనపై దాడికి సిద్ధపడిందని, ఒక సీక్రెట్ ఏజంట్‌పై కాల్పులు జరిపాడని, కానీ ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని చెప్పారు. డిన్నర్ సమయంలో వెలుపల పెద్ద పెద్ద ధ్వనులు తనకు వినిపించాయన్నారు. నిందితుడు కాలిఫోర్నియా టెక్ ఇనిస్టిట్యూట్ నుండి గ్రాడ్యుయేట్ పట్టా తీసుకున్నాడన్నారు. ఇరాన్‌లో జరుగుతున్న యుద్ధానికీ, ఈ కాల్పుల ఘటనకు ఎలాంటి సంబంధం లేదని అనుకుంటు



న్నానన్నారు. అదేసమయంలో, ఇరాన్‌పై యుద్ధంలో విజయం సాధించకుండా తనను ఎవ్వరూ వెనక్కు లాగలేరని కూడా వ్యాఖ్యానించారు. తనకు ప్రాణగండం ఉందని మంత్రివర్గ సభ్యులు, అధికారులు ముందుగానే హెచ్చరించారని, ఇలాంటి రిస్కు లేకుండా అధ్యక్ష పదవిని నిర్వహించలేరన్నారు. రాజకీయ హింస ఏ దేశానికీ అతీతం కాదన్నారు. రాబోయే 30 రోజుల్లో మరోసారి వైట్‌హౌస్ మీడియాకు ఈ డిన్నర్‌ను పునరుద్ధరిస్తామని చెప్పారు. అదేవిధంగా వైట్‌హౌస్‌లో ఒక విశాలమైన బాల్‌రూమ్ లేకపోవడంవల్లనే ఇలాంటి అర్థం సంభవించిందిని, గడచిన 150 సంవత్సరాలుగా అధ్యక్షులుగా పనిచేసిన అనేకమందితోపాటు సైనిక అధికారులు తాను కూడా బాల్ రూమ్ నిర్మించాలని డిమాండ్ చేస్తున్నామని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఈ బాల్‌రూమ్ నిర్మాణం విషయం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది.

ఇదిలా ఉండగా, వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లీవిట్ తొలుత వైట్‌హౌస్ కరస్పాండెంట్లు అందరినీ డిన్నర్‌కు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ట్రంప్ ఈ సమావేశంలో మాటల తూటాలు పేలుస్తారని, తనదైన శైలిలో విమర్శలు,వ్యాఖ్యలు గుప్పిస్తారని లీవిట్ వ్యాఖ్యానించారు. కానీ ఒక దుండగుడు అక్రమంగా డిన్నర్‌లోకి జొరబడి నిజంగానే తూటాలు పేల్చడం చర్చనీయాంశమైంది.

**మోదీ సహా ప్రపంచ నేతల దిగ్భ్రాంతి**

హిల్టన్ హోటల్‌లో మీడియా డిన్నర్ సమావేశంలో శనివారం రాత్రి కాల్పుల ఘటనపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా ప్రపంచదేశాల నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మోదీ తన సందేశంలో ఈ దాడులను తీవ్రంగా ఖండించారు. దేశాధ్యక్షుడు ట్రంప్,ప్రథమ మహిళ మెలనియాలు సురక్షితంగా ఉన్నారని తెలిశాక తానెంతో ఊరట చెందానని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ''ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదు, దీనిని నిస్సందేహంగా ఖండించాలి, వారి భద్రత,క్షేమం కొనసాగాలి, వారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను'' అని మోదీ పేర్కొన్నారు. బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలపై, పత్రికా స్వేచ్ఛపై ఎలాంటి దాడులు ఏ రూపేణా జరిగినా చాలా తీవ్రంగా ఖండించాలన్నారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ఒక ప్రకటన చేస్తూ ఈ దాడి వార్త విన్నవెంటనే తాను, తన భార్య సారా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామన్నారు. గాయపడిన పోలీసు అధికారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎంతో ధైర్యంగా దాడిని ప్రతిఘటించిన భద్రతా సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. అధ్యక్షుడు, ప్రథమ మహిళ, ఇతర అధికారులు, సిబ్బంది క్షేమంగా ఉన్నారని తెలిశాక తానెంతో ఊరట చెందానని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఏ ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ హింసకు తావు లేదని అన్నారు.

మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ ఎక్స్‌వేదికగా స్పందిస్తూ, ''అధ్యక్షుడు,ప్రథమ మహిళ, ఇతర సిబ్బంది క్షేమంగా ఉండటం మంచి విషయం, వారిపట్ల నా సంపూర్ణ గౌరవం ప్రకటిస్తున్నాను, హింస ఎప్పటికీ మార్గం కాకూడదు'' అని పేర్కొన్నారు. స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్ ఒక ప్రకటన చేస్తూ, హింస ఎప్పటికీ సమాధానం కాకూడదన్నారు. కాల్పుల ఘటనను ఆయన ఖండిస్తూ, ప్రజాస్వామ్యం, శాంతి,సహజీవనం ద్వారా మాత్రమే మానవత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఒక ప్రకటన చేస్తూ కలవరపరచే కాల్పుల ఘటనపట్ల తానెంతో దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. వారు నిరంతరం సురక్షితంగా క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నానన్నారు.



## ప్రజా ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజాప్రభుత్వం ద్వారానే సొంతింటి కల నెరవేరిందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దుబ్బతండాలో లబ్ధిదారులు మాలోతు శివజ్యోతిలు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పదేండ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం పేదవాళ్లకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వలేకపోయిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. నియోజకవర్గంలో 3500 ఇండ్లు పేదలకు అందించేందుకు చర్యలు చేపడ్తామన్నారు. పేదలకు సన్న బియ్యం, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని సీత్యతండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వాటిని పరిష్కరించేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయాలు కేంద్రం కావాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధనావత్ రవినాయక్, వార్డు మెంబర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలతో వచ్చిన ధాన్యం వెంటనే కొనుగోలు

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** సరైన నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు.ఆదివారం ఆయన జిల్లా కేంద్రం సమీపంలోని జి. చెన్నారం, ఎస్.ఎల్.బి.సి మార్కెట్ యార్డ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు లల్లాయిగూడ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలు, తాలు, తరుగు, తేమ, తూకం, తూకం యంత్రాలు, రిజిస్టర్లు, రైతులకు ఏర్పాటు చేసిన నీడ, తాగునీటి సౌకర్యం తదితర అంశాలను పరిశీలించారు.ఆయా కొనుగోలు కేంద్రాలలో నిర్వాహకులతో పాటు రైతులతో కూడా కలెక్టర్ మాట్లాడారు. తాలు, తరుగు లేకుండా సరైన నాణ్యత ప్రమాణాలతో ధాన్యం వస్తే తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని సూచించారు.నాణ్యత ఉన్నవి, లేనివి కలిపి మిల్లులకు పంపవద్దని, వేర్వేరుగా పంపించాలని తెలిపారు. అలాగే ధాన్యం సేకరణలోనూ, మిల్లులకు తరలింపులోనూ ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని సెంటర్ ఇన్‌చార్జిలను ఆదేశించారు.ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## నల్గొండలో వ్యభిచార గుట్టు రట్టు నలుగురు అరెస్ట్



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదరాబాద్ రోడ్,శ్రీనగర్ కాలనీలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార గుట్టును పోలీసులు రట్టు చేశారు.ఈ ఘటనలో ఇద్దరు నిర్వాహకులు, ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం నిన్న సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో వ్యభిచారం జరుగుతున్నట్లు నమ్మదగిన సమాచారం అందడంతో సిఐ రాఘవరావు, ఎస్ఐ సైదులు వారి సిబ్బంది దాడి నిర్వహించారు.ఈదాడిలో గున్‌రెడ్డి వెంకటరెడ్డి, లక్కమోరపు నవ్య గత కొంతకాలంగా సహజీవనం చేస్తూ, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో డబ్బు అవసరం ఉన్న యువతులు, వివాహితలతో పరిచయం పెంచుకుని వారిని అద్దె ఇంటికి పిలిపించేవారని గుర్తించారు.వారి ఫోటోలను వాట్సాప్ ద్వారా కస్టమర్లకు పంపించి, రేటు కుదిరిన తర్వాత అదే ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఇద్దరు యువతులు, ఇద్దరు విటులతో వ్యభిచారం నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఈ కేసులో గున్‌రెడ్డి వెంకటరెడ్డి,లక్కమోరపు నవ్యతో పాటు ఉదయ్,శివకృష్ణలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.బాధిత యువతులను కౌన్సిలింగ్ కోసం సఖి కేంద్రానికి పంపించినట్లు పోలీసులు తెలిపారు.

## డ్రగ్స్ నిర్మూలనపై వారం రోజులు అవగాహన కార్యక్రమాలు

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పిల్లల భద్రత, మాదక ద్రవ్యాల నిర్మూలనపై జిల్లా వ్యాప్తంగా వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌పి కె. నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయంగా పనిచేస్తామన్నారు. అన్ని గ్రామాలకు పోలీసు సిబ్బంది వెళ్లి డ్రగ్స్ వల్ల జరుగుతున్న అనర్థాల గురించి, పిల్లల, యువత భవిష్యత్తుపై దుష్ప్రభావం గురించి వివరించనున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని వివరించారు. మత్తుకు అలవాటు పడి నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మన పిల్లలు మన సమాజాన్ని మాదకద్రవ్యాల బారి నుండి కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గంజాయి సరఫరా, వినియోగంపై నిఘా ఉంచడం జరిగిందని, గతంలో గంజాయి కేసుల్లో ఉన్న వారిపై వినియోగించే వారిపై పోలీసు నిఘా ఉంచామన్నారు. వీరికి కౌన్సిలింగ్ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మాదకద్రవ్యాల రహిత ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఈ అవగాహన కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువత భాగస్వామ్యం కావాలని కోరారు.

వాసవి మాత ఆశీస్సులతో ...

# ప్రతీ కుటుంబం సంతోషంగా ఉండాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

వాసవి మాత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం విశేషం



**ప్రజాపక్షం/నల్లగొండ:** వాసవి మాత ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని బీట్ మార్కెట్‌లోని రామకోటి స్థూప దేవాలయం , గాంధీ పార్క్‌లో ఘనంగా నిర్వహించిన వాసవి మాత జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుపుకుంటున్న తొలి వాసవి మాత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం విశేషమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. బాసర, కాళేశ్వరం దేవాలయాలు , గోదావరి పుష్కరాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే రామకోటి దేవాలయానికి 20 సంవత్సరాల క్రితం ఇచ్చిన హామీలను గుర్తుచేసుకుంటూ ధ్వజస్తంభం, మార్కెట్ యార్డ్ స్థలం 120 గజాలు మరియు దేవాలయ అభివృద్ధికి మరో 120 గజాలు అందజేసినట్లు చెప్పారు. గుడి ఎదుట పండ్ల మార్కెట్ ఏర్పాటు చేస్తానని చెప్పిన మాటను నిలబెట్టుకున్నానని వివరించారు.పట్టణంలో రామాలయం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, వచ్చే సంవత్సరం ఉత్తర ద్వార దర్శనం వరకు పూర్తి చేస్తామని తెలిపారు. గాంధీ పార్క్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కుంకుమార్చన, అభిషేక కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గాంధీ పార్క్‌లోని భవనాన్ని పునర్నిర్మించేందుకు పూర్తి సహకారం అందిస్తామని, ప్రస్తుతం బాట లేని సమస్యను పరిష్కరించి, డీఎంహెచ్ఓ కార్యాలయం మారిన వెంటనే రహదారి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. అదేవిధంగా రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం, బ్రహ్మంగారి గుట్టలోని శివాలయ అభివృద్ధి పనులను రూ.100 కోట్లతో రెండు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు.ప్రకాశం బజార్ వ్యాపారుల అభివృద్ధి కోసం ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరుశురాం, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఆర్యవైశ్యులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా అమ్మవారి వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయని కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవారి త్యాగాన్ని గుర్తించి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆర్యవైశ్యులకు పెద్దపీట వేస్తూ ఆర్యవైశ్య కార్పోరేషన్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించేందుకు సూర్యాపేట మున్సిపాలిటి చైర్మన్‌గా మొరిశెట్టి నివేదిత లక్షాదిని నిలబెట్టిందని తెలిపారు. అనుకోకుండా నిర్ణయించిన ఈ కార్యక్రమాన్ని వచ్చే సంవత్సరం పెద్దఎత్తున నిర్వహించుకునేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. ప్రజలు వాసవి మాతా స్ఫూర్తితో అహింసా మార్గంలో ధర్మబద్ధంగా ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని ఉన్నత స్థానంలో నిలిపేందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్యవైశ్య సంఘం తరపున శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను నిర్వహిస్తుందని, ప్రభుత్వ ఆదేశాలతో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది మాట్లాడుతూ వాసవి అమ్మవారి ముద్దుబిడ్డగా పుట్టడం నా అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిఎంహెచ్ఓ పి. వెంకటరమణ, సంక్షేమ అధికారి కె. నరసింహారావు, యువజన సంక్షేమ అధికారి వెంకట్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

మే 8,9,10 తేదీల్లో భువనగిరిలో 'మెగా జాబ్ మేళా'

3,500 పైగా ఖాళీలు.. 20కి పైగా ప్రముఖ కంపెనీల భాగస్వామ్యం



**ప్రజాపక్షం/యాదాద్రి :** నియోజకవర్గంలోని నిరుద్యోగ సమస్యను రూపుమాపి, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా భారీ 'మెగా జాబ్ మేళా'ను నిర్వహిస్తున్నట్లు భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా, యువత ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 'కుంభం ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మే నెల 8, 9, 10 తేదీలలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ హైస్కూల్ ప్రాంగణంలో ఈ ఉపాధి వేదిక కొలువుదీరనుంది. భువనగిరి నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మెగా జాబ్ మేళాలో దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 20కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని, వివిధ విభాగాల్లో 3,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని వివరించారు. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఇంజనీరింగ్ మరియు ఇతర టెక్నికల్ కోర్సులు పూర్తి చేసిన వారు హాజరుకావాలని తెలిపారు. అభ్యర్థుల ప్రతిభ, విద్యార్హతలను బట్టి నెలకు ₹12,000 నుండి ₹40,000 వరకు వేతనం లభిస్తుందన్నారు. ఉద్యోగ అభ్యర్థులు తమ వెంట రిజ్యూమ్ (బయోడేటా), గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, విద్యా సర్టిఫికెట్ల నకలు జిరాక్స్‌ను తీసుకురావాలని సూచించారు. ముందస్తుగా పేరు నమోదు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. యువత స్వయంశక్తితో ఎదగాలని, ఈ మేళాను భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, కాంగ్రెస్ జిల్లా నాయకులు పశ్చిమట్ల శివరాజు గౌడ్, పిసిసి డెలిగేట్ సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జాంగిర్, పిఏసిఎస్ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, కౌన్సిలర్ కుక్కదువు సోమయ్య పాల్గొన్నారు.

## రాజా బహుదూర్ వెంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని రాజా బహుదూర్ వెంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ 2026 /29 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా బీరవెల్లి గోపాల్ రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా ఊరుకొండ ప్రభాకర్ రెడ్డి,ఉపాధ్యక్షులుగా ఏడుదొడ్ల వెంకటరామిరెడ్డి, కర్నాటి కరుణాకర్ రెడ్డి, ఏపాల సత్యనారాయణ రెడ్డి,జాయింట్ సెక్రటరీలుగా అలుగుబెల్లి సురేందర్ రెడ్డి,దుబ్బాక వెంకట్ రెడ్డి, నీరుడు గోవర్ధన్ రెడ్డి,కోషాధికారిగా పాదూరి ఇంద్రసేనారెడ్డి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు బీరవెల్లి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం నుంచి రెడ్డి బీద విద్యార్థులు,బీద రైతులకు విద్య,వైద్య రంగాల్లో అండగా నిలుస్తామని తెలిపారు.సంస్థ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని పేర్కొన్నారు.ప్రధాన కార్యదర్శి ఊరుకొండ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ హాస్టల్ భవనంలో రెడ్డి సోదరులకు ఉపయోగపడే విధంగా నూతన భవనాలను నిర్మిస్తామని చెప్పారు. కార్యవర్గ సభ్యుల సహకారంతో సంస్థ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు.ఈ ఎన్నికలకు మాలే వెంకట్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సొసైటీ సభ్యులు కట్టా అనంతరెడ్డి, మూల దయాకర్ రెడ్డి,బూసిరెడ్డి సుధీర్ రెడ్డి, అయ్యడపు నర్సిరెడ్డి,పుట్ట కృష్ణ, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అదే విధంగా కార్యవర్గ సభ్యులుగా గోలి అమరేందర్ రెడ్డి,మాదిరెడ్డి అమరేందర్ రెడ్డి,మారెడ్డి అంజిరెడ్డి, ఉట్కూరు భూపతి రెడ్డి,మాలే చంద్రారెడ్డి,నూకల జయపాల్ రెడ్డి,పాల్వాయి లక్ష్మారెడ్డి, మందడి మహేందర్ రెడ్డి,కూసుకుంట్ల ముత్యంరెడ్డి,వంగాల సత్యనారాయణ రెడ్డి, సూరం సోమిరెడ్డి,కుందారపు శ్రీనివాస్ రెడ్డి,మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,బోధన సుధాకర్ రెడ్డి,రేగట్టే వెంకట గోపాల్ రెడ్డి,కట్ట వెంకట్ రెడ్డి,మోదుగు విజయ భాస్కర్ రెడ్డి,దూదిపాల యాదిరెడ్డి లను ఎన్నుకున్నారు.

## చేపల కోసం...చెరువు అలుగు ధ్వంసం

పదిఊర్ల రైతుల నోట్లో మట్టి కొట్టే యత్నం

చెరువు కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని

ఆయా గ్రామాల రైతులు డిమాండ్



**ప్రజాపక్షం/నిడమనూరు:** చెరువులో చేపలు పట్టేందుకు చెరువు అలుగును ధ్వంసం చేసి చెరువు చుట్టూ ఉన్న పదిఊర్ల రైతుల నోట్లు మట్టి కొట్టే యత్నం చేసిన చెరువు కాంట్రాక్టర్ నిర్వాకం రైతులను ఆందోళనకు గురి చేసింది. దీంతో చెరువునే నమ్ముకొని సేద్యం చేసుకుంటున్నా రైతుల గుండె చెరువు అయింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ఊట్కూర్ గ్రామంలో చోటుచేసుకుంది గ్రామస్తులు రైతులు తెలిపిన వివరాల ప్రకారం ఊట్కూరు చెరువులో చేపలు పెంచుకునేందుకు దుప్పలపల్లి గ్రామానికి చెందిన చేపల కాంట్రాక్టర్కు ఊట్కూరు చెరువును లీజుకు ఇవ్వడం జరిగింది నిబంధనల ప్రకారం చెరువులో నీరు అడుగంటిన తర్వాతే చెరువులో చేపలు పట్టుకునే అవకాశం ఉంది. అయినప్పటికీని గుత్తేదారు స్వప్రయోజనాలను తప్ప రైతు ప్రయోజనాల్ని పట్టించుకోకుండా కాకతీయుల కాలంలో కట్టించిన చెరువు అలుగును ఆదివారం తెల్లవారుజామున గండి కొట్టి ధ్వంసం చేసి చెరువులో నీటిని వెళ్లదీయడం జరిగింది. ఆదివారం ఉదయం వాగులో నీరు ఉధృతిగా ప్రవహించడం గమనించిన గ్రామస్తులు చెరువు వద్దకు పోయి చూడగా చెరువు అలుగు ధ్వంసం చేయడంతో చెరువు నీరు వృధాగా పోవడం గమనించారు. దీంతో ఆందోళన చెందిన ఊట్కూర్, నందికొండ వారి గూడెం, గ్రామాలకు చెందిన రైతులు చెరువు వద్దకు చేరుకొని అతి కష్టం మీద జెసిబి సాయంతో చెరువు అలుగు నుండి నీరు వృధాగా పోకుండా మట్టిని వేశారు ఊట్కూర్ చెరువు నీటి ద్వారా ఊట్కూర్ గ్రామం తో పాటు చెరువు చుట్టూ ఉన్న మారుపాక,వెంకటాపురం, నందికొండవారిగూడెం, గోపువారిగూడెం, వంగాలవారిగూడెం, లక్ష్మీపురం, సోమరిగుడం తదితర పది గ్రామాల రైతులు చెరువు నీటి పై ఆధారపడి సేద్యం చేస్తుంటారు, చెరువులో నీరు ఉండడంతో భూగర్భ జలాలు వృద్ధి చెంది బోరు మోటర్లకు నీటి ఎద్దడి లేకుండా ఊట్కూరు చెరువు మినీ రిజర్వాయర్ గా నాన్ ఆయకట్టు ప్రాంతంలోని పలు గ్రామాలకు ఉపయోగపడుతుంది. ఇంతటి ప్రాచుర్యం కలిగిన చెరువు అలుగును ధ్వంసం చేసి నీటిని విడుదల చేసేందుకు గుత్తేదారు చేసిన సాహసాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆదివారం కావడంతో ఐబి, రెవెన్యూ అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఫోన్ ద్వారా సమాచారం అందించి సోమవారం గుత్తేదారుపై అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 10 ఊర్ల రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేందుకు ప్రయత్నించిన చెరువు కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.



## జనాభా లెక్కల స్వీయ గణనలో ఆదర్శంగా నిలిచిన ప్రభుత్వ విప్ బీర్ల

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** 'జనాభా లెక్కల స్వీయ గణన 2027' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తన నివాసంలో కుటుంబ సమేతంగా పాల్గొని జిల్లా ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. యాదగిరిగుట్టలో జిల్లా జాయింట్ కలెక్టర్ భాస్కర్ రావు ఘనంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో, ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలు, విద్య, ఉపాధి వంటి సమగ్ర అంశాలను అధికారులకు అందించి స్వయంగా నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా స్వీయ గణన పూర్తి చేసినట్లుగా ధృవీకరణ పత్రాలను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుచేతుల మీదుగా ఎమ్మెల్యే అందుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు, సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరడానికి ఈ జనాభా గణన ఎంతో కీలకమని అభివర్ణించారు. ప్రజలు ఎటువంటి భయం లేకుండా, వాస్తవ వివరాలతో ఆన్లైన్ లేదా ప్రత్యక్ష పద్ధతుల ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని, ప్రభుత్వ లక్ష్యానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటికీ ఈ ప్రక్రియ చేరేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారని, నేటి నుండి ప్రారంభమైన ఈ మహత్కార్యంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు బీర్ల అనిత అయిలయ్య, కుమార్తెలు అరుంధతి. శృతి, కుమారుడు శివమణిలు పాల్గొన్నారు.

## నల్లగొండలో ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి.. నిందితుడిపై కేసు నమోదు



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన నల్లగొండ పట్టణంలో కలకలం రేపింది.బస్సు ఆపలేదన్న కారణంతో డ్రైవర్‌పై అమానుషంగా దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మండలంలోని ఐటీ హబ్ ఎదురుగా ఉన్న ఆర్జాలబావి గ్రామ బస్టాప్ వద్ద ఆగిన ఆర్టీసీ బస్సులో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్ తాళ్ల రామ్‌కుమార్‌పై నార్కట్‌పల్లి మండలం యడవల్లి గ్రామానికి చెందిన తుపాకుల వెంకటేశం బైక్‌పై వచ్చి దాడి చేశాడు. మధ్యలో బస్సు ఆపలేదన్న ఆగ్రహంతో బస్సును నిలిపివేసి, డ్రైవర్ రామ్‌కుమార్‌ను సీటులో ఉండగానే పిడిగుద్దులతో కొట్టడంతో పాటు రోడ్డుపై పడేసి దారుణంగా దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు.అసభ్య పదజాలంతో దూషించాడని కూడా పేర్కొన్నారు. రద్దీగా ఉండే హైదరాబాద్ రోడ్డుపై ఈ ఘటన చోటుచేసుకోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.డ్రైవర్ రామ్‌కుమార్ ఫిర్యాదు మేరకు నిందితుడు తుపాకుల వెంకటేశంపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ సైదబాబు తెలిపారు.

## ప్రతీ కుటుంబం తప్పనిసరి స్వీయ నమోదు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈనెల 26 నుంచి 10 మే వరకు నిర్వహిస్తున్న స్వీయ నమోదు ప్రక్రియలో ప్రతి కుటుంబం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహించబడుతున్న జనగణన కార్యక్రమంలో భాగంగా స్వీయ నమోదు ప్రక్రియ ఆదివారం నల్లగొండ నగరంలో ప్రారంభమైంది. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణవేణి,టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఆఫీసర్ అబ్దుల్ రెహమాన్‌తో కలిసి మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి నివాసాన్ని సందర్శించి స్వీయ నమో దు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కమిషనర్ డిప్యూటీ మేయ ర్ అష్రఫ్ అలీ మహమ్మద్ నివాసాన్ని సందర్శించి స్వీయ నమోదు ప్రక్రియను పూర్తి చేయించారు. 41డివిజన్ కార్పొరేటర్ బొడ్డుపల్లి లక్ష్మి,47వ డివిజన్ కార్పొరేటర్ అబ్బగోని కవిత, నివాసాలను సందర్శించి అక్కడ కూడా స్వీయ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

# మాఫియాను అంతం చేస్తాం

## బెంగాల్‌లో బిజెపి సర్కారు తథ్యం: మోదీ



**కోల్‌కతా:** మే 4 తర్వాత పశ్చిమ బెంగాల్‌లో ఏర్పడేది బిజెపి ప్రభుత్వమేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివారం ఆయన బెంగాల్ రెండో విడత పోలింగ్‌కు సంబంధించి ప్రచారంలో పాల్గొన్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని జరిగిన ఓ ర్యాలీలో తణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు చేశారు. టిఎంసి బెంగాల్ భూమిని చొరబాటుదారులకు అప్పగించిందని, టిఎంసి బెంగాల్ తల్లిని ఏడిపించిందని ఆరోపించారు. టిఎంసి అరాచక పాలన నుంచి బెంగాల్ స్వేచ్ఛ కోరుకుంటోందని, తొలి విడత ఎన్నికలతో తణమూల్ అహంకారం బద్ధలైందని ప్రధాని అన్నారు. 15 ఏళ్ల క్రితం టిఎంసి 'మామాటిమనుష్'(తల్లి, భూమి, ప్రజలు) అనే నినాదంలో అధికారంలోకి వచ్చిందని, ఈ రోజు టిఎంసి ఆ మాటలు మాట్లాడటం లేదని, వారు బెంగాల్ భూమిని ల్యాండ్ సిండికేట్లు, మాఫియా, చొరబాటుదారులకు అప్పగించిందని, బెంగాల్ ప్రజలు వలస వెళ్లేలా చేసిందని మోదీ ఆరోపించారు. మే 4 తర్వాత బిజెపి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఇక్కడి మహిళల్ని హింసించిన గుండాల సంగతి బిజెపి ప్రభుత్వం తేలుస్తుందని, మాఫియా పాలన అంతం కావడం ఖాయమని అన్నారు. మొదటి దశలో బెంగాల్ కనబరిచిన అద్భుతమైన ప్రదర్శన, రెండో దశలో బిజెపి భారీ విజయాన్ని ఖరారు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. టిఎంసి దురాగతాలను సమూలంగా నిర్మూలించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు.

బంగావ్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ తణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నంతవరకు బెంగాల్‌లో మహిళలకు రక్షణ ఉండదని అన్నారు. స్త్రీలను హింసించే గూండాలకు ఆ పార్టీ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అందువల్లే రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఈసారి ఎన్నికల్లో బిజెపిని గెలిపిస్తే మహా జంగిల్ రాజ్ నుంచి రక్షణ కల్పిస్తామన్నారు. మహిళల రక్షణ గురించి తాము ఆలోచిస్తామని, ఆర్జీకర్ మతురాలి తల్లికి తమ పార్టీ టికెట్ ఇచ్చిందన్నారు. బెంగాల్‌లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలపై దారుణాలకు పాల్పడిన నిందితులను న్యాయస్థానం ముందు నిలబెడతామన్నారు. రాష్ట్రంలో తరచుగా బాలికలు అదృశ్యమవుతున్న కేసులు నమోదవుతున్నాయని మోదీ చెప్పారు. అయినప్పటికీ టిఎంసి ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిద్రపోతోందని మండిపడ్డారు. మహిళలతో పాటు రైతులు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్రంలో బిజెపి కషి చేస్తోందన్నారు. అందుకే గత 11 ఏళ్లలో జనపనార కనీస మద్దతు ధరలను రెట్టింపు చేసిందన్నారు. గోదుమలు, బియ్యం కోసం 100 శాతం జనపనార ప్యాకేజింగ్‌ను తప్పనిసరి చేశామని వెల్లడించారు. హుగ్లీ నది పరిసరాల్లో ఒకప్పుడు మిల్లులు, ఫ్యాక్టరీలు అధికంగా ఉండేవన్నారు. ప్రస్తుత వాటన్నిటినీ ప్రభుత్వం వసివేసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే వాటిని తిరిగి తెరిపిస్తామన్నారు. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పిస్తామని హామీ ఇచ్చారు. బెంగాల్ అభివద్ధి చెందాలంటే తాము అధికారం చేపట్టాల్సిందేనన్నారు.

# బెంగాల్‌లో టిఎంసి భయోత్పాతం

## మమత సర్కారుపై రాహుల్ విమర్శ



**న్యూఢిల్లీ :** టిఎంసి గూండాలు తమ పార్టీ కార్యకర్త దేవ్‌దీప్ ఛటర్జీని హత్య చేయడాన్ని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం తీవ్రంగా ఖండించారు. భారతదేశ అహింసా సంప్రదాయాన్ని మలినం చేసే ఈ రాజకీయాలకు తమ పార్టీ తలొగ్గదని ఆయన అన్నారు. మొదటి దశ ఎన్నికల అనంతర హింసాకాండలో అసన్‌సోల్‌లో ఛటర్జీ దారుణ హత్యకు గురయ్యారు. ఆయన అసన్‌సోల్ నార్త్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రసేన్‌జిత్ పుయితాండితో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని పార్టీ పేర్కొంది. పాలక ఆల్ ఇండియా తణమూల్ కాంగ్రెస్‌కు అనుబంధంగా ఉన్నవారే తమ కార్యకర్తపై దాడి చేసి కొట్టారని, గాయాలతో కొద్దిసేపటికే ఆయన మరణించారని పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ ఆరోపించింది. 'ఎన్నికల తర్వాత కాంగ్రెస్ కార్యకర్త దేవ్‌దీప్ ఛటర్జీని టిఎంసి అనుబంధ గూండాలు హత్య చేయడం అత్యంత దారుణం. దుఃఖంలో ఉన్న వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి' అని గాంధీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. 'నేడు పశ్చిమ బెంగాల్‌లో ప్రజాస్వామ్యం కాదు, టిఎంసి భయోత్పాత పాలన రాజ్యమేలుతోంది. ఓట్లు వేసిన తర్వాత బెదిరించడం, దాడి చేయడం, వ్యతిరేక స్వరాలను అణచివేయడం టిఎంసికి ప్రత్యేక లక్షణంగా మారిపోయింది' అని రాహుల్ గాంధీ విమర్శించారు. కాంగ్రెస్ రాజకీయాలు ఎన్నడూ హింసపై ఆధారపడలేదని, భవిష్యత్‌లో కూడా ఆధారపడబోవని ఆయన అన్నారు. 'మేము కూడా మా కార్యకర్తలను కోల్పోయాము. అయినా మేము ఎల్లప్పుడూ అహింసా మార్గాన్ని, రాజ్యాంగాన్నే ఎంచుకున్నాము. ఇదే మా వారసత్వం, ఇదే మా సంకల్పం. మా డిమాండ్ స్పష్టం. దోషులందరినీ తక్షణమే అరెస్టు చేయాలి. దోషులందరికీ కఠిన శిక్ష విధించాలి. దేవ్‌దీప్ కుటుంబానికి పూర్తి భద్రత, నష్టపరిహారం అందించాలి' అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అన్నారు. 'భారతదేశ అహింసా సంప్రదాయాన్ని మలినం చేసే ఈ రాజకీయాలకు మేము తలొగ్గము. న్యాయం జరుగుతుంది' అని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ తన 'ఎక్స్' ఖాతాలో పెట్టిన ఒక పోస్ట్‌లో... ఈ విషాద సంఘటన రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలిపోయినట్లు బహిర్గతం చేస్తోందని, పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష కార్యకర్తల భద్రతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోందని తెలిపింది. 'పోలింగ్ జరిగిన వెంటనే ఇలాంటి హింస జరగడం అనేది రాజకీయ బెదిరింపులు, కక్ష సాధింపు చర్యలకు చెందిన తీవ్ర ఆందోళనకరమైన ధోరణిని ఎత్తి చూపుతోంది' అని పేర్కొంది. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ అండగా నిలుస్తుందని, ఈ దారుణమైన నేరానికి బాధ్యులైన వారందరినీ తక్షణమే అరెస్టు చేయాలని, నిష్పక్షపాతంగా, కాలపరిమితితో కూడిన విచారణ జరపాలని డిమాండ్ చేసింది. బాధితుని కుటుంబానికి తగిన పరిహారం, రక్షణ కల్పించాలని కోరింది. 'ఈ వార్త రాసే సమయానికి కనీసం ఒక ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇంతటి ఘోరమైన సంఘటన పట్ల పరిపాలనా యంత్రాంగం ఉదాసీనతను మరింతగా సూచిస్తోంది. భయం, హింసతో కూడిన వాతావరణంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదని భారత జాతీయ కాంగ్రెస్ పునరుద్ఘాటిస్తోంది. ఇలాంటి అఘాయిత్యాలకు వ్యతిరేకంగా మేము మా గళాన్ని వినిపిస్తూనే ఉంటాము. ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా పోరాడతాము' అని పార్టీ పేర్కొంది. టిఎంసికి చెందిన గూండాలు చటర్జీని హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించాలని, ఇది ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి అని కాంగ్రెస్ పేర్కొంది. 'పశ్చిమ బెంగాల్‌లో ప్రజాస్వామ్యం అంతమయింది. టిఎంసి దారుణ పాలన కొనసాగుతోంది. హింస ద్వారా వ్యతిరేక స్వరాలను అణచివేయడం, అణగదొక్కడం టిఎంసి నైజంగా మారింది. దోషులను వెంటనే అరెస్టు చేసి... వారికి అత్యంత కఠినమైన శిక్ష విధించాలని మేము డిమాండ్ చేస్తున్నాము. ఈ ప్రజా వ్యతిరేక శక్తుల చేతిలో మన దేశ ప్రజాస్వామ్యం నాశనం కావడాన్ని మేము అనుమతించము' అని తెలిపింది.

# హౌరా... హరోవాలో ఘర్షణలు



**కోల్‌కతా:** ఏప్రిల్ 29న జరగనున్న రెండో దశ పోలింగ్‌కు ముందు పశ్చిమ బెంగాల్‌లోని హౌరా, హరోవా ప్రాంతాల్లో చెదురుమదురు హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని ఒక సీనియర్ పోలీస్ అధికారి ఆదివారం తెలిపారు. హౌరా పట్టణంలో కాషాయ పార్టీ ఉత్తర హౌరా అభ్యర్థి ఉమేష్ రాయ్ రోడ్ షో సందర్భంగా నినాదాలు చేయడంపై తణమూల్ కాంగ్రెస్, బిజెపి మద్దతుదారుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. జీటీ రోడ్డులోని టిఎంసి ఎన్నికల కార్యాలయం వద్ద రోడ్ షో వెళుతుండగా... టిఎంసి మద్దతుదారులు 'జై బంగ్లా' అంటూ నినదించారు. దీనికి ప్రతిగా బిజెపి మద్దతుదారులు 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేశారు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగి... అది పెద్ద తోపులాటగా మారడంతో కేంద్ర బలగాలు బిజెపి, టిఎంసి మద్దతుదారులపై లాఠీ ఛార్జ్ చేశాయని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. రోడ్ షోకు బిజెపి ఎంపీ, నటుడు రవి కిషన్ నాయకత్వం వహించారు. అయితే ఘర్షణ జరిగే సమయానికి అతని వాహనం అప్పటికే ఆ ప్రదేశాన్ని దాటి వెళ్లిపోయింది. శనివారం రాత్రి ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హరోవాలో ఐఎస్ఎఫ్ రోడ్ షో సందర్భంగా టిఎంసి, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్ఎఫ్) మద్దతుదారులను శాంతింపజేసే ప్రయత్నంలో ఒక పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ గాయపడ్డారని అధికారి తెలిపారు. పార్టీ నాయకుడు నౌషాద్ సిద్ధిఖీ రోడ్ షో నుంచి ఐఎస్ఎఫ్ మద్దతుదారులు తిరిగి వస్తుండగా ఒక వీధివల సమావేశంలో కొంతమంది టిఎంసి మద్దతుదారులు వారిని గేలి చేశారని, ఇది ఘర్షణకు దారితీసిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘర్షణలో తమ మద్దతుదారులలో చాలా మంది గాయపడ్డారని ఐఎస్ఎఫ్, టిఎంసి రెండూ ఆరోపించాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది, ఓట్ల లెక్కింపు మే 4న జరుగుతుంది.

# రెండోదశకు కట్టుదిట్టమైన భద్రత: ఇసి



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశకు సంబంధించి ఎన్నికల సంఘం ఆదివారం కట్టుదిట్టమైన భద్రతా ప్రణాళికను ప్రకటించింది. ఓటింగ్‌కు అంతరాయం కలిగించే లేదా ఓటర్లను అడ్డుకునే ఏ ప్రయత్నాన్ని అయినా కఠినంగా ఎదుర్కొంటామని స్పష్టం చేసినట్లు ఒక అధికారి తెలిపారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూసేందుకు, నియోజకవర్గాల వారీగా భద్రతా సిబ్బందిని మోహరించాలని, లోపలి సందులు, సున్నితమైన ప్రాంతాల్లో ఏరియా డామినేషన్ విన్యాసాలను ముమ్మరం చేయాలని ఎన్నికల సంఘం భద్రతా సిబ్బందిని ఆదేశించింది. కోల్‌కతా పరిధిలోని వడు ఎన్నికల జిల్లాలకు చెందిన ఎన్నికల అధికారులు, సీనియర్ పోలీసు అధికారులు, కేంద్ర బలగాల కమాండర్లు హాజరయిన ఉన్నత స్థాయి సమన్వయ సమావేశంలో ఏప్రిల్ 28 న పోలింగ్ జరగనున్న 142 నియోజకవర్గాల్లోని సన్నద్ధతను ఈసీ సమీక్షించింది. 'ఈ ప్రణాళికలో భాగంగా, త్వరితగతిన బలగాలను మోహరించేందుకు, ఒక్కో మోటార్ సైకిల్‌పై ఇద్దరు సీఏపీఎఫ్ సిబ్బందితో కూడిన 160 మోటార్ సైకిళ్లు నియోజకవర్గాల వ్యాప్తంగా ఉన్న ప్రాంతాలలో గస్తీ తిరుగుతాయి. బలగాల మోహరింపు, బలహీనతల మ్యాపింగ్, పౌర, పోలీసు యంత్రాంగాల మధ్య సమన్వయం, ప్రతి ప్రాంతంలో భద్రతా సిబ్బంది స్పష్టంగా కనిపించేలా చూడటంపై దష్టి సారించాం' అని ఒక అధికారి తెలిపారు. ఈ సమావేశానికి కోల్‌కతా పోలీస్ కమిషనర్, కోల్‌కతా దక్షిణ, ఉత్తర, అలాగే దక్షిణ 24 పరగణాల జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, పరిశీలకులు, ప్రత్యేక పరిశీలకుడు సుబ్రతా గుప్తా, పోలీసు ప్రత్యేక పరిశీలకుడు ఎన్.కె.మిశ్రా తదితరులు హాజరయ్యారు. ఇదిలాఉండగా, పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్... సన్నద్ధతను అంచనా వేయడానికి, రాజకీయ వర్గాలతో సంప్రదించడానికి దక్షిణ 24 పరగణాలలోని కాక్‌ద్వీప్‌ను సందర్శించారు. శాంతియుత పోలింగ్‌కు సహకరించాలని, ఓటర్ల భాగస్వామ్యాన్ని గరిష్ఠ స్థాయికి పెంచాలని ఆయన పార్టీలను కోరారు. 'శాంతియుతంగా, సాధారణంగా ఓటింగ్ జరిగేలా చూడాలని మేము ప్రతి ఒక్కరినీ కోరాము. బూటకపు ఓటింగ్ లేదా బూత్ ఆక్రమణను అనుమతించరు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోగలగాలి. దానిని అడ్డుకోవడానికి ప్రయత్నించే వారిపై చర్యలు తీసుకుంటాం' అని అగర్వాల్ అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని, బూత్‌ల వద్ద కేంద్ర బలగాలు భద్రత కల్పిస్తాయని, పోలింగ్ ప్రాంగణానికి 100 మీటర్ల పరిధిలోకి అనధికార వ్యక్తులను అనుమతించబోమని ఆయన తెలిపారు. 'ఓటర్లు బయటకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పునరుద్ధరించడానికే మేము ఇక్కడ ఉన్నాము' అని ఆయన అన్నారు.

## నేడు 'నీట్' హాల్ టికెట్లు విడుదల

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న నీట్ అడ్మిట్ కార్డుల నిరీక్షణకు తెరపడింది. ఎన్‌టిఎ చేసిన తాజా ప్రకటన అభ్యర్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్ 2026 హాల్ టికెట్లు సోమవారం విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. అడ్మిట్ కార్డులు విడుదలైన వెంటనే అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులు ముందుగా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి. అక్కడ కనిపించే 'అడ్మిట్ కార్డ్ పీడీఎఫ్' లింక్‌పై క్లిక్ చేయాలి. ఆ తరువాత మీ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్ వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలి. ఈ వివరాలు ఇచ్చిన వెంటనే నీట్ హాల్ టికెట్ మీ స్క్రీన్‌పై దర్శనమిస్తుంది. వెంటనే ఆ పీడీఎఫ్‌ను సేవ్ చేసుకుని, పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లేందుకు తప్పనిసరిగా ఒక ప్రింటవుట్ తీసుకుని భద్రపరుచుకోవాలి. నీట్ 2026 ప్రశ్నాపత్రం పూర్తిగా విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టేలా ఉండనుంది. మొత్తం 180 ప్రశ్నలకు అభ్యర్థులు సమాధానాలు రాయాల్సి ఉంటుంది.

# జనగణనలో ప్రతీ పౌరుడు పాల్గొనాలి

## 'మన్ కీ బాత్' 133వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** ప్రస్తుతం దేశంలో జరుగుతున్న జనగణన–2027 అనేది కేవలం ప్రభుత్వం పని కాదు. అది దేశ పౌరులందరి బాధ్యత. అందరూ చొరవ చూపి ఇందులో భాగస్వాములు కావాలి. జనగణనలో ప్రజలు అందించే సమాచారాన్ని చాలా సురక్షితంగా, విశ్వసనీయంగా దాచి పెడతారు. అందరూ పాల్గొని జనగణనను విజయవంతం చేయాలి' అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆదివారం మన్ కీ బాత్ 133వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ ఈ వివరాలను వెల్లడించారు. 'భారత్‌లో జరుగుతున్న జనగణన కార్యక్రమం ప్రపంచంలోనే అతిపెద్దది. పూర్తిగా డిజిటల్‌గానే దేశ ప్రజల సమాచారాన్ని ఎన్యుమరేటర్లు నమోదు చేస్తారు. ప్రజలు అందించే సమాచారాన్ని ఎన్యుమరేటర్లు అక్కడికక్కడే ప్రత్యేక మొబైల్ యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు కూడా ఈసారి అవకాశాన్ని ఇచ్చారు. ప్రజలు తమకు తామే వివరాలను సెన్సస్ పోర్టల్‌లో నమోదు చేయొచ్చు. క్షేత్రస్థాయి ఎన్యుమరేషన్ మొదలుకావడానికి ముందు, 15 రోజుల పాటు ప్రజలు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చు. ఈ ప్రక్రియను పూర్తి చేసే వారికి మొబైల్ లేదా ఈమెయిల్ ద్వారా ఒక ప్రత్యేక ఐడీని పంపిస్తారు. ఇళ్లకు ఎన్యుమరేటర్లు వచ్చినప్పుడు, ఈ ఐడీని చూపిస్తే సరిపోతుంది. దీనివల్ల సమయం ఆదా అవుతుంది. ఇప్పటివరకు పలు రాష్ట్రాల్లో 1.2 కోట్ల కుటుంబాలు గృహ గణనకు సమాచారాన్ని అందించాయి' అని ప్రధాని మోదీ తెలిపారు.

**తొలిసారిగా క్రిటికాలిటీ దశకు 'కల్పకం' న్యూక్లియర్ రియాక్టర్**

భారత్‌లోనే తొలిసారిగా తమిళనాడులోని కల్పకంలో ఉన్న ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్ క్రిటికాలిటీ దశకు చేరడం చారిత్రక మైలురాయి అని ప్రధాని మోదీ కొనియాడారు. ఈ ఘన విజయాన్ని సాధించడం ద్వారా భారత అణు శాస్త్రవేత్తలు దేశానికి కీర్తిని సాధించి పెట్టారని ప్రశంసించారు. ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్ను తొలిసారిగా క్రిటికాలిటీ దశకు చేర్చడంలో భాగమైన శాస్త్రవేత్తలు సహా ప్రతీ ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. దేశ ప్రజల జీవితాలను మెరుగుపర్చేందుకు, సులభతరం చేసేందుకు శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమన్నారు. కొన్ని రోజుల క్రితమే (ఏప్రిల్ 6న) కల్పకంలోని న్యూక్లియర్ రియాక్టర్ పూర్తిస్థాయిలో స్వయంగా పని చేయడం మొదలుపెట్టిందని ప్రధాని మోదీ చెప్పారు. ఆ న్యూక్లియర్ రియాక్టర్‌ను పూర్తిగా స్వదేశీ టెక్నాలజీతోనే తయారు చేయడం అనేది పెద్ద విషయమన్నారు. ఇంధన రంగంలో దేశం సాధించిన ఈ విజయం వికసిత భారత్ లక్ష్యానికి కొత్త శక్తిని అందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2024 మార్చిలో కల్పకంలో రియాక్టర్ లోడింగ్ దశను నేరుగా వీక్షించే గొప్ప అవకాశం తనకు లభించిందని మోదీ తెలిపారు. భారతదేశ పౌర అణు ఇంధన కార్యక్రమం సాధిస్తున్న విజయాల కారణంగా దేశ పారిశ్రామిక, ఇంధన, ఆరోగ్య రంగాల వికాసానికి ఊతం లభిస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల రైతులు, ఆధునిక ఆవిష్కర్తలకూ చేదోడు లభిస్తోందన్నారు.

**పవన విద్యుత్ రంగంలో ప్రధాన మైలురాయి**

పవన విద్యుత్ అనేది భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కంటికి కనిపించని ఈ పవన శక్తే భారత్‌ను మున్ముందుకు నడిపిస్తోందని తెలిపారు. పవన విద్యుత్ రంగంలో భారత్ ఇటీవలే ఒక ప్రధాన మైలురాయిని సాధించిందని, దేశ పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 56 గిగావాట్లు దాటిందన్నారు.

**ఒక వెదురు ఉత్పత్తిని కొనండి**

'భారతదేశంలో వెదురు రంగంలో ఎంతోమంది పనిచేస్తున్నారు. కళాత్మక వెదురు ఉత్పత్తుల తయారీకి వాళ్లంతా శ్రమిస్తున్నారు. ఘటన సమయంలో విమానంలో సిబ్బంది సహా 232 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఈ రంగంపై ఎక్కువగా ఆధారపడ్డారు. వారిని ప్రోత్సహించేందుకు మీరంతా కనీసం ఒక వెదురు ఉత్పత్తిని కొనండి. దీన్ని మీరు ఎవరికైనా గిఫ్టుగా ఇచ్చుకోవచ్చు. వెదురు ఉత్పత్తుల సేల్స్ పెరిగితే ఈ రంగంలో పనిచేస్తున్న వారి ఆత్మస్థైర్యం పెరుగుతుంది' అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

# ఆ ఏడుగురిపై అనర్హత వేటు వేయండి

## రాజ్యసభ ఛైర్మన్‌ను కోరిన 'ఆప్'



**న్యూఢిల్లీ :** తమ పార్టీని వీడి ఇటీవలే బిజెపిలో చేరిన ఏడుగురు రాజ్యసభ సభ్యులపై అనర్హత వేటు వేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపి సంజయ్ సింగ్ రాజ్యసభ ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్‌కు పిటిషన్ సమర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ఆ ఏడుగురు ఎంపిల చర్య పార్టీ ఫిరాయింపు నిరోధక చట్ట నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. అందుకే వారి సభ్యత్వాన్ని పార్టీ ఫిరాయింపు చట్టం కింద రద్దు చేయాలని కోరినట్లు తెలిపారు. గత శుక్రవారం ఆప్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలిన విషయం తెలిసిందే. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ తన సిద్ధాంతాలు, విలువలు, నైతికత నుంచి పక్కకు తప్పిందని ఆరోపిస్తూ రాఘవ్ చడ్డా, అశోక్ మిత్తల్, సందీప్ పాఠక్, హర్భజన్ సింగ్, రాజేంద్ర గుప్త, విక్రమ్ సాహ్ని, స్వాతి మలివాల్ పార్టీని వీడారు. అంతేకాదు ఆ వెంటనే బిజెపిలో చేరారు. అయితే చడ్డా సహా ఆరుగురు ఎంపిలు పార్టీ ఫిరాయించడంపై ఆప్ నేత సంజయ్ సింగ్ మండిపడ్డారు. ఈ ఫిరాయింపు ప్రజల తీర్పును, ముఖ్యంగా పంజాబ్ ప్రజలను వంచించడమేనని ఆరోపించారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. ఎందుకంటే ఆప్‌ను వీడిన ఏడుగురు ఎంపిలలో ఆరుగురు పంజాబ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నవారే కావడం గమనార్హం. కాగా, ఈ అంశంపై తాము సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్‌తో సహా పలువురు రాజ్యాంగ నిపుణులను సంప్రదించామని సంజయ్ సింగ్ అన్నారు. పార్టీ ఫిరాయించిన సదరు ఎంపిలు చట్టం ప్రకారం అనర్హతకు గురవుతారని వాళ్లు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. 'ఈ సభ్యులు ఆప్ ద్వారా ఎన్నికై, ఆపై పార్టీని వీడి మరో పార్టీలో చేరారు. ఇది పంజాబ్ ప్రజలకు, భారత రాజ్యాంగానికి చేస్తున్న ద్రోహం' అని సంజయ్ సింగ్ విమర్శించారు.

# నాయకత్వ మార్పుపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ : డికె శివకుమార్



**బెంగళూరు:** నాయకత్వ అంశంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయానికి తాను, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కట్టుబడి ఉంటామని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ తెలిపారు. పార్టీ నాయకత్వం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటుందనే నమ్మకం తనకుఉందని అన్నారు. ఢిల్లీ నుంచి ఆదివారంనాడు బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్న డికె కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. మే 4న నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కర్ణాటకలో నాయకత్వ మార్పు, మంత్రివర్గ విస్తరణ జరుగుతుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గత రెండు రోజులుగా హస్తినలో డికె ఉన్నారు. ఢిల్లీ పర్యటనలో అధిష్ఠానంతో జరిపిన చర్చలపై మీడియా ప్రశ్నించగా, సమయం వచ్చినప్పుడు మీకే తెలుస్తుందని, ఇప్పటికి చెప్పేదేమీ లేదని అన్నారు. పార్టీలో అంతర్గత విభేదాలున్నట్టు సీనియర్ మంత్రి సతీష్ జార్కిహోలి పేర్కొనడంపై అడిగినప్పుడు అలాంటిదేమీలేదని డికె సమాధానమిచ్చారు. ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకున్న తరుణంలో నాయకత్వ మార్పు జరిగే అవకాశాలపై అడిగినప్పుడు, ఈ అంశాన్ని తాను ఎప్పుడూ ప్రస్తావించలేదని, అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా తాను, ముఖ్యమంత్రి కట్టుబడి ఉంటామని చెప్పారు. మే 15న తన పుట్టినరోజున ఎవరూ రోడ్లపై బ్యానర్లు పెట్టడం కానీ, అడ్వర్టైజ్‌మెంట్లు కానీ ఇవ్వవద్దని డికె కోరారు. రోడ్లపై ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని పార్టీ కార్యకర్తలను, అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఫ్లెక్సీలు పెట్టేవారిపై కేసులు పెట్టాలని, జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించనున్నట్టు చెప్పారు.

# రష్యా చమురు దిగుమతి వివరాలు ఇవ్వలేం: పిపిఎసి



**న్యూఢిల్లీ :** రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతులకు సంబంధించిన సమగ్ర వివరాలను ఆర్‌టిఐ కింద అందజేయడం కుదరదని పెట్రోలియం శాఖ అధ్వర్యంలోని 'పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్'(పిపిఎసి) తెలిపింది. ఇది వాణిజ్యపరమైన, గోప్యమైన అంశం కావడంతో సమాచార హక్కు చట్టం కింద మినహాయింపు ఉందని పేర్కొంది. దేశ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను ఉటంకిస్తూ కేంద్ర సమాచార కమిషన్ కూడా దీనిని సమర్థించింది. 2022 జూన్ నుంచి 2025 జూన్ మధ్యకాలంలో రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకున్న ముడి చమురు వివరాలు అందజేయాలని 'పిపిఎసి'లో ఓ ఆర్‌టిఐ పిటిషన్ దాఖలైంది. ఐఒసిఎల్, బిసిపిఎల్, హెచ్‌పిసిఎల్, ఓఎన్‌జిసి విదేశ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ వంటి సంస్థల వారీగా డేటా కావాలని దరఖాస్తుదారు కోరారు. అయితే, ఈ సమాచారం ఇచ్చేందుకు సెంట్రల్ పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్ (సిపిఐఒ) నిరాకరించారు. 'దేశాలు, కంపెనీల వారీగా ముడి చమురు దిగుమతులకు సంబంధించిన సమాచారం వాణిజ్యపరమైనది, గోప్యమైనది. ఆర్‌టిఐ చట్టం కింద ఈ డేటాను వెల్లడించడాన్ని మినహాయించారు. అయితే, ముడి చమురు మొత్తం దిగుమతి పరిమాణం, విలువను పిపిఎసి వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు' అని సిపిఐఒ తెలిపారు. ఫస్ట్ అప్పీలేట్ అథారిటీ సైతం ఈ సమాధానాన్ని సమర్థించింది. దీంతో దరఖాస్తుదారు... సిపిఐఒ ఆశ్రయించారు. ఇంధన రంగంలో దేశం ఎలా పనిచేస్తుందో తాను తెలుసుకోవాలనుకుంటున్నట్లు చెప్పారు. ఈ సమాచారం వెల్లడించడం దేశ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తుందని సీఐసీ పేర్కొంది. ఇతర దేశాలతో సంబంధాలను కూడా ప్రభావితం చేస్తుందని తెలిపింది. ఈ సమాచారం భౌగోళిక రాజకీయ సంబంధాలతో ముడిపడి ఉందని చెప్పింది. ఆర్టీఐ చట్టం కింద మినహాయింపు చెల్లుబాటు అవుతుందని స్పష్టం చేసింది.

# పుట్టిన రోజు వేడుకలో వివాదం

## కాల్పుల్లో ముగ్గురి మృతి



**లక్నో:** పుట్టిన రోజు వేడుకలో విషాదం నెలకొంది. ముఖానికి కేక్ పూయడంతో చెలరేగిన వివాదంలో పుట్టినరోజు వేడుక జరుపుకుంటున్న వ్యక్తి కేక్ పూసిన వారిపై కాల్పులు జరపగా ముగ్గురు మృతి చెందిన సంఘట ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో చోటు చేసుకుంది. ఖుర్జా నగర్ ప్రాంతానికి చెందిన జీతు సైని శనివారం రాత్రి ఒక జిమ్‌లో తన పుట్టిన రోజు వేడుక జరుపుకున్నాడు. ఆ వేడుకకు హాజరైన అమర్‌దీప్ సైని అతడి ముఖానికి కేక్ పూశాడు. దీంతో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. కాగా, అమర్‌దీప్ సైని బంధువులైన మనీష్ సైని, ఆకాష్ సైని ఈ వివాదంలో జోక్యం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన జీతు సైని గన్ తెచ్చి వారిపై కాల్పులు జరిపాడు. ఆ తర్వాత తన అనుచరులతో కలిసి అక్కడి నుంచి పారిపోయాడు. కాల్పుల్లో గాయపడిన అమర్‌దీప్, మనీష్, ఆకాష్‌ను ఆసుపత్రికి తరలించారు. అయితే ఆ ముగ్గురు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫోరెన్సిక్ బందం కూడా అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించింది. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసేందుకు పోలీస్ బందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# బొగ్గు పొరల సాక్షిగా... ఒక యోధుడి 'రక్తాక్షర' కావ్యం!

## 'బొజ్జ భిక్షమయ్య' జీవితం ఆధారంగా డాక్టర్ కాలువ మల్లయ్య రాసిన 'అస్పృశ్య యోధుడు' నవలపై విశ్లేషణ



దామెర రాజేందర్
సీనియర్ జర్నలిస్ట్

సాహిత్యం అంటే కేవలం అక్షరాల కూర్పు కాదు, అది ఒక సామాజిక ఆయుధం. డాక్టర్ కాలువ మల్లయ్య మలిచిన 'అస్పృశ్య యోధుడు' నవల చదువుతుంటే ఆ అక్షరాలు మంటలై మనల్ని తాకుతాయి. ప్రముఖ ట్రేడ్ యూనియనిస్ట్, లాల్ నీల్ వాది కామ్రేడ్ 'బొజ్జ భిక్షమయ్య' జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకున్న ఈ నవల, ఒక తరం పోరాటాలకు సజీవ సాక్ష్యం. ఒక జర్నలిస్టుగా, ట్రేడ్ యూనియన్‌లో పని చేసిన అనుభవం కలిగిన నాకు 'అస్పృశ్య యోధుడు' నవల చదువుతుంటే, అది కేవలం కామ్రేడ్ బొజ్జ భిక్షమయ్య జీవితంలా అనిపించలేదు. అది అంటరాని వసంతపుకాలం, సమ్మెల హోరు, సైరన్ల మోత, జైలు కటకటాల వెనుక వినిపించే స్వేచ్ఛా గీతంలా అనిపించింది. భిక్షమయ్య జీవిత ప్రయాణాన్ని డాక్టర్ కాలువ మల్లయ్య ఒక కావ్యంగా మలచడం సాహిత్య చరిత్రలో ఒక అరుదైన సందర్భంగా చెప్పాలి. సింగరేణి గనుల్లో బొగ్గును వెలికి తీయడం ఎంత కష్టమో, అణచివేతకు గురైన సామాజిక వర్గాల నుంచి ఒక నాయకుడిని వెలికి తీయడం అంతకంటే కష్టం. వృత్తిరీత్యా కార్మికుడిగా, ప్రవృత్తిరీత్యా కార్మిక నాయకుడిగా భిక్షమయ్య చేసిన పోరాటం, ఆయన అంతర్మథన పోరాటం నా కళ్ళముందు కదలాడింది. ఒకప్పుడు వరంగల్ వీధుల్లో ట్రేడ్ యూనియన్ కార్యకర్తగా నేను చూసిన ఎర్రజెండా నీడ, ఈ నవలలోని ప్రతి పేజీలోనూ కనిపిస్తోంది. గని కార్మికుడు అంటే కేవలం ఉత్పత్తి చేసే యంత్రం కాదు, అతడొక మనిషి అని, అతడికి హక్కులు ఉంటాయని చాటిన భిక్షమయ్య ప్రయాణం సింగరేణి కార్మిక చరిత్రలో ఒక మైలురాయి. 'బొగ్గుల పొయ్యిలా భగభగలాడటం' అనే రచయిత ప్రయోగం, నిప్పుల మీద నడిచిన ఒక తరానికి నివాళిగా చెప్పక తప్పదు. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగం చేసేవారు తమ పరిధి దాటి వెళ్లడానికి జంకుతారు. కానీ భిక్షమయ్య భిన్నమైన వ్యక్తి. ఆయన ఎఫ్‌సిఐ లో విధులు నిర్వహిస్తూనే, సింగరేణి బొగ్గు గని కార్మికుల కడగండ్లను తన భుజాలకెత్తుకున్నారు. బొగ్గు బావుల్లో ప్రాణాలకు తెగించి పని చేసే కార్మికుల హక్కుల కోసం ఆయన ఎగురవేసిన ఎర్రజెండా, నాటి నిరంకుశ యాజమాన్యాలకు నిద్ర లేకుండా చేసింది. ఒక రంగానికి పరిమితం కాకుండా, పీడిత వర్గాల గొంతుకగా మారడమే అసలైన నాయకత్వ లక్షణమని ఈ నవల చాటిచెబుతోంది. ఈ నవలను కేవలం భావోద్వేగాలతో కాకుండా, చారిత్రక వాస్తవాలతో తీర్చిదిద్దారు. బొగ్గు గని కార్మికుల జీవితం,



పల్లెల్లోని వెక్కిరింతలు, బడిలో ఎదురైన అవమానాలు ఇవన్నీ చదువుతుంటే మన కళ్లు చెమర్చుతాయి. రాజకీయ ఖైదీగా జైలు గోడల మధ్య గడిపిన క్షణాలను కాలువ మల్లయ్య ఈ నవలలో అద్భుతంగా చిత్రించారు. బయటి లోకంలో అడుగడుగునా ఎదురయ్యే కుల వివక్ష, అవమానాల కంటే, జైలులో సిద్ధాంతం కోసం శిక్ష అనుభవించడంలోనే ఒక రకమైన తృప్తి ఉంటుంది. భిక్షమయ్యకి ఇల్లు కన్నా జైలు ఎందుకు మేలనిపించిందంటే, అక్కడ ఆయన అస్పృశ్యుడు కాదు.. ఒక 'రాజకీయ ఖైదీ'. గౌరవం కోసం పరితపించే ఒక ఆత్మకు జైలు కటకటాలు కూడా స్వేచ్ఛా గీతాలేనని రచయిత లోతుగా చాలా సున్నితంగా విశ్లేషించారు.

ఒక 'ఉపా' బాధితునిగా ఉపా కేసు అభియోగంతో అరెస్ట్ చేయబడి 100 రోజులు అండర్ ట్రయల్ ఖైదీగా జైలు జీవితం గడిపిన ఒక జర్నలిస్టుగా భిక్షమయ్య అంతరంగాన్ని ఈ నవలను చదువుతూ నేను మరింత లోతుగా అర్థం చేసుకోగలిగాను. సమాజంలో 'అస్పృశ్యత' పేరుతో అనుభవించే పరాయికరణ కంటే, జైలు గోడల మధ్య సిద్ధాంతం కోసం గడిపే సమయమే గౌరవప్రదమని ఆయన భావించడం విప్లవకారుడికే సాధ్యమయ్యే అత్యున్నత సంస్కారం. 'ఊరికో జైలు, వాడకో జైలు లేకపోవడమే మంచిదైంది' అన్న ఆయన మాటల వెనుక ఉన్న సామాజిక వ్యంగ్యం నన్ను ఆలోచింపజేసింది. బయటి ప్రపంచం ఒక పెద్ద జైలుగా మారినప్పుడు, స్వే చ్ఛా భావజాలమే అసలైన విముక్తి అని ఈ నవల గుర్తుచేస్తుంది. ఈ నవలలోని అత్యంత కీలకమైన ఘట్టం భిక్షమయ్య ఆలోచనా సరళిలో వచ్చిన మార్పు. 'లాల్' ఉద్యమ పోరాట పటిమను పుణికిపుచ్చుకున్న ఆయన, కాలక్రమేణా సామాజిక విముక్తికి అంబేద్కర్ ఆత్మగౌరవ భావజాలమే అసలైన మార్గమని గుర్తించినట్లుగా ఆయన ప్రయాణం పరిశీలిస్తే అర్థమవుతోంది. కుల నిర్మూలన జరగనిదే శ్రమకు విముక్తి లేదన్న నిజాన్ని ఆయన గుర్తించిన తీరు నేటి తరానికి దిక్సూచి. 'శత్రువు లేనివాడు నంగి' అని ఆయన చెప్పే పచ్చి నిజాన్ని ఒక జర్నలిస్టుగా నేను మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. ఎందుకంటే నిజాన్ని నిర్భయంగా రాసే జర్నలిస్టుకు, సమాజం కోసం పోరాడే యోధుడికి శత్రువులు ఉండటం సహజం. ఇంకా సూటిగా చెప్పాలంటే శత్రువు లేకపోతే సజీవంగా లేనట్లే. 'అస్పృశ్య యోధుడు' నవల కేవలం ఒక వ్యక్తి బయోపిక్ కాదు. అది ఒక అస్తిత్వ విస్ఫోటనం. అణచివేత ఎక్కడైతే ఉంటుందో, అక్కడ భిక్షమయ్య లాంటి యోధులు పుడుతూనే ఉంటారని ఈ నవల చెబుతుంది. ఒక జర్నలిస్టుగా, ముందు చెప్పినట్లు విద్యార్థి దశలో విద్యార్థి ఉద్యమంలో, యువకునిగా యువజన సంఘంలో ఆ తరువాత ట్రేడ్ యూనియన్‌లో దశాబ్ధంన్నర కాలం పాటు వామపక్ష ఉద్యమంలో ఉన్న నేను జర్నలిస్ట్ వృత్తిలో కూడా దశాబ్ధంన్నర కాలంగా కొనసాగుతున్న. నేను సమాజంలోని కుల ఆధిపత్యమో, కక్షసాధింపు చర్యలో ఒక రకంగా కలం గొంతును నొక్కాలని చూసే కుట్రలో భాగమో ఎలా అనుకున్నా సరే రెండోసారి నన్ను టార్గెట్ చేసి మా తమ్ముడిని కూడా టార్గెట్ చేసి కుట్రపూరితమైన కేసు నమోదై ఒకరోజు జైలు గడపతొక్కిన మానసిక స్థితిలో ఈ నవల చదివాను. ఈ నవలను చదివిన తర్వాత నాలో అనేక రెట్లు ఆత్మస్థైర్యాన్ని నింపింది. ఒకరకంగా ఈ నవల చదివాక నా స్థితి, మనకు ఎదురయ్యే సమస్యలు చాలా చిన్నవిగా అనిపించింది. ఇలాంటి కుట్రలు, కక్షసాధింపు చర్యలు ఒకలెక్కే కాదన్నట్లుగా కొట్టిపారేశాను. ఇక ఈ నవలలో బాల్యంలో చిరిగిన నిక్కరు చూసి నవ్విన వెకిలి చూపుల నుంచే, వ్యవస్థను ప్రశ్నించే చూపు పుడుతుందని రచయిత కాలువ మల్లయ్య చాలా సహజంగా చిత్రించారు. మార్క్సిజం నుంచి అంబేద్కరిజం వైపు సాగిన, సాగుతున్న లాల్ నీల్ ఐక్యత కోసం సాగుతున్న భిక్షమయ్య ప్రయాణం కేవలం సిద్ధాంత మార్పు కా దు, అది ఆత్మగౌరవ అన్వేషణ. కులం అనే కంచెను విప్లవం అనే గొడ్డలితో ఎలా నరకాలో బిక్షమయ్య జీవితం చూపిస్తుంది. భిక్షమయ్య 'అజాతశత్రువు' కాదు.. ఆయ నో 'అజాత యుద్ధవీరుడు'. ముందే చెప్పినట్లుగా శత్రువు లేనివాడు బతకనేర్చినవాడు మాత్రమే అనే ఆయన సిద్ధాంతం, సమాజంలో తిరుగుబాటు జెండాను ఎ ప్పుడూ రెపరెపలాడిస్తూనే ఉంటుంది. సమాజం కోసం, సామాజిక న్యాయం, హక్కుల కోసం, సమానత్వం కో సం, ఐక్యత కోసం పరితపించే ప్రతి ఒక్కరూ తమ గుండెల్లో దాచుకోవాల్సిన పుస్తకం ఇది.

# హిమజా రామం - తెలంగాణ గజల్ మాలిక



న్యాలకంటి నారాయణ
9550833490

పద్యం, కవిత్వం, పాట, గేయం, గజల్ ప్రక్రియ ఏదైనా మనసులోని భావాన్ని కళాత్మకంగా వ్యక్తపరచట మే దాని లక్ష్యం. ఆధునిక కవిత్వంలో వచన కవిత్వంతో పాటు ఇప్పుడు హైకూలు, నానీలు, చిమ్నీలు, సప్తపదు లు, రుబాయిలు, మణిపూసలు (లఘు రూప కవితలు) ఇలా తరాన్నిబట్టి రూపాంతరం చెందటం చూస్తున్నాము, నాటి ప్రాచీన సాహిత్యం నుండి నేటి ఆధునిక సాహిత్యం తీరుతెన్నులు గమనిస్తే మనకు కాలమాన పరిస్థితులను బట్టి మార్పులు సాధ్యమే అని బోధపడుతుంది.

**గజల్:** సుమారు 17వ శతాబ్దంలోనే హైదరాబాద్‌లో మహమ్మద్ కులీ కుతుబ్ షా ఉర్దూ, పర్షియన్ వంటి భాషలలో గజల్లు రచించి ఈ సంప్రదాయానికి పునాది వేశారు. 'గజల్' ఇదొక ఉర్దూ భాషకి చెందిన పదం కాబట్టి అది మనకు సంబంధించింది కాదు అనే భావనలో చాలామంది ఉండేవారు గతంలో (ఇప్పుడు కూడా కొందరు), భాషలను బట్టి ప్రాంతాలు ఆయా సాహిత్య ప్రక్రియలను 'అడాప్ట్' చేసుకోవటం అనేది సర్వసాధారణ విషయం, నేటి సాహిత్యంలో ఆంగ్ల కవుల ప్రభావం, వారి రచనల ప్రస్తావన లేదని చెప్పగలమా మనం? కాబట్టి భాష/ప్రక్రియ ఏదైనా దాన్ని మన ప్రాంతానికి, సంస్కృతికి భంగం కలగకుండా ప్రయోగించుకోవడంలో తప్పు లేదు, కవిత్వం ఒకప్పుడు రాజులను కీర్తించడానికి ఉపయోగించేవారు ఆనాటి కవులు. అలాగే 'గజల్' కూడా ప్రియురాలిని వర్ణించడానికి, మెప్పించడానికి మాత్రమే రాసేవారు అన్నభావన ఉన్న రోజుల్లోనే తెలుగు గజల్లు ప్రేమ, విరహం, సామాజిక అంశాలు మరియు ఆధ్యాత్మికతను ప్రతిబింబించే అద్భుతమైన సాహిత్య ప్రక్రియగా భావించి 'దాశరథి కృష్ణమాచార్యులు' గారు 1961 ప్రాంతంలో తెలుగులో గజల్ ప్రక్రియకు బాటలు వేసి, మిర్జా గాలిబ్ ఉర్దూ గజల్లను తెలుగులోకి అనువదించి, ఉర్దూ సాహితీ ప్రక్రియకు 'తెలుగు' రూపాన్ని ఇచ్చారు, కేవలం అనువాదాలే కాకుండా, తనదైన శైలిలో తెలుగులో స్వతంత్ర గజల్లు రాశారు, పద్యాన్ని, గేయాన్ని, గజల్‌ను తన భావాలకు అనుగుణంగా మలచుకుని, ప్రేమ, తెలంగాణ తొలిదశ ఉద్యమం, మానవీయ కోణాలను తన గజల్లలో అద్భుతంగా ఆవిష్కరించారు, ఇదేకోవలో 'సినారె' గారు కూడా ముందుకొచ్చి ఆ భ్రమలను తొలగిస్తూ అన్నిఅంశాలకు సంబంధించి రాయవచ్చని నిరూపించడం జరిగింది, తర్వాత గజల్ శ్రీనివాస్ గారు (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) వీటిని పాడుతూ ప్రజాదరణ పొందేలా చేశారు, అటుపిమ్మట కొందరు కవులు గజల్లు రాయడానికి, పాడటానికి ఆ కాలంలో (1980 దశకంలో) ముందుకొచ్చారు అందులో ముఖ్యంగా, PB శ్రీనివాస్ గారు, శొంఠి పద్మజ (గాయకులు) లాంటి వారున్నారు.

### తెలుగు గజల్

ఉర్దూ ప్రక్రియను అనుసరించి తెలుగులో రూపుదిద్దుకున్న ఒక సుందరమైన సాహిత్య ప్రక్రి య, ఇతర రచనా విధానాల నుంచి శైలి పరంగా గజల్‌ను ప్రత్యేకంగా చూపిస్తుంది, గజల్ మాత్రా గణబద్ధమై న, ఛందస్సు నియమాలు కలిగి గేయకవితా ప్రక్రియకు సంబంధించింది, దాశరథి కృష్ణమాచార్యులు, సి. నారాయణ రెడ్డి (సినారె) వంటి దిగ్గజాలు ఇందులో ప్రసిద్ధు లు. సినారె గారి అమ్మగుండె ఊయలలో..., వలపునై నీ హృదయసీమల నిలువవలెనని ఉన్నది, 'విసుగొచ్చిందా జనమంటే.. వెర్రివాడా! ఆ జనమే నిను నడిపించే అడు గుజాడ ! వంటి గజల్లు ప్రసిద్ధి గాంచినవి. తర్వాత వరుసలో భైరి ఇందిర గారు (2011) తొలి తెలుగు మహిళా గజల్ కవయిత్రిగా ప్రసిద్ధి చెందిన వీరు గాయపడిన హృదయం, సంఘర్షణ, దుఃఖం, వేదన గజల్ రచనలకు ఆత్మ వంటివి అని వారి రచనల ద్వారా నిరూపించారు. అప్పట్లో దక్కన్ గజల్ అకాడమీ మరియు గడ్డం శ్యామల గారి కొమర్రాజు ఫౌండేషన్ వంటి సంస్థలు వీరిని ప్రోత్సహించాయి.



### తెలంగాణ గజల్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర మలిదశ ఉద్యమ సమయంలో గజల్లు ప్రజల్లో ఉత్తేజాన్నినింపాయి. తెలంగాణ ఉద్యమ నేపథ్యం, బతుకమ్మ, సంస్కృ తి, అమరవీరుల త్యాగాలను ప్రతిబింబిస్తూ, హృదయ వేదనను, సంఘర్షణను వ్యక్తపరిచే సాహిత్య ప్రక్రియగా భావించి మహిళల్లో 'హిమజా రామం' వంటివారు కొం దరు తెలంగాణ గజల్ సాహిత్యానికి, సంగీతానికి విశేష కృషి చేస్తున్నారు.

### హిమజారామం

చిన్నప్పటినుండి పాట, భావన, సాహిత్యం, తెలంగాణపై ప్రేమ లాంటి అంశాల ప్రభావం గజల్లు వ్రాయడానికి ప్రేరణగా నిలిచాయి, సినారె గారి స్ఫూర్తితో గజల్లు రాయడం మొదలుపెట్టిన వీరు 'వర్షం'పైన తన మొదటి గజల్ రాయడం, 15 ఏళ్ళ గజల్ ప్ర యాణంలో ఎన్నో అడ్డంకులు అధిగమిస్తూ తన ఈ ప్ర యాణాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు, ఇప్పటికే వందలాది గజల్లు రాసిన వీరు తెలంగాణ రాష్ట్ర అవతరణ పోరాటంలో మొదటి గజల్ పాడటం జరిగింది. పోరాటాల పుడమిలో వెలిగిందిలే తెలంగాణ.... త్యాగగాధ లే చరిత్రగా రాసిందిలే తెలంగాణ'. కల్వకుంట్ల కవిత (కవితక్క), మామిడి హరికృష్ణ వంటి ప్రముఖులు, ఇంకా జాగృతి సభ్యుల ప్రోత్సాహంతో గజల్ కుటుంబాన్ని ఏర్పరిచి ఈ సాహిత్య ప్రక్రియలో ఆమె ఎంతో కృషి చేస్తున్నారు. గజల్లు రాయడమే కాకుండా వాటికి స్వరకల్పన చేస్తూ స్వతహాగా పలు వేదికలపై (ఇతర సాహిత్య ప్రక్రియలవైపు వెళ్లకుండా) ఆలపిస్తూ అంకితభావంతో గజల్ ప్రక్రియ వ్యాప్తి కోసం చేస్తున్న కృషిని గుర్తించి ఇటీవల జరిగిన 'మహిళా దినోత్సవం' సందర్భంగా వీరికి శ్రీ చారిటబుల్ ట్రస్ట్ వారు 'తొలి తెలంగాణ మహిళా గజల్ వాగ్గేయకారిణి'గా పురస్కారంతో పాటు 'శ్రీ శక్తి పురస్కారం', తెలుగు సాహిత్య కళా పీఠం వారు 'గజల్ గాంధ ర్వ' బిరుదును, సరస్వతి సేవా సమితి వారు 'గజల్ క ళాంజలి' బిరుదును ఇచ్చి సత్కరించారు. వివిధ సాంస్కృతిక సంస్థలు అనేక పురస్కారాలతో గౌరవిస్తూ ప్రోత్సహించడం వీరి ప్రతిభకు నిదర్శనం, వీరు ఏకంగా గజల్ కుటుంబాన్ని ఏర్పరిచి 'స్వరవల్లరి తెలంగాణ గజల్ అకాడమీ' పేరుతో, తెలంగాణ సాహిత్య అకాడెమి, వివి ధ సంగీత సాంస్కృతిక సంస్థల సహకారంతో పలు గజ ల్ సంగీత కార్యక్రమాలను తరచుగా నిర్వహి స్తూ ప్రతి ఏటా 'భైరి ఇందిరా రమణమ్మ' పేరుతో గజల్ సాహిత్యంలో విశేష ప్రతిభ ప్రదర్శిస్తున్నవారికి పురస్కారాలు ప్రదానం చేస్తూ తెలంగాణ గజల్ ప్రయాణంలో ముందంజలో వున్నారు, తెలంగాణ ప్రాంతంలో తెలుగు గజల్లు రాయడంలో ప్రముఖులుగా పెన్నా శివరామకృష్ణ, సూరారం శంకర్, ము కుంద సుబ్రహ్మణ్యశర్మ, గడ్డం శ్యామల వంటి వారు గజ ల్లు రాయడంలో విశేష కృషి చేస్తున్నారు. కానీ తెలంగాణ ప్రాంతం నుండి 'తెలంగాణ' అనే అంశం మీద మాత్రం భైరి ఇందిర, హిమజా రామం మాత్రమే గజల్లు రాసినట్టుగా తెలుస్తుంది.

### తెలంగాణ గజల్ మాలిక

హిమజారామం గారు రచించిన ఈ గజల్ గేయ సంపుటిలో ముందుమాట కల్వకుంట్ల కవిత రాశారు. అందులో వారు 'గజల్ కూడా ఒక భావ ప్రకటన' గా పేర్కొన్నారు. ఈ సంకలనంలో మొత్తం 60 గజల్లు వున్నాయి. అందులో నుండి ఉదాహరణకు కొన్ని

*వీరు కొత్తగూడెం ప్రాంతంలోని ఇల్లందు అంటే సింగరేణి నేపథ్యం ఉన్న ప్రాంతం నుండి పుట్టి పెరిగిన వారు కావడంతో సింగరేణి మీద అందులో పని చేసే గని కార్మికుల పైన ఇలా తన ప్రేమను చాటుకున్నారు.*

### సింగరేణి

'నల్లసిరులు పంచుతుంది లోకానికి సింగరేణి
పూలరథం నడుపుతుంది మనదారికి సింగరేణి
పాలించుటే కాదు ఒక తల్లిలాగ లాలించి
కనుల వెలుగు నింపుతుంది సింగరేణి

తన తనువును చీల్చుకుంటూ నిరంతరం తోడుంటూ
బతుకు విలువ పెంచుతుంది తనవారికి సింగరేణి
రక్తంతో రాసిన పాటల గుండెను ముద్దాడుతూ
వెలుగుతెరలు పరుస్తుంది పోరుకొరకు సింగరేణి'

*నీటి ప్రాధాన్యత మనిషికి, రైతన్నలకు ఎంత ముఖ్యమో తెలియజేస్తూ 'చెరువు' అనే గజల్లో*

### చెరువు

'రైతన్నల కన్నులలో ఆనందం నింపుతుంది చెరువే
ఊరందరి దాహార్తిని తీర్చుతుంది చెరువే
మతమేమి జాతియేమి అన్న ప్రశ్న లేదిక్కడ
మనసులలో మానవతా పరిమళం వెదజల్లుతుంది చెరువే

ఋతువులకే ప్రతినిధిగా భూదేవికి సోదరిగా
త్యాగమే తన రూపమై నిలుస్తుంది చెరువే'

### చేతుల కీర్తి దానం అనేగజల్‌లో ...

ఎప్పుడైనా చూశారా గాయపడిన చేతులు
రాళ్లు కొట్టి బండలైన అమ్మా,నాన్న చేతులు
ప్రాణాలే పణం పెట్టి సేవలనే అందించి
ప్రపంచానికి ఊపిరి ఊదిన చేతులు

ఊరు, వాడ మలినాలను ఒళ్ళంతా అలుముకుని
మనదారులు అద్దంలా మెరిపించే చేతులు
ఎండనక, వాననక పొలాలన్నీ దున్నుతూ
దేశానికి అన్నమై అలరారిన చేతులు

### తెలంగాణ పాట, పల్లె జానపదం ప్రాముఖ్యతను తెలియజేస్తూ ...

పల్లె గాలి పల్లకిలో జానపదం వినిపిస్తోంది నేడు
పంట పొలాల్లోన ఆశల ఉదయమే చిగురిస్తోంది నేడు
మాతృభాషలోనే బానిసల గొంతు గళమౌతోంది చూడు
అదిగో విద్యా జ్యోతిలో కొత్త కలం మెలుస్తోంది నేడు

బతుకమ్మ పూవుల సోయగం పల్లెల్లో పరిమళిస్తోంది
పండుగలా గీతాలతో ఊరంతా వెలుగుతోంది నేడు
కూలి చెమటలతో కష్టజీవుల బతుకుబాట నడుస్తోంది
సామూహిక శక్తితో సరికొత్త కల చేరుస్తోంది నేడు

ఇంకా వీరు ఈ పుస్తకంలో తెలంగాణలోని ప్రముఖ ఊర్లు, పండుగలు, జాతరల కోలాహలంపై మంచి గజల్లు రచించారు, తెలంగాణ ప్రాంతానికి ప్రముఖ కవులపై అద్భుతంగా గజల్లు రాసి తన ప్రతిభను చాటుకున్నారు. గజల్ సాహిత్య ప్రక్రియలో విసుగు, విరామం లే కుండా నిరంతరం ఇష్టంగా శ్రమిస్తున్న 'హిమజారా మం' గారిని మనం 'తెలంగాణ గజల్ బిడ్డగా' గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

**పుస్తకం పేరు**

*తెలంగాణ గజల్ మాలిక (గేయ సంపుటి)*
కవయిత్రి పేరు : హిమజా రామం
పేజీలు : 96, వెల : 250
ప్రతులకు: mhimajaramam@gmail.com
మరియు అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో లభ్యమగును.

# ప్రపంచంపై బ్రిటీష్ సాహిత్య ప్రభావం

ప్రపంచ చరిత్రలో రాజకీయ, సామాజిక, ఆర్థిక మార్పులు సాహిత్యంపై గాఢమైన ప్రభావం చూపాయి. 16వ శతాబ్దం నుంచి 20వ శతాబ్దం వరకు వివిధ దేశాల్లో వికసించిన సాహిత్య ధోరణులు మానవ ఆలోచనల అభివృద్ధిని ప్రతిబింబిస్తాయి. ఇంగ్లాండ్ ప్రపంచ శక్తిగా ఎదిగిన క్రమంలో ఆ దేశ సాహిత్యం విశేష ప్రాధాన్యం పొందింది. ఎడ్మండ స్పెన్సర్ రాసిన ది ఫెయిరీ క్వీన్‌తో ఎలిజబెథన్ యుగ సాహిత్యం ప్రారంభమైంది. జాన్ డోన్ నేతృత్వంలో మెటాఫిజికల్ కవిత్వం అభివృద్ధి చెందింది. జాన్ మిల్టన్ రచించిన 'పారడైజ్ లాస్ట్' ఆంగ్ల మహాకావ్య సాహిత్యంలో ఒక మైలురాయి. విలియం షేక్స్‌పియర్ హాస్యాలు, విషాద నాటకాలు, చారిత్రక నాటకాల ద్వారా ఆంగ్ల సాహిత్యాన్ని శిఖరస్థాయికి చేర్చాడు. ఆధునిక నవల రూపకల్పనలో డేనియల్ డెఫో (రాబిన్సన్ క్రూసో), జోనాథన్ స్విఫ్ట్ (గలివర్స్ ట్రావెల్స్) కీలక పాత్ర పోషించారు. ఫ్రాంకోయిస్ రాబెలైస్ రచించిన 'గార్గాంటువా అండ్ పాంటాగ్రూయెల్' ఫ్రెంచ్ సాహిత్యంలో నవలాత్మక రచనలకు పునాది వేసింది. 17వ శతాబ్దం ఫ్రాన్స్‌లో గ్రాండ్ సైకిల్‌గా ప్రసిద్ధి చెందింది. జీన్ రసీన్, మోలియర్ వంటి నాటక రచయితలు, లా ఫోంటైన్, చార్లెస్ పెరాల్ట్ కథల ద్వారా విశేష గుర్తింపు పొందారు. కాగా, ఇటాలియన్ పునరుజ్జీవనం యూరప్ మొత్తానికి మార్గదర్శిగా నిలిచింది. జాకోపో పెరి రచించిన డాఫ్నే తొలి ఒపెరాగా గుర్తింపు పొందింది. స్పానిష్ సాహిత్యం గురించి ప్రస్తావించినప్పుడు మిగ్యుల్ డి సెర్వాంటెస్ గు రించి తప్పక చెప్పుకోవాలి. ఆయన రచించిన 'డాన్ క్వి క్సోట్' ప్రపంచ సాహిత్యంలో తొలి ఆధునిక నవలగా గుర్తింపు పొందింది. 16–17వ శతాబ్దాలను స్పానిష్ స్వర్ణయుగంగా పేర్కొంటారు. తూర్పు ఆసియా సాహిత్యం విషయానికి వస్తే, చైనాలో మింగ్ రాజవంశ కా లంలో ముద్రణ విస్తరించడం వల్ల సాహిత్యం ప్రజల్లోకి వచ్చింది. వాటర్ మార్జిన్, రొమాన్స్ ఆఫ్ ది త్రీ కింగ్డమ్స్, జర్నీ టు ది వెస్ట్ వంటి నవలలు ఈ కాలానికి చెందినవే. జపాన్‌లో కబుకి, నోహ్ నాటకాలు, కొరియాలో హాంగ్ గిల్డాంగ్ జియోన్ వంటి రచనలు స్థానిక సాహిత్యాన్ని బలోపేతం చేశాయి. ఆధునిక యూరప్, అమెరికా సాహితీ ప్రపంచం 18వ శతాబ్దం జ్ఞానోదయ యు గంగా వోల్టేర్, రూసో, కాంట్ వంటి ఆలోచనాపరులను అందించింది. 19వ శతాబ్దంలో రొమాంటిసిజం, వాస్తవికత, సహజవాదం వికసించాయి. బ్రిటన్‌లో విక్టోరియన్ యుగంలో చార్లెస్ డికెన్స్ నవలలు సామాజిక వాస్తవాలను ప్రతిబింబించాయి. 20వ శతాబ్దంలో ఆధునికవాద సాహిత్యం ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపింది. ప్రపంచ సాహిత్యం అనేది కేవలం కథలు, కవితల సమాహారం మాత్రమే కాదు... అది మానవ సమాజం ఆలోచనల, విలువల, పోరాటాల ప్రతిబింబం. భిన్న దేశాల సాహిత్యాలను చదవడం ద్వారా ప్రపంచాన్ని అర్థం చేసుకునే దృష్టి విస్తరిస్తుంది.



## ఈ వారం కవితలు

### కార్మిక సూర్యులు




చూపుడు వేళ్ల సంతకాలు చేస్తేనే
కాలచక్ర యంత్రాలు తిరిగేవి
చెమట చుక్కల నదులు పొంగితేనే
ముడి సరుకుల చక్రాలు కదిలేవి
కార్మిక కర్షక అడుగులు వేస్తేనే
కాలగమన సోపానాలు నిద్రలేచేవి
దేహపు కండరాలు కరిగిస్తేనే
ప్రపంచ చక్రాలు ముందుకు
నడిచేవి
జీవన సౌరభాల విత్తనాలను
మొలకెత్తిస్తేనే
బతుకు పోరాటల ఆటలు గెలిచేవి

కార్మిక ఆశయాల్ని తాకట్టుపెట్టి
మానవత్వంలేని విలువలను
మూటకట్టి
నడుస్తున్న ఒంటెద్దు పోకడలపై
చెదలు పట్టిన చీడపురుగుల్నీ
నాశనం చేసే విప్లవాగ్నిని రగిల్చే
ఆత్మ విశ్వాసపు దివిటీలు కార్మిక
సూర్యులు
తూర్పున సిందూరం తిలకం దిద్దిన
పడమట సంధ్యారాగం పాడిన
గొంతు నుండి రుధిర భాష్పాలు
రాలిపడిన
గనులు కొలనులో దేహరక్తం
చిందించిన

రేపటి సూర్యతేజ కిరణమై
నిండు వెలుగులను ప్రసాదించే
గొప్ప హృదయం గల ధిక్కార
స్వరాలు
నేటి మేటి ప్రపంచ దివిటీలు
కార్మిక సూర్యులు

– డాక్టర్ పగిడిపల్లి సురేందర్
8074846063

### ఆయుధాలూ... యుద్ధాలూ!

రుధిరాత్మలే
పగటి నిండా, రాత్రి నిండా పరచుకుంటున్నాయి !
పని పండగలే
ఒడులు నింపుతాయన్నది మరచిపోతున్నారు !
పొగుబడిన కుప్పలు
పంపకానికి బదులు ఒంటి పంటి కింద నలిగిపోతున్నాయి !
వీధుల్లోని
గోడలమీది కళాకృతుల్లా
ఆకలి రంగస్థలి మీద తెరలు లాగుతున్నారు !
చదువు లేదు, చదవనివ్వడం లేదు
చత్వారాలు పెంచుతూ
చెదపురుగుల చావడులు చాపల్లా పరుస్తున్నారు !
చీరలూ, పంచెలూ
ముళ్ళకంపల మీద జెండాల్లా ఎగరేస్తున్నారు!
ఓనమాల వొళ్ళు
గుళ్ళ వానలకి తూట్లు పడుతుంది !
అక్షరాకాశంలో
సూర్యోదయాలూ, చంద్రోదయాలూ మాయమైపోతున్నాయి !
పని చేయని చేతులని
మనుషులుగా లెక్కించగూడదు !
ఒకే ఒక పని వర్గంగా
పనీ పాటలతో జనం పల్లవించాలి !
ఆయుధాల్లేని రహదార్లూ
యుద్ధాల్లేని మైదానాలూ
అంతరంగాల శాంతి వనాలు !
ఆయుర్దాలకి సోపానాలు !

– ఒబ్బిని సన్యాసి రావు
9849558842

### మీకు తెలియనిదా!

సమాజపు బలహీనతైన
మూఢభక్తనే మూర్ఖత్వాన్ని
పరాకాష్ఠకు చేర్చి,
ఆ ఆయుధంతో పెత్తనం చేజిక్కుంచుకొని,
తన ఉన్నతికి మూలమైన
'తల్లికి' ఊపిరిలూదినవారిని
'అదేదో' పేరెట్టిన చెత్తబుట్టలో పడేసి,
'ఊహాజనిత','భ్రమాన్విత'
ప్రపంచంలో బతుకుతోన్న
స్వయంప్రకటిత 'దేవదూత' మాయలోపడి
అవసరాల బ్రతుకులు నెట్టుకొస్తోన్న
'ఓ మిత్రులారా!' గుర్తెరగండి.
'ఆమె' ఓడిపోలేదని,
ఆమెని రక్షణకవచంగా అడ్డుపెట్టుకొందామన్న
'శాశ్వతత్వం' ఓడిపోయిందని.

– వేమూరి శ్రీనివాస్
9912128967

### ఎత్తు మతలబులు



ఆలింగనంలో భర్త గుండె సవ్వడిని
భార్య ఓ వైద్యురాలిలా వినడానికి..
భార్య పాపిట సిందూరాన్ని అద్ది..
ఆమె బొట్టును భర్త రక్షించడానికి..
భార్య నెత్తిన చేయి పెట్టి..
మనస్ఫూర్తిగా దీవించడానికి..
భర్త జేబు బరువును చూసి..
అర్ధాంగి కోరికల చిట్టా విప్పడానికి..
భర్తతో సదా భార్య..
తలెత్తుకొని మాట్లాడటానికి..
స్థాయి ఏదైనా ఆలితో తలదించుకొని
భర్త మాట్లాడటానికి కాబోలు
భర్త కన్న భార్య ఎత్తులో..
చిన్నగా ఉండాలని
అంటారేమో కదా !

– మధుపాలీ
9949700037

## మరిపెడలో డీజిల్ కొరతను నియంత్రించాలి: సిపిఐ

**ప్రజాపక్షం/మరిపెడ:**మరిపెడ మండలంలో ఏర్పడిన డీజిల్ కొరతను నివారించాలని సిపిఐ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోంది.స్థానిక పేట్రోల్ బంకుల్లో నిలువలు లేక వాహనదారులు,రైతులు,సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,గంటల కొద్దీ బంకుల్లో వేచి చూడాల్సిన పరిస్థితి నేలకొన్నదని, డీజిల్ కొరత కారణంగా ట్రాక్టర్లు,ఆటోలు,ద్విచక్రవాహనాలు నిలిచిపోయి వ్యవసాయ పనులకు తీవ్ర అంతరాయం కలుగుతోందని,సాగుచేసే యంత్రాలు వినియెగించలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని,ఇప్పటికే ఖర్చులుపెరిగి బాధపడుతున్న రైతాంగానికీ డీజిల్ కొరత మరింత నష్టాన్ని కలిగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.అధికారులు సమస్యను పరిష్కరించకపోతే,కృత్రిమ కొరతను నివారించి కఠిన చర్యలు తీసుకోవాలనీ,లేనట్లయితే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన తప్పదని సిపిఐ జాల్లా సమితి సభ్యుడు ఎండి అబ్దుల్ రషీద్ హెచ్చరించారు.

## కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే పరిష్కరించాలి : పరికి కోర్నెల్

**ప్రజాపక్షం / నల్లబెల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కారించాలని సిపిఐ మండల నాయకులు పరికి కోర్నెల్ డిమాండ్ చేశారు . ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బట్టు సాంబయ్య ,పరికి రత్నంతో కలిసి మాట్లాడారు . ఈ సందర్బంగా పరికి కోర్నెల్ మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల సమ్మెలో అసువులు బాసిన డ్రైవర్ కోల శంకర్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు .ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికులతో జరిపిన చర్చలు వెంటనే అమలు చేసి కార్మికులకు న్యాయం చెయ్యాలన్నారు .

## ములుగు నూతన జిల్లా కలెక్టర్‌గా భోర్కడే హేమంత్ సహదేవరావు

**ప్రజాపక్షం/ములుగు:**ములుగు జిల్లా నూతన కలెక్టర్‌గా భోర్కడే హేమంత్ సహదేవరావు ఐఎఎస్ జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ రాజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే, 'కుడా'చైర్మన్ ఇనగాల



**ప్రజాపక్షం/ఐనవోలు :** వర్ధన్నపేట నియోజకవర్గం ఐనవోలు మండలం అనంతసాగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పలు ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఇందిరమ్మ ఇండ్లను శనివారం స్థానిక ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు, హనుమకొండ డిసిసి అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల రాజ్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీకలు: ఎంపి కావ్య



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** ఇందిరమ్మ ఇండ్లు పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ధర్మసాగర్ మండలం, పెద్ద పెండ్యాలలో ఆదివారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య హాజరై రిబ్బన్ కట్ చేసి ఇల్లు గృహప్రవేశాన్ని ప్రారంభించారు. అనంతరం గృహ నిర్మాణం చేసుకున్న కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం లోనే తీరుతుందని అన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట నాగరాజు, ఉప సర్పంచ్ ప్రవీణ్, గ్రామ అధ్యక్షుడు బిక్షపతి, గ్రామ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది ,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కన్వెన్షన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని మంజూరు నగర్ కొంపల్లి క్రాస్ వద్ద లో ఎర్రబెల్లి విజయలక్ష్మి సన్మారావు దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన వి ఎల్ కన్వెన్షన్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై కన్వెన్షన్‌ను ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లి అభివృద్ధి చెందుతున్న పట్టణానికి అనుగుణంగా ఇలాంటి కన్వెన్షన్‌లు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాన్వెన్షన్ నిర్వాహకులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, 9వ వార్డు కౌన్సిలర్ అప్పం కిషన్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఏ గ్రామానికెళ్లినా చేసిన అభివృద్ధి చూపిస్తా

### స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ఏ గ్రామంలో అయినా ఆ గ్రామ చౌరస్తాలో నిలబడి తాను చేసిన అభివృద్ధి గురించి చెప్పే సత్తా నాకు ఉందని,గత 15ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉన్న మీకు ఉందా అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ విసిరారు. ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్కుర్తి గ్రామంలో 15లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డు, అంగన్వాడీ సెంటర్ ప్రహరీ గోడ, ఇందిరమ్మ ఇల్లు, రామన్నగూడెంలో 12లక్షల 50వేలతో నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడ, 5లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డు, ఇందిరమ్మ ఇల్లు, ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి గారు వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేసి తిరిగి మార్కెట్లో అమ్మితే ప్రభుత్వానికి సీజన్ 5వేల కోట్ల నష్టం వస్తుందని తెలిపారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా రైతులు ఆర్థికంగా నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి దాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తుందని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలని సద్వినియోగం చేసుకొని మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. పేద ప్రజల స్వంత ఇంటి కళను కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సాకారం చేశారని అన్నారు. త్వరలోనే 2లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు తెల్ల రేషన్ కార్డు ఉన్న కోటి 10లక్షల కుటుంబాలకు ఇందిరా కుటుంబ భీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా కుటుంబ పెద్ద చనిపోతే 15 రోజులలో 5లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఎల్కుర్తి, రామన్నగూడెం గ్రామాలకు 30ఏళ్ల క్రితం నేను వేసిన రోడ్లే ఉన్నాయని అన్నారు. ఎల్కుర్తి గ్రామానికి నాలుగు వైపులా బిటీ రోడ్లు, రామన్నగూడెంకు బిటీ రోడ్డు ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో నేను మంత్రిగా ఉన్నప్పుడు వేసానని తెలిపారు. అలాగే గ్రామంలో భూమి లేని నిరుపేదలకు భూ పట్టాల పంపిణీ, పాఠశాల, వాటర్ ట్యాంక్, సిసి రోడ్లు, ఇండ్లు మంజూరు చేసుకున్నామని వెల్లడించారు. ఇప్పుడు మళ్ళీ తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి ఒక్కొక్కటిగా పనులు చేస్తున్నాని అన్నారు. ఎల్కుర్తి గ్రామం మీదుగా జాతీయ రహదారి నుండి నారాయణగిరి వరకు 50కోట్లతో డబుల్ రోడ్డు మంజూరు అయిందని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాని తెలిపారు. గ్రామ పరిధిలో సిసి రోడ్డు నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. మొదటి విడతలో ఎల్కుర్తి, రామన్నగూడెం గ్రామాలకు 21ఇండ్లు మంజూరు చేశానని రెండో విడతలో మరో 30ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని తెలిపారు. అలాగే ఎస్సి కమ్యూనిటీ హాల్, అసంపూర్తిగా ఉన్న మహిళా కమ్యూనిటీ హాలుకు10లక్షలు మంజూరు చేస్తానని, గ్రామంలో అంతర్గత సిసి రోడ్లు కూడా మంజూరు చేస్తానని పేర్కొన్నారు. రామన్నగూడెంలో 10లక్షల సిసి రోడ్లు, ఎల్కుర్తి నుండి రామన్నగూడెం వరకు బిటీ రోడ్డు మంజూరు చేస్తానని 6నెలలలోపు ఈ పనులను పూర్తి చేస్తానని వెల్లడించారు.రాజకీయాలలోకి 32ఏళ్ళు అవుతుందని, ఈ 32 ఏళ్లుగా నిజాయితీగా పని చేస్తున్నాని ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికే నీతి నిజాయితీగా ఉపయోగిస్తున్నానని వెల్లడించారు. ఏనాడూ ఎవరి దగ్గర పని ఇప్పిస్తాననో, పదవులు ఇప్పిస్తాననో ఒక్క రూపాయి తీసుకోలేదని 32ఏళ్లుగా రాజకీయాలలో కొనసాగుతున్నాను అంటే నా నిజాయితీనే కారణం అని స్పష్టం చేశారు. రాజకీయాలు పక్కన పెట్టి గ్రామ అభివృద్ధికి అందరు కలిసి కట్టుగా ఉండాలని సూచించారు. ఎవరెన్ని విమర్శలు చేసిన నేను పట్టించుకోనని, నాకున్న ఏకైక ఎజెండా, సంకల్పం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగన నిలపాలి, పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే అని తెలిపారు. ఎల్కుర్తి గ్రామాన్ని ప్రత్యేక దృష్టితో అత్యధిక నిధులు వెచ్చించి అభివృద్ధి చేసే బాధ్యత నాదని, దానికి మీ అందరి సహకారం, మద్దతు కావాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సర్పంచ్ సుధాకర్, ఎంపిడిఒ, హౌసింగ్ ఇన్‌చార్జ్ పిడి సిద్ధార్థ నాయక్, పిఆర్ డిఇ , ఎ ఇలు, ఇతర అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు సూచించారు. ఆదివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు పాటించి రైతులు మద్దతు ధరను పొందాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో తూకంలో ఎలాంటి తేడాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా గన్ని బ్యాగులు తక్షణమే అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం విక్రయించిన రైతుల బ్యాంక్ ఖాతాల్లో సకాలంలో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా రాజకీయ పరిణామాలపై కూడా ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై మాట్లాడుతూ, అది స్వతంత్ర పార్టీ కాదని, "కెసిఆర్ విసిరిన బాణమే కవిత" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.గత పదిహేనేళ్లుగా దోచుకున్న సొమ్మును ఎలా పంచుకోవాలనే విషయంలో వచ్చిన విభేదాల వల్లే బిఆర్ఎస్ నేతలు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి కొత్త పార్టీలు పెడుతున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా పాలనకు ప్రజల నుంచి పూర్తి స్థాయి ఆదరణ లభిస్తోందని, అందువల్లే బిఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోయి నామరూపాలు లేకుండా పోయిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, పారదర్శక పాలనను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ఇలాంటి రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నాయని ఆయన విమర్శించారు. తెలంగాణలో ఇక బిఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తు లేదని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డి.సి.ఓ నీరజ, సొసైటీ ఇన్‌చార్జ్ కీరునాయక్, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కమిషనర్ జోనా, తహసీల్దార్ విజయసాగర్, వైస్ చైర్‌పర్సన్ శిభారాణి రాజేందర్, పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజీ రెడ్డి,పి.ఎ.సి.ఎస్ మాజీ చైర్మన్ రాజేష్ ఖన్నా,కౌన్సిలర్స్ పాపారావు,కమిలి భీమా నాయక్,తుమ్మల అరుణ,రమ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్ హైస్కూల్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**వరంగల్ కొత్తవాడ ప్రాంతంలోని భారత్ హైస్కూల్ ప్రారంభోత్సవానికి పంచాయతీ శాఖ మంత్రి ధనసరి సీతక్క, వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్, మెంబర్ ఆఫ్ పోలీస్ కంప్లైంట్ అథారిటీ, డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల్ నవీన్ రాజ్ హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ డాక్టర్ బండి కృష్ణ, డాక్టర్ వెంకటేశ్వర్లు పిహెచ్‌డి చేసి ఇలాంటి స్కూల్ ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పోలీస్ కంప్లైంట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ మెంబర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశ ప్రగతి పాఠశాల గదిలోన ప్రారంభం అవుతుందని అందుకు క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం అవసరమని అది భారత్ స్కూల్ ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ స్కూల్ యాజమాన్యం డాక్టర్ బండి కృష్ణ, డాక్టర్ బండి శ్రీనివాస్, బండి సుమ, వెలిదె దివ్య, ఉస్మానియా ప్రొఫెసర్ డాక్టర్ నరసింహం, కేయూ ప్రొఫెసర్ రమా, ఫణిందర్, కాంగ్రెస్ పార్టీ లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

## గొట్లకొండలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/నెక్కొండ:**వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని గొట్లకొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి ప్రారంభించి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర, బోనస్ రూ.500 సౌకర్యాలపై వివరించారు. రైతులు పండించిన ధాన్యాన్ని మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా ప్రభుత్వానికి విక్రయించుకునే విధంగా ఈ కొనుగోలు కేంద్రాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని నష్టపోకుండా లాభపడాలని సూచించారు. కేంద్రం ప్రారంభం సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులకు అవసరమైన తూకం, నిల్వ, చెల్లింపుల ప్రక్రియలు పారదర్శకంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ యాసం లావణ్య, వెలుగు ఎబిఎన్ కిరణ్, టిపిసిసి సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, జిల్లా మహిళా సంఘాల సమైఖ్య అధ్యక్షురాలు రజిత, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బక్కి అశోక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల్ చౌహాన్, కొల్లు వెంకట సుబ్బారెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస్,రామలింగేశ్వర ఆలయ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు చల్ల శ్రీపాల్ రెడ్డి, చ ల్ల రఘోత్తం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ప్రెసిడెంట్ రావుల తిరుపతి రె డ్డి, ఈదునూరి సాయికృష్ణ, సింగం ప్ర శాంత్, నేతుల సారంగపాణి యాదవ్, పాల్గొన్నారు.

## నిబద్ధత కలిగిన ఆదర్శ నాయకుడు కామ్రేడ్ సోతుల నరసింహారావు

### సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారధి

**ప్రజాపక్షం/గార్ల ;** నిబద్దత కలిగిన పోరాట యోధుడు కామ్రేడ్ పోతుల నరసింహారావు అని ఆయన మరణం సిపిఐ పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారధి అన్నారు. సిపిఐ పార్టీ మాజీ మండల కార్యదర్శి పోతుల నరసింహారావు సంస్మరణ సభ సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న అధ్యక్షతన ఆధివారం నాడు మండల కేంద్రంలోని పోతుల నరసింహారావు స్వగృహం నందు ఘనంగా నిర్వహంచారు. ఈ కార్యక్రమానికి హజరైన జిల్లా కార్యదర్శి విజయసారధి సిపిఐ రాష్ట సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్‌లు నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చివరిశ్వాస వరకు ఎర్రజెండాను వీడకుండా ప్రజల పక్షాన నిలబడి పోరాటం మార్గంలో సాగిన ఆయన జీవితం పలువురుకి ఆదర్శనీయమని అన్నారు. ఆయన చిత్రపటానికి వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మండా రాముగౌడ్ ,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి గార్ల మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ సక్రు, విద్యావంతుల వేదిక రాష్ట ఉపాధ్యక్షుడు జంపాల విశ్వ, కుటుంబ సభ్యులు పోతుల బుజ్జిబాబు,పిడమర్తి ప్రసాద్,రాగం రమేష్, ధూపాటి జనార్ధన్, ధారావత్ వీరన్న, రాగం సత్యనారాయణ, కట్టెబోయిన పిచ్చయ్య, పొన్నం వెంకన్న,అధిక సంక్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై పరిష్కారానికి బిఆర్ఎస్‌వి పోరాటం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** బిఆర్ఎస్‌వి ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోరుబాటకు సంబంధించిన పోస్టర్ ను బిఆర్ఎస్‌వి హనుమకొండ జిల్లా కో ఆర్డినేటర్ గండ్రకోట రాకేష్ యాదవ్ ఆధ్వర్యంలో వడ్డేపల్లి నివాసంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం 8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం కారణంగా విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఇబ్బందుల నేపథ్యంలో బిఆర్ఎస్‌వి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు.రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వలన విద్యార్థులు 13 లక్షల మంది విద్యార్థి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర, హనుమకొండ జిల్లా కో ఆర్డినేటర్ బైరపాక ప్రశాంత్, రూరల్ జిల్లా కో ఆర్డినేటర్ రఘుపతి, నాయకులు వీరస్వామి, కోరపెల్లి రాజేష్, రాసూరి రాజేష్, పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయంలో వాసవిమాత జయంతి ఉత్సవం



**ప్రజాపక్షం/జనగామ :** రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వాసవి మాత జయంతి ఉత్సవం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి అమ్మవారి చిత్రపటానికి పూలమాల వేసి అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి యువజన, క్రీడల అభివృద్ధి అధికారి కోదండరాములు, ఆర్యవైశ్య సంఘం కుల పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## స్వీయ జనగణనలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలి: కలెక్టర్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :**జనాభా లెక్కల స్వీయ జనగణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. ఆదివారం ఐడిఓసి కార్యాలయంలో స్వీయ గణన ప్రక్రియపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్వీయ గణన ప్రక్రియ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణన జరుగుతుందని ప్రతీ ఒక్కరు తమ వివరాలను సులభంగా మీ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ముందుగా https://se.census.gov.in లింక్ ఓపెన్ చేసి ఎన్యుమరేషన్ హెచ్ ఎల్ ఓ లాగిన్ వద్ద తెలంగాణ ఎంపిక చేసి క్యాప్స్ ఎంటర్ చేసి వెరిఫై Proceed ప్రాసెస్డ్ క్లిక్ చేయాలని తెలిపారు. తదుపరి వెల్ కం పేజీలో కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్ నమోదు చేయాలని, ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ ఉపయోగించాలన్నారు. మొబైల్ కు వచ్చిన ఓటిపి ఎంటర్ చేసి వెరిఫై ప్రాసెస్డ్ క్లిక్ చేయాలని, తరువాత మనకు నచ్చిన భాషను ఎంచుకోవాలన్నారు.జిల్లా, పట్టణం, గ్రామం, పిన్ కోడ్ వివరాలు నమోదు చేయాలని అన్నారు. మొబైల్ లో లోకేషన్ ఆన్ చేసి, మీ ఇంటి వద్ద రెడ్ మార్క్ సెట్ చేయాలని, ఇళ్ల వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, ప్రివ్యూ ద్వారా చెక్ చేసి చేయాలన్నారు. సబ్మిట్ చేసిన తరువాత హెచ్ తో ప్రారంభమయ్యే 11 అంకెల సెల్ఫ్ ఎన్యూమ రేషన్ ఐడి వస్తుందని, దానిని స్క్రీన్‌షాట్ లేదా నోట్ చేసుకుని భద్రపరచుకోవాలనితెలిపారు. మే 11 తరువాత మీ ఇంటికి వచ్చే గణన అధికారికి ఈ సెల్ఫ్ ఎన్యూమరేటర్ ఐడి చూపిస్తే వారు అప్రూవ్ చేస్తారన్నారు. మన బాధ్యత మన సమాచారమని ఆయన తెలిపారు. స్వయంగా నమోదు చేసి సమయాన్ని ఆదా చేసుకుందామన్నారు.దేశంలోనే అతి పెద్ద ప్రజా భాగస్వామ్య కార్యక్రమం జనాభా గణన 2027 కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జిల్లాలో స్వీయ గణన కార్యక్రమం కొనసాగుతుందని ఇందులో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొని వారి యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. పాత్రికేయులు ఈ స్వీయ గణనపై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.ఇండ్ల జాబితా గణన, జనాభా గణన మొదటి దశ మే 11, 2026 నుండి జూన్ 9, 2026 వరకు కొనసాగుతుందని, ప్రతి ఇంటి సమాచారం నమోదు చేయబడుతుందని, ఇంటి పరిస్థితి సౌకర్యాలు ప్రాథమిక సమాచారం సేకరించబడుతుందన్నారు. స్వీయ గణన ఆన్‌లైన్ పోర్టల్ se.census.gov.in వెబ్సైట్‌ను సందర్శించి సెల్ఫ్ డిక్లరేషన్ ఐడి పొందాలని, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరిగే స్వీయ గణనలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సిబ్బంది వారి కుటుంబ సభ్యులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. జనగణన వల్ల ప్రతి ఒక్కరి భవిష్యత్తు కార్యచరణ విధానాలకు ఖచ్చితమైన ఆధారం, వనరుల పంపిణీ, ప్రణాళికలు, మెరుగైన సౌకర్యాలు ప్రాంతాల అభివృద్ధితో పాటు పథకాల అమలు జనాభా గణాంకాలు ద్వారా పకడ్బందీగా అమలు జరుగుతుందన్నారు.మీ సమాచారం పూర్తిగా సురక్షితంగా, జనాభా లెక్కల చట్టం 1948 ప్రకారం సమాచారం గోప్యంగా ఉంచబడుతుందన్నారు.సర్వే సిబ్బందికి ఖచ్చితమైన సంపూర్ణమైన వివరాలు ఇవ్వాలని, సమగ్ర సమాచారం భవిష్యత్తులో బాగా ఉపయోగపడుతుందని జనాభా గణనలో గర్వంగా పాల్గొనాలని, దేశ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. జిల్లాలో జనాభా గణన కార్యక్రమం డిజిటల్ నమోదు కోసం 756 మంది ఎన్యూమరేటర్లును, 886 మంది సూపర్‌వైజర్లును నియమించి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ జవహర్, డిపిఆర్వో శ్రీనివాస్, ఆర్డిఓ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పేదల కోసం భూపోరాటాలు చేసింది కమ్యూనిస్టులే

సీతాయిగూడెంలో కీసర రాఘవులు స్థూపం ఆవిష్కరణ

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా




**ప్రజాపక్షం/చంద్రుగొండ:** పేదల పక్షాన భూ, పోడు పోరాటాలు చేసింది కమ్యూనిస్టు పార్టీలేనని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. ఆదివారం సీతాయిగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గ్రామ కార్యదర్శి కీసర రాఘవులు స్థూపాన్ని ఆయన ఆవిష్కరించారు. తొలుత పార్టీ జెండాను సిపిఐ జిల్లా నాయకులు గార్లపాటి రామనాథం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ దేశంలో పేదల భూ హక్కుల కోసం, పోడు భూముల పరిరక్షణ కోసం ఎన్నో ఉద్యమాలు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగాయని, ఆ పోరాటాల ఫలితంగానే నేడు పేదలకు కొంతైనా హక్కులు లభించాయని స్పష్టం చేశారు. కీసర రాఘవులు ఇక్కడ పేదల కోసం ఎన్నో పోరాటాలు చేశాడని, ఆయన చూపిన బాటలో మనమంతా పయనించాలన్నారు. ప్రజల కోసం పోరాడే నాయకత్వాన్ని తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పేదలు, గిరిజనులు భూమి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వారికి న్యాయం జరిగే వరకు సిపిఐ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు గార్లపాటి రామనాథం, నాగుల్ మీరా, జడ శ్రీను, మండల కార్యదర్శి బొర్రా కేశవులు, సర్పంచ్ పిట్టల రామలక్ష్మయ్య, కాకా సీత, భద్రయ్య, కనకరావు, తదితరులు పాల్గొన్నారు.

## నూతి సత్యనారాయణకు ఘన స్వాగతం



**ప్రజాపక్షం/ తల్లాడ :** అఖిలభారత కాంగ్రెస్ కమిటీ దేశవ్యాప్తంగా మండల, పట్టణ అధ్యక్షుల నియామకం కోసం సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం తల్లాడ మండలం పాత పినపాక గ్రామంలో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ ఆదేశానుసారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ పర్యవేక్షణలో పాత పినపాక సర్పంచ్ గుర్రం శ్రీను నేతృత్వంలో బూత్ ఏజెంట్లు, గ్రామ అధ్యక్షులు ఎన్నుకోవడం జరిగింది. ఈసందర్భంగా గుర్రం శ్రీను మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బూత్ ఏజెంట్ల, గ్రామ అధ్యక్షుల నియామకం చేపట్టిందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇంకా బలోపేతం, స్థిరంగా ఉండటానికి మన మందరం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాలని, ప్రతిఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ తోడుగా ఉండి తగిన పదవులు గుర్తింపు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాత పినపాక గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, గ్రామ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రగిరిలో జీర్ణోద్ధరణ

ప్రత్యేక పూజలు చేసిన చినజీయర్ స్వామి

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో జీర్ణోద్ధరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉపాలయ మూర్తులకు కళావాహన నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో చిన్నజీయర్ స్వామి పాల్గొని శాస్త్రోక్త పూజలు నిర్వహించారు. ఆలయాభివృద్ధిలో భాగంగా ఈ ఘట్టం ఆవిష్కృతమైంది. ఈ సందర్భంగా ఉపాలయాల్లోని 72 మూర్తులకు కళావాహన నిర్వహించారు. మూడుగోపురాల వద్ద ఈ పూజలు జరిగాయి. యాదగిరిగుట్ట, ధర్మపురి, సింహాచలం నుండి వచ్చిన 60 మంది రుత్వికులు, ఆలయ అర్చకులు మేళ తాళాల నడుమ పవిత్రగోదావరి పుణ్య జలాలను తీసుకొచ్చి యాగశాలలో పూజలు నిర్వహిచారు. అనంతరం స్తపతుల ఆధ్వర్యంలో కళావాహన చేసిన విగ్రహాలను కదిలించారు. అదే విధంగా లక్ష్మీ తాయారు, గోదాదేవి అమ్మవార్లకు ప్రధాన ఆలయం ముఖ మండపం మందు భక్తుల దర్శనార్థం ఉంచనున్నారు. ఇతర మూర్తులను రంగనాయకులు గట్టపై ధ్యానమందిరంలో ఏర్పాటు చేసి బాలాలయంలో ఉంచారు. ప్రత్యేకపూజల అనంతరం భక్తులకు దర్శనాలను కల్పించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి పాత్రికేయులతో మాట్లాడుతూ నిత్యం రామయ్యతో పాటు రామదాసుకు కూడా పూజలు జరగాలన్నారు. ఆలయాభివృద్ధి అనంతరం ఉపాలయాలన్నీ ఒకవైపు మరోవైపుకు ఆళ్వార్లు ఒకే చోట భక్తుల దర్శనార్థం ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ విశ్రాంత అర్చకులతో పాటు, ప్రస్తుత అర్చకులు, ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, ఇఓ దామోదర్ రావు, రామదాసు పదో తరం వారుసుడు కంచర్ల శ్రీనివాస్‌తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తాపడి..డ్రైవర్ మృతి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీకొట్టి, డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన యడవల్లి నాగేశ్వరరావు (51) ఆదివారం ట్రాక్టర్ డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తున్నాడు. బుద్దారం–చెరువుమాధారం రహదారిలో దేవాలయం సమీపంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి పల్టీకొట్టింది. దీంతో నాగేశ్వరరావు కు తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు నేలకొండపల్లి ప్రభుత్వ హాస్పిటల్ కు తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

## ఆర్కా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ఆధ్వర్యంలో ఆర్కా హాస్పిటల్ ఖమ్మం వారు ఆదివారం చింతకాని గ్రామంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. తొలుత వైద్య సిబ్బంది గ్రామస్థులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మనోహర్ బాబు ప్రారంభించారు. ఉచిత వైద్య పరిక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆర్ రవికుమార్, తక్కెళ్లపల్లి దుశాకశంతరావు, కృష్ణ సాగర్‌రెడ్డి, ఉప సర్పంచ్ కోలా ఉమారాణి, వార్డు సభ్యులు పొనుగోటి బాబు, గంధసిరి లలిత, గ్రామ ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# బంకుల వద్ద వాహనాల బారులు

రహదారులపై భారీగా ట్రాఫిక్ జామ్





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** యుద్ధ ప్రభావం నేపథ్యంలో బంకుల్లో ఆయిల్ కొరత ఏర్పడుతుందనే ప్రచారం సామాజికి మాధ్యమాల్లో విస్తృతంగా సాగడంతో వాహనదారులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు భారీగా బారులు తీరారు. ప్రధానంగా ఖమ్మం బైపాస్‌రోడ్డు, ఖమ్మం–సూర్యాపేట రోడ్డులోని పెట్రోల్ బంకులు వాహనాలతో నిండిపోయాయి. రహదారులపై వాహనాలు భారీగా నిలిచిపోవడంతో కొంత సేపు ట్రాఫిక్ అంతరాయం కూడా ఏర్పడింది. చాలా వాహనాలకు పూర్తిస్థాయిలో పెట్రోల్ అవసరం లేకపోయినప్పటికీ, ముందస్తు జాగ్రత్తగా ఫుల్ ట్యాంక్ చేసుకోవాలనే ఆలోచనతో వాహనదారులు బంకుల వద్దకు చేరుకున్నారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నిజంగా ఆయిల్ అవసరం ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్ద ఎత్తున వాహనాలు రావడంతో పలుచోట్ల పెట్రోల్ బంకులు మధ్యాహ్నానికే మూతపడిన పరిస్థితి ఏర్పడింది. పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉంచుకోవాలనే ఉద్దేశంతో వాహనదారులు తమ వాహనాల్లో ఫుల్ ట్యాంక్ చేయించుకోవడంతో బంకుల్లో ఉన్న నిల్వలు వేగంగా తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో పలు చోట్ల బంకుల్లోని ట్యాంకుల్లో పెట్రోల్, డీజిల్ పూర్తిగా ఖాళీ అయినట్లు సమాచారం. అంతేకాకుండా కొందరు వాహనదారులు క్యాన్లలో సైతం ఇంధనం నింపుకోవడంతో నిల్వలు మరింత త్వరగా ఖాళీ అయినట్లు తెలిసింది. అయితే ఇది తాత్కాలిక పరిస్థితి మాత్రమేనా? లేక నిరంతరంగా కొనసాగుతుందా? అనే అంశంపై స్పష్టత రాలేదు. దీనిపై సివిల్ సప్లై డిటి విజయ్‌బాబును వివరణ కోరగా, ఆయిల్ నిల్వలకు ఎటువంటి ఇబ్బంది లేదని, త్వరలోనే మరల ఆయిల్ బంకులకు సరఫరా జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు.

**బ్యారెళ్లలో నింపుకెళ్లిన వైనం..**

ఒకవైపు వాహనదారులు తమ వాహనాలకు ఫుల్‌ట్యాంక్ చేయించుకుంటుండగా, మరోవైపు కొందరు అదే స్థాయిలో బ్యారెల్, డబ్బాలు, క్యాన్లలో ఇంధనం నింపుకుని నిల్వ చేసుకున్న పరిస్థితులు కనిపించాయి. ఇలా డబ్బాల్లో ఇంధనం నింపుకోవడం వల్ల బంకుల్లోని ఆయిల్ నిల్వల కొరత ఏర్పడినట్టుగా తెలుస్తోంది. పెట్రోల్ నిల్వలు లేవనే ప్రచారం ప్రభావంతో కృత్రిమ కొరత ఏర్పడినట్టుగా కనిపించింది. ఇప్పటివరకు సజావుగా కొనసాగిన బంకులు ఇదే స్థాయిలో సేవలు కొనసాగిస్తాయా? లేదా? అన్న సందేహం వాహనదారుల్లో నెలకొంది.

# వైద్యశాలలపై పర్యవేక్షణ పెరగాలి

సీజనల్ వ్యాధులపట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి

ప్రభుత్వ ఆసుపత్రులపై సామాన్యులకు నమ్మకం కలిగించాలి

ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వైద్యశాలలపై మరింత పర్యవేక్షణ పెరగాలని, ప్రజారోగ్యం పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారులపై చర్యలకు సిఫారసు చేస్తానని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యశాల మొదలుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు ఎక్కడా మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సామాన్య ప్రజలు నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తారని, వారికి అందుబాటులో ఉన్న వనరులతోనే నాణ్యమైన చికిత్స అందించి ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి సూచించారు. వైద్యశాలల్లో రోగులకు, సహాయకులకు కావాల్సిన సదుపాయాలు సమకూర్చాలని, పారిశుధ్యం, నీటి వసతి వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను బలోపేతం చేయాలని, మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ మందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రులల్లో ఖాళీగా ఉన్న పోస్టులు, అవసరమైన వైద్య పరికరాలు మరియు మందుల నిల్వలపై సమగ్ర నివేదికను వెంటనే తనకు అందజేయాలని అధికారులను కోరారు. వైద్యులు, సిబ్బంది వి ధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా జవాబుదారీతనంతో పనిచేయాలని, అప్పుడే పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని ఆయన ఈ సందర్భ ంగా దిశానిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ బదిలీకి వెలుగుమట్లే కారణమా?

గతంలో ఆర్‌డిఒ, ఎంఆర్‌ఒ బదిలీ

నూతన కలెక్టర్‌గా దివాకర





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మిక బదిలీ అయ్యారు. ఈ బదిలీపై భిన్న స్వరాలు వినవస్తున్నాయి. కలెక్టరే బదిలీ చేయించుకున్నారన్న ప్రచారం ఒక పక్క సాగుతుండగా మరో పక్క కలెక్టర్ బదిలీకి కూడా వెలుగుమట్ల ఘటనే కారణమని ప్రచారం జరుగుతుంది. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన వెలుగుమట్ల ఘటనకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారి బదిలీ కావడం చర్చనీయాంశమైంది. కలెక్టర్ తనంతట తాను బదిలీ కోరుకున్న కూడా వెలుగుమట్ల ఘటనే కారణమని భావిస్తున్నారు. ఫిబ్రవరి 24న వెలుగుమట్ల రెవెన్యూలో నివాసాలు ఏర్పాటు చేసుకుని పదేళ్ల పాటు నివసిస్తున్న వారి ఇండ్లను కూల్చి రోడ్డున పడేశారు. ఈ ఘటన ప్రభుత్వానికి ఒక మాయని మచ్చలా మిగిలింది. మంత్రుల ప్రోద్బలంతోనే వెలుగుమట్ల కూల్చివేతలు జరిగాయని విపక్షాలు ఆరోపిస్తుండగా ముగ్గురు మంత్రుల మధ్య ఉన్న విబేధాలు చిలికి చిలికి గాలివానలా మారి అధికారులను బలిపశువులను చేశారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ ఘటన జరిగిన కొద్ది రోజులకే ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ సైదులు బదిలీ అయ్యారు. కూల్చివేతల పై విమర్శలు ఆగకముందే ఇప్పుడు లబ్దిదారుల ఎంపికపై విమర్శలు వినవస్తున్నాయి. 313 మందిలో వందకు పైగా లబ్ధిదారులు వెలుగుమట్లతో ఎటువంటి సంబం ధం లేని వారని కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఇది జరిగిందని, జాబితాలో చేర్చారని ఆరోపణలు వినవస్తున్నాయి. వెలుగుమట్ల ఎక్కడ ఉందో తెలియని వారు ధనవంతులు కూడా వెలుగుమట్ల లబ్ధిదారుల ఎంపికలో స్థానం సంపాదించారు. ఇది ఎలా అన్న దానిపై తీవ్ర విమర్శలు వినవస్తున్నాయి. కూల్చివేతల తర్వాత కూడా లబ్ధిదారుల ఎంపికపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కలెక్టర్ బదిలీ జరిగింది. కలెక్టర్, ఇతర అధికారులు లక్ష్యంగా వీధినపడ్డ బాధితులు పలు శాపనార్థాలు పెట్టారు. ఆవేదనతో తీవ్ర విమర్శలు చేశారు. ఈ విమర్శలు కూడా కలెక్టర్‌ను బాధించాయన్న ప్రచారం జరిగింది. మొత్తానికి ఏడాది గడవక ముందే కలెక్టర్ బదిలీ కావడం వెనక మరో కారణం కూడా ఉందని ప్రచారం జరుగుతుంది. ముగ్గురు మంత్రుల మధ్య అధికార యంత్రాంగం నలిగిపోతుందని ఈ క్రమంలోనే బదిలీలు చోటు చేసుకుంటున్నాయని ప్రచారం జరుగుతుంది. మొత్తంగా కారణాలు ఏమైనా కలెక్టర్ బదిలీ మాత్రం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా నూతన కలెక్టర్ దివాకర ఆదివారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి పుష్పగుచ్చం అందజేశారు. సోమవారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.

## మే 5న ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మే 5న టిజిజెఎసి ఆధ్వర్యంలో చేపట్టనున్న ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయంతం చేయాలని ఆ సంఘం నాయకులు అనుమోలు కోటేశ్వరరావు, ఎస్.సంగిరెడ్డి, కంచర్ల శ్రీనివాసరావు, బొగ్గుల మదన్‌మోహన్‌ఎడ్డి, భూషన్ రాజు, నంద్రు వెంకటేశ్వరరావు, ఎం.బాబురావు పిలుపునిచ్చారు. ఆదివారం ఎర్రుపాలెంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత కొంతకాలంగా విడివిడిగా ఉన్న సంఘాలు తమ సమస్యల సాధన కోసం ఐక్యమై జెఎసిగా ఏర్పడ్డాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ఉపాధ్యాయ, ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధనకై ఈనెల 17న అన్ని మండల కేంద్రాల్లో కలెక్టర్ కార్యాలయం నందు నిరసన తెలిపి ప్రభుత్వానికి విన్నపాలు ఇచ్చామని, అయినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవటం లేదన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో శివపార్వతి, పుల్లమ్మ, సత్యనారాయణరెడ్డి, రాఘవరావు, అప్పిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగమణి, నాగరాజు, చిన్నప్ప, వెంకటరామయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్రావణి, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## మూడవ అతిపెద్ద నేరంగా బాలికల అక్రమ రవాణా



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద నేరంగా ఆడపిల్లల మానవ అక్రమ రవాణ ఉందని, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్ అన్నారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట కల్వరి మినిస్ట్రీస్ చర్చి నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యుక్త వయసు బాలికలు ఫోన్ మోజులో పడి ప్రేమ, పెళ్లి అంటూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం జీవితంపై ఎలాంటి అవగాహన లేకపోవడమేనన్నారు. ఇలా వేరే ప్రాంతాలకు పారిపోవడం, చివరికి మోసపోయి వ్యవభిచార గృహాలకు అమ్మబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో చివరికి ప్రాణాలు సైతం కోల్పోతున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకుని, అవగాహన కల్పిస్తూ అప్రమత్తతను చాటాలని పిలుపునిచ్చారు. అలాగే అక్రమ రవాణా నిరోధక చట్టంపై వివరించారు. అనంతరం సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాస్టర్‌లు బి. ఎబినేజర్, కె. ప్రకాష్, వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పంటలు బూడిద

రైతు షాక్‌కు గురి, అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

**ప్రజాపక్షం/కారేపల్లి:** గుంపెల్లగూడెం గ్రామంలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఇద్దరు రైతుల మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. గుగులోత్ వీరన్నకు చెందిన 6 ఎకరాలు, కుమ్మరి పాపారావుకు చెందిన ఎకరం పంట బూడిదైంది. పంట కాలిపోవడం చూసిన వీరన్న, షాక్‌తో కుప్పకూలగా, ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అగ్ని మాపక సిబ్బంది చేరుకునే సరికి నష్టం సంభవించింది. గ్రామ పాలన అధికారి స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతులకు తక్షణ నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## వినాయక ఆలయంలో విరిగిన ధ్వజస్తంభం

చిన్నారి సహా పలువురికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలం సారపాక ప్రధాన రహదారి పక్కన ఉన్న వినాయక ఆలయంలో ఆదివారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఆలయ ఉత్సవాల నేపథ్యంలో ధ్వజస్తంభాన్ని పునఃప్రతిష్ట చేస్తున్న సమయంలో అది అకస్మాత్తుగా విరిగి భక్తులపై పడింది. ఈ ఘటనలో ఒక ఏడాది వయస్సు గల చిన్నారితో పాటు పలువురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక వినాయకుని ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించేందుకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. భక్తుల సమక్షంలో క్రేన్ లేదా ఇతర పరికరాల సహాయంతో ధ్వజస్తంభాన్ని ఎత్తుతుండగా, అది ఒక్కసారిగా పట్టుతప్పి విరిగి భక్తులపై పడింది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ భక్తులు ఉండటంతో, అది నేరుగా వారిపై పడింది. అయితే కొందరు భక్తులు అప్రమత్తంగా వ్యవహరించి పక్కకు తప్పుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. లేనిపక్షంలో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ దుర్ఘటనలో మొత్తం ఐదుగురికి పైగా భక్తులు గాయపడినట్లు సమాచారం. కాగా ఏడాది వయస్సు గల చిన్నారికి తలపై తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు మహిళలు, ఒక యువతితో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఇందులో ఒకరికి కాలు విరగగా, మరొక మహిళకు చేతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి వద్ద బాధితుల బంధువుల రోదనలు మిన్నంటాయి. ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన వంటి పవిత్రమైన కార్యక్రమం నిర్వహిస్తున్నప్పుడు కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం జాగ్రత్తలు తీసుకోకుండా, భారీ ధ్వజస్తంభాన్ని అజాగ్రత్తగా ఎత్తడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, ఇది పూర్తిగా ఆలయ కమిటీ నిర్వాహకుల బాధ్యతారాహిత్యమేనని వారు మండిపడుతున్నారు.



ఘటన జరిగిన వెంటనే ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రమాదంతో ఆలయ ప్రాంగణంలో కొంత సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ఉలిక్కిపడ్డ మి(జ)నరల్ మాఫియా..!

అధికారులు తనిఖీలు చేస్తుండటంతో ఆందోళన

అక్రమాలు బయటపడనున్నాయని ప్రజల ఆశలు

'ప్రజాపక్షం' కథనానికి స్పందన

సమస్య అక్షర సత్యమేనంటూ పలువురి కితాబు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీలో అక్రమంగా కొనసాగుతున్న ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లపై 'ప్రజాపక్షం' వరుస కథనాలు ప్రచురిస్తున్న సంగతి విధితమే. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం లెక్కతేల్చే పనిలో పడ్డది. ఇందులో భాగంగా తమ స్థానికి సిబ్బందితో వాటర్ ప్లాంట్ల యజమానులతో ప్రాథమిక వివరాలను ఫోన్లలో సేకరిస్తున్నారు. మీ వద్ద ఉన్న అనుమతులు దగ్గర ఉంచుకోవాల్సిందిగా సూచిస్తున్నారు. దీంతో మినరల్ మాఫియా ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఇప్పటికే నిబంధనలు తుంగలో తొక్కి అడ్డగోలుగా కొనసాగుతున్న ఆర్వో వాటర్ ప్లాంట్లు మరీ బరితెగిస్తున్నాయి. ఏకంగా ట్రాలీల్లో వాటర్ క్యాన్లను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం వాటర్‌ను తరలించే అవకాశం లేకపోయినప్పటికీ అనధికారికంగా కొనసాగిస్తుండటం ఆందోళన కలిగిస్తుంది. ఇవి ఎక్కువ భాగం ఫంక్షన్లు, ప్రభుత్వకార్యాలయాలకు, నివాసాలకు తరలిస్తుండటం విశేషం. ఇందులో ప్రభుత్వ కార్యాలయాలకు తరలిస్తున్నామని ధీమాను కొందరు వాటర్ ప్లాంట్ల యజమానులు వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

**అక్షర సత్యమేనంటూ పలువురి ప్రశంస...**

ఈ వ్యవహారంపై స్థానికంగా పలువురు స్పందిస్తూ మినరల్ వాటర్ ప్లాంట్ల సమస్య అక్షర సత్యమేనని 'ప్రజాపక్షం' కథనంపై కితాబిస్తున్నారు. ప్లాంట్ల వద్ద కనీస పరిశుభ్రత పాటించడం లేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొంటున్నారు. కేవలం డబ్బులు దోచుకోవడమే పరమావధిగా వారి వ్యవహార శైలి ఉంది తప్ప ప్రజా శ్రేయస్సును పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైన అధికారుల చర్యలతో వాస్తవ పరిస్థితులు బయటపడతాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## వాసవి మాత జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శ్రీవాసవి మాత జయంతి వేడుకలు శ్రద్ధా భక్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో భక్తులు, మహిళలు, కమిటీ సభ్యులు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వాసవి మాత జయంతి వేడుకల్లో భాగంగా దేవాలయ అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు వాసవి మాత పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధిర శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయం నుండి మేళతాళాల నడుము పెండికుల, మిధునకుల, పునగశిలతో పాటు అన్ని గోత్రికుల వారు పసుపు, కుంకుమ, గంధం, కొబ్బరి చొప్పలు, జాకెట్ ముక్కలు, గాజులు, పూలు, బియ్యం, బెల్లం వంటి సామాగ్రితో కన్యలు, సుహాసినిలు ఊరేగింపుగా అమ్మవారి దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమం పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘసభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రాజస్థాన్‌పై మళ్లీ గెలిచిన సన్‌రైజర్స్



పంతొమ్మిదో సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరు చూపిస్తోంది. ఉప్పల్‌లో హ్యాట్రిక్ విజయాలకు కొనసాగింపుగా జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. వైభవ్ సూర్యవంశీ(103) రికార్డు సెంచరీతో సవాల్ విసిరిన ఆతిథ్య జట్టుపై ఇషాన్ కిషన్(74), అభిషేక్ శర్మ(57) పిడుగల్లే విరుచుకుపడ్డారు. అర్ధ శతకాలతో గెలుపు పునాది వేసిన ఈ ఇద్దరూ వెంటవెంటనే ఔటైనా హెన్రిచ్ క్లాసెన్(29), నితీశ్ రెడ్డి(36)లు దూకుడుగా ఆడి సన్‌రైజర్స్‌కు నాలుగో విజయం కట్టబెట్టారు.

డబుల్ హెడర్ రెండో మ్యాచ్‌లోనూ ఛేజింగ్ జట్టే గెలుపొందింది. ఏప్రిల్ 13న ఉప్పల్ స్టేడియంలో రాజస్థాన్‌ను చిత్తుగా ఓడించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి జైపూర్‌లోనూ జయభేరి మోగించింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(103) రికార్డు శతకంతో హైదరాబాద్ ముందు భారీ లక్ష్యాన్ని నిలిపింది రాజస్థాన్. అయితే.. ఓపెనర్ ట్రావిస్ హెడ్(6) మళ్లీ విఫలమయ్యాడు. జోఫ్రా ఆర్చర్ ఓవర్లో తొలి బంతికి తప్పించుకున్నా.. ఐదో బంతికి వికెట్ కీపర్ జురెల్ చేతికి చిక్కాడు. అనంతరం ఇషాన్ కిషన్(74), అభిషేక్ శర్మ(57)లు దూకుడుగా డారు. 55 బంతుల్లో 132 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని ఫెరీరా విడదీశాడు. బౌండరీ లైన్ వద్ద ఆర్చర్ క్యాచ్‌తో అభిషేక్ వెనుదిరిగాడు. అప్పటికీ సన్‌రైజర్స్ విజయానికి 60 బంతుల్లో 90 రన్స్ కావాలి. ధనాధన్ ఆడుతున్న ఇషాన్ ఔటయ్యాక హెన్రిచ్ క్లాసెన్(29), నితీశ్ రెడ్డి(36)లు గెలుపు బాధ్యత తీసుకున్నారు. వీరిద్దరూ బౌండరీలతో చెలరేగి జట్టును గెలుపు దిశగా నడిపారు. అయితే.. విజయానికి 9 పరుగుల అవసరమైన వేళ బ్రిజేష్ ఓవర్‌లో నితీశ్ ఎల్బీగా, బిష్ణోయ్ క్యాచ్ పట్టగా క్లాసెన్ వెనుదిరిగారు. ఆ తర్వాత సలీల్ అరోరా(7 నాటౌట్), అనికేత్ వర్మ(1 నాటౌట్)లు లాంఛనం పూర్తి చేశారు. ఐదు వికెట్ల తేడాతో గెలుపొందిన హైదరాబాద్ నాలుగో విజయంతో టాప్4లో స్థానాన్ని పదిలం చేసుకుంది.

### వైభవ్ రికార్డు సెంచరీ

ఐపిఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ(103) సొంత గడ్డపై శతకంతో విరుచుకుపడ్డాడు. తోపు బౌలర్లను ఉతికేస్తున్న ఈ చిచ్చరపిడుగు ఈసారి సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లకు దడ పుట్టిస్తూ 36 బంతుల్లోనే వంద కొట్టేశాడు. తొలి ఓవర్ నుంచే అటాకింగ్ గేమ్‌తో రాజస్థాన్ రాయల్స్ స్కోర్ బోర్డును ఉరికించిన వైభవ్.. ధ్రువ్ జురెల్(51)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. డెత్ ఓవర్లలో డొనొవాన్ ఫెరీరా(33) మెరిసినా వరసగా వికెట్లు తీసిన సన్‌రైజర్స్ బౌలర్లు రాజస్థాన్‌ను పరిమితం చేశారు.

# చెన్నైపై గుజరాత్ ఘనవిజయం



పంతొమ్మిదో సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ హ్యాట్రిక్ ఓటమి తప్పించుకుంది. చెపాక్ స్టేడియంలో రబడ (3–25) విజృంభణతో చెన్నై సూపర్ కింగ్స్ భారీ స్కోర్ కొట్టనివ్వని గుజరాత్.. మోస్తరు లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఓపెనర్లు సాయి సుదర్శన్(87), శుభ్‌మన్ గిల్(33) శుభారంభంతో విజయానికి బాటలు వేయగా.. జోస్ బట్లర్(39 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. దాంతో 8 వికెట్ల తేడాతో గెలిచిన గుజరాత్ ఈ ఎడిషన్‌లో నాలుగో విజయం నమోదు చేసింది. మాజీ ఛాంపియన్ గుజరాత్ టైటాన్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. ముంబై, ఆర్సీబీ చేతుల్లో చిత్తైన గుజరాత్ చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌ను దారుణంగా ఓడించింది. తొలుత సిఎస్‌కెను 158కే కట్టడి చేసిన గుజరాత్.. మోస్తరు ఛేదనను గుజరాత్ ఓపెనర్లు సాయి సుదర్శన్(87), శుభ్‌మన్ గిల్(33)లు దూకుడుగా ఆరంభించారు. వీరిద్దరి జోరుతో గుజరాత్ పవర్ ప్లేలో 55 రన్స్ కొట్టింది. కానీ నూర్ అహ్మద్ ఓవర్లో గిల్‌ను వికెట్ కీపర్ శాంసన్ స్టంపౌట్ చేయగా తొలి వికెట్ పడింది. అనంతరం జోస్ బట్లర్(39 నాటౌట్), సుదర్శన్ జోరు కొనసాగించారు. లోకల్ బాయ్ సుదర్శన్ తన స్టయిల్ ఆటతో అర్ధ శతకం బాదేసి గుజరాత్ గెలుపు ఖాయం చేశాడు. బట్లర్ అండగా తమిళ తంబీ చెలరేగడంతో చెన్నై బౌలర్లు వికెట్ తీయలేక అపసోపాలు పడ్డారు. నూర్ ఓవర్లో స్ట్రెయిట్ సిక్సర్ బాదిన సుదర్శన్ .. గుర్జప్నీత్ వేసిన 16వ ఓవర్లో రెండు సిక్సర్లు బాదాడు. విజయానికి ఐదు పరుగుల దూరంలో అకీల్ హొసేన్ ఓవర్లో సుదర్శన్ ఔటైనా.. సిక్సర్‌తో లాంఛనం ముగించిన బట్లర్ 8 వికెట్ల విజయాన్ని చెపాక్ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌కు కట్టబెట్టాడు.

### చెన్నైని ఆదుకున్న గైక్వాడ్

పంతొమ్మిదో సీజన్‌లో విఫలమవుతున్న రుతురాజ్ గైక్వాడ్(74 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఆదుకున్నాడు. చిదంబరం స్టేడియంలో గుజరాత్ టైటాన్స్ పేసర్ రబడ(3–25) ధాటికి పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయిన చెన్నైని గైక్వాడ్ గట్టెక్కించాడు. రబడ, సిరాజ్ ధాటికి 37 కే నాలుగు వికెట్లు పడినా.. శివం దూబే(22), కార్తిక్ శర్మ(15), జేమీ ఓవర్టన్(18)లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఆఖరి ఓవర్లో సిక్స్, రెండు ఫోర్లతో సీఎస్కేకు పోరాడగలిగే స్కోరందించాడు గైక్వాడ్.

# ఆరోగ్యం

## కండరాల అభివృద్ధికి కార్బోహైడ్రేట్లు..



కండరాల అభివృద్ధికి ప్రోటీన్ మాత్రమే కాదు, కార్బోహైడ్రేట్లు కూడా సమానంగా అవసరం. కండరాల పెరుగుదల అనేది వ్యాయామ ప్రేరణ, ప్రోటీన్ అందుబాటు, తగిన శక్తి సరఫరా అనేమూడు ప్రధాన అంశాలపై ఆధారపడుతుంది. చాలా మంది ప్రోటీన్‌ను ప్రధాన నిర్మాణ పదార్థంగా భావించి కార్బోహైడ్రేట్లను తగ్గిస్తారు. అయితే శరీరానికి శక్తి అందించేది ప్రధానంగా కార్బోహైడ్రేట్లే. ఇవి గ్లూకోజ్‌గామారి కండరాల్లో గ్లైకోజెన్ రూపంలో నిల్వ అవుతాయి. వ్యాయామ సమయంలో ఈ గ్లైకోజెన్ ప్రధాన ఇంధనంగా పనిచేస్తుంది. కార్బోహైడ్రేట్లు తక్కువగా తీసుకుంటే గ్లైకోజెన్ నిల్వలు తగ్గిపోతాయి. ఫలితంగా వ్యాయామ సామర్థ్యం తగ్గుతుంది. అంటే బరువులు ఎక్కువగా ఎత్తలేరు. సెట్లు పూర్తిగా చేయలేరు, శిక్షణ తీవ్రత పడిపోతుంది. శిక్షణ తీవ్రత తగ్గితే కండరాల పెరుగుదల సంకేతాలు కూడా తగ్గుతాయి. అంతే కాదు, శరీరానికి శక్తి సరిపోకపోతే అది ప్రోటీన్‌ను కండర నిర్మాణం కోసం కాకుండా శక్తి ఉత్పత్తికి ఉపయోగించడం ప్రారంభిస్తుంది. ఇది కండరాల పెరుగుదలను మందగింపజేస్తుంది. హార్మోన్ స్థాయిల పరంగా కూడా కార్బోహైడ్రేట్లు కీలక పాత్ర పోషిస్తాయి. కార్బోహైడ్రేట్లు తీసుకున్నప్పుడు విడుదలయ్యే ఇన్సులిన్ కేవలం రక్త చక్కెర నియంత్రణకే కాదు... ఒక అనబాలిక్ హార్మోన్‌గా పనిచేసి అమినో ఆమ్లాలను కండర కణాల్లోకి చేరేలా చేస్తుంది. మరోవైపు, కార్బోహైడ్రేట్లు చాలా తక్కువగా ఉన్నప్పుడు కార్టిసోల్ అనే ఒత్తిడి హార్మోన్ పెరుగుతుంది. ఇది కండరాల విచ్ఛిన్నాన్ని పెంచే అవకాశం ఉంది.అందుకే ఆధునిక క్రీడా పోషకాహార పరిశోధనలు సమతుల ఆహారాన్ని ప్రాధాన్యంగా సూచిస్తున్నాయి. లీన్ ప్రోటీన్ కండర నిర్మాణానికి అవసరం అయితే, సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు వ్యాయామ శక్తి, పునరుద్ధరణకు మద్దతు ఇస్తాయి. వ్యాయామానికి ముందు కార్బోహైడ్రేట్లు శక్తిని అందిస్తాయి. వ్యాయామం తరువాత తీసుకుంటే గ్లైకోజెన్ పునరుద్ధరణ వేగవంతమవుతుంది. స్థూలంగా చెప్పాలంటే, కండరాల అభివృద్ధి అధిక ప్రోటీన్ వల్ల మాత్రమే జరగదు. శరీరానికి నిర్మాణ పదార్థం (ప్రోటీన్)తో పాటు నిర్మాణానికి అవసరమైన శక్తి (కార్బోహైడ్రేట్లు) కూడా సమానంగా అవసరం. నిజమైన బలం కఠిన పరిమితుల్లో కాకుండా, శాస్త్రీయ సమతుల పోషణలో ఉంటుంది.

## కేన్సర్ చికిత్సలో ముందడుగు..



అత్యంత ప్రమాదకరమైన కేన్సర్ చికిత్సలో సరికొత్త ప్రయోగాలు ముందడుగు వేస్తున్నాయి. మెసెంజర్ ఆర్ఎన్ఎ (ఎంఆర్ఎన్ఎ) సాంకేతికత ఆధారంగా రూపొందుతున్న చికిత్సా విధానం విజయవంతమైతే, కేన్సర్ నియంత్రణ అసాధ్యం కాదనే అనుకోవాలి. నిజానికి ప్రపంచాన్ని అల్లాడించిన కొవిడ్ 19 వల్ల జరిగిన జరిగిన మేలుగా ఎంఆర్ఎన్ఎను పేర్కోవాలి. కొవిడ్ వ్యాక్సిన్‌ల ద్వారా ప్రపంచానికి పరిచయమైన ఈ సాంకేతికతను ఇప్పుడు కేన్సర్ చికిత్సలో వినియోగించేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. సాధారణ వ్యాక్సిన్‌లు వైరస్‌లను ఎదుర్కొనేందుకు శరీరాన్ని సిద్ధం చేస్తాయి. కానీ ఈ కేన్సర్ ఎంఆర్ఎన్ఎ వ్యాక్సిన్ విధానం కొంచెం భిన్నంగా పనిచేస్తుంది. ఇందులో ఎంఆర్ఎన్ఎ అణువులు శరీర కణాలకు ప్రత్యేక సూచనలు ఇస్తాయి. ఆ సూచనల ఆధారంగా శరీరం కేన్సర్ కణాల్లో మాత్రమే కనిపించే ప్రోటీన్లను గుర్తించేలా రోగనిరోధక వ్యవస్థను శిక్షణ ఇస్తుంది. ఫలితంగా, రోగనిరోధక కణాలు ఆరోగ్యకర కణాలను దెబ్బతీయకుండా కేన్సర్ కణాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని నాశనం చేస్తాయి. పారంపరిక చికిత్సలైన కీమోథెరపీ లేదా రేడియేషన్‌లో ఆరోగ్యకర కణాలు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కానీ ఎంఆర్ఎన్ఎలో వ్యాక్సిన్ లక్ష్యిత విధానాన్ని అనుసరించడం వల్ల దుష్ప్రభావాలు తక్కువగా ఉంటాయని అంటున్నారు. పరిశోధనల ప్రారంభ దశ లో ఊపిరితిత్తుల, స్తన, చర్మం (మెలనోమా), ప్యాంక్రియాస్ వంటి కేన్సర్‌లలో ట్యూమర్ పరిమాణం తగ్గినట్లు ప్రీక్లినికల్, ప్రారంభ మానవ పరీక్షల్లో గుర్తించారు. ఈ వ్యాక్సిన్‌లో అత్యంత ముఖ్యమైన అంశంగా పర్సనలైజేషన్ మెడిసిన్‌ను పేర్కొంటారు. అంటే, ప్రతి రోగి కేన్సర్‌లో ఉన్న జన్యు మార్పులను విశ్లేషించి, ఆవ్యక్తికి ప్రత్యేకంగా వ్యాక్సిన్ రూపొందించే విధానం. దీనివల్ల ఒకే ఔషధం అందరికీ కాకుండా, వ్యక్తి శరీర లక్షణాలకు అనుగుణంగా చికిత్స రూపొందుతుంది. అయితే ఇది ఇంకా ప్రారంభ దశలో ఉన్న పరిశోధన మాత్రమే. ప్రస్తుతం జరుగుతున్న క్లినికల్ ట్రయల్స్ దీని భద్రత, దీర్ఘకాల ప్రభావం, నిజమైన విజయశాతం వంటి అంశాలను నిర్ధారించాలి. కాబట్టి ఇది ఇప్పటికిప్పుడు కేన్సర్‌కు పూర్తి పరిష్కారం కాదు. మొత్తంగా చూస్తే, ఎంఆర్ఎన్ఎ ఆధారిత కేన్సర్ వ్యాక్సిన్ భవిష్యత్తులో కేన్సర్ చికిత్సను పూర్తిగా మార్చే సామర్థ్యం కలిగిన కొత్త వైద్య దిశగా భావిస్తున్నారు. ఇది విజయవంతమైతే, కేన్సర్‌ను ప్రాణాంతక వ్యాధి నుంచి నియంత్రించగల దీర్ఘకాలిక పరిస్థితిగా మార్చే అవకాశముంది

## అతిగా ఆలోచించడం వల్ల నష్టమే!



చాలామంది ఏదైనా పని చేయడానికి చాలా సేపు ఆలోచిస్తునే ఉంటారు. అతిగా ఆలోచించడం వారి నైజం. తద్వారా పనుల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టుకోవచ్చన్నది వారి నమ్మకం. కానీ, శాస్త్రవేత్తలు మాత్రం ఇందుకు పూర్తి భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చాలా సులభంగా చేయగల పని కూడా కొన్నిసార్లు అతి ఆలోచన వల్ల సక్రమంగా చేయలేకపోవడం చాలా మందికి అనుభవమే. మెదడు ఎక్కువ శాతం పనులను అర్థం చేసుకొని, నిక్షిప్తం చేసుకుంటుంది. కాబట్టి డ్రైవింగ్ చేయడం, ఏదైనా వాయిద్యాన్ని వాయించడం లేదా క్రీడల్లో పాల్గొనడం వంటివి సాధన ద్వారా మెదడులో ఏర్పడిన స్వయంచాలక నాడీ మార్గాల ద్వారా జరుగుతాయి. ఒక నైపుణ్యం పూర్తిగా అలవాటుగా మారిన తర్వాత, మెదడు దాన్ని ఎక్కువగా ఆలోచించకుండా సహజంగా నిర్వహిస్తుంది. కానీ ఒత్తిడి, భయం లేదా అధిక స్వీయ పరిశీలన పెరిగినప్పుడు సమస్య మొదలవుతుంది. అప్పుడు తీసుకునే నిర్ణయాల వల్ల స్వీయ నియంత్రణకు సంబంధించిన మెదడు భాగాలు అధికంగా ఒత్తిడికి గురవుతాయి. ఇవి సహజంగా ప్రవహిస్తున్న చర్యలను మధ్యలో అడ్డుకుంటాయి. ఫలితంగా సంకోచం, టెన్షన్, చిన్న తప్పిదాలు కనిపిస్తాయి. ఈ పరిస్థితినే శాస్త్రవేత్తలు 'పెరాలిసిస్ బై అనాలిసిస్' అని పేర్కొంటారు. అంటే ఎక్కువగా విశ్లేషించడం వల్ల పనితీరు తగ్గిపోతుంది. ఈ కారణంగానే, అనుభవజ్ఞులైన అథ్లెట్లు లేదా సంగీతకారులు కూడా ఒక్కోసారి ఒత్తిడికి గురైనప్పుడు తడబడటం సాధారణం. నిజానికి వారు నైపుణ్యం కోల్పోలేదు. కానీ సహజ ప్రవాహాన్ని చైతన్య ఆలోచన అడ్డుకుంటోంది.

## సమసమాజ స్థాపనే లక్ష్యం

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా




**ప్రజాపక్షం/పినపాక :** సమసమాజ స్థాపనే సిపిఐ లక్ష్యమని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వెంకట్రావుపేట గ్రామంలో సిపిఐ పినపాక మండల మహాసభ ఘనంగా నిర్వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు తోగటి వీరభద్రం జెండా ఆవిష్కరించారు. మండల కార్యదర్శి పద్మనాభ రాజు అధ్యక్షత వహించారు. సభలో సాబీర్‌పాషా మాట్లాడుతూ పేదవాడు ఉన్నంతవరకు సిపిఐ పోరాటం కొనసాగిస్తుందని, ఎర్రజెండా ఎప్పుడూ నిలబడుతుందన్నారు. పట్టాలు ఇవ్వని భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, రైతులకు గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చూడాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఐ మండల కార్యదర్శిగా తోగటి కుమార్, సహాయ కార్యదర్శులుగా కారం రమేష్, కప్ప వెంకటేశ్వర్లులను ఎన్నుకున్నారు. పినపాక నియోజకవర్గం పోరాటాలకు ఉద్యమాలకు పుట్టినిల్లు అని, భూస్వాములకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపిన చరిత్ర ఈ ప్రాంతానిదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డిలు అన్నారు. కార్యక్రమంలో నాయకులు పూర్ణచంద్రరావు, పత్తిపాటి నాగేశ్వర్లు, గడ్డం మనోహర చారి, జక్కుల రాజబాబు, దుర్గ్యాల సుధాకర్, తోట రమేష్, కామిశెట్టి రామారావు, బాడిస సతీష్, పసుపులేటి విజయలక్ష్మి , వెంకన్న, తోగటి కుమార్, కారం రమేష్, కప్ప వెంకటేశ్వర్లు, రమణ, పొనగంటి పురుషోత్తం, వర్షా నరసింహారావు, సతీష్, పొనగంటి రాంబాబు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు రక్షణ పరికరాలివ్వాలి

### ఎఐటియుసి డిమాండ్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి ఏరియాలో ఇటీవలే నూతనంగా ఉద్యోగంలో చేరిన సుమారు 500 మంది కార్మికులకు బూట్లు, టోపీ లాంటి రక్షణ కిట్లను యాజమాన్యం వెంటనే అందజేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నూతనంగా ఉద్యోగంలో చేరిన సింగరేణి కార్మికులు రక్షణ కిట్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి నూతన కార్మికులకు రక్షణ కిట్లను అందజేసి ఉత్పత్తిని పెంచే విధంగా కార్మికులకు సహకరించాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గురిజేపల్లి సుధాకర్‌రెడ్డి, స్థానిక ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు చిరస్మరణీయం

### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/చండురూ/గట్టుప్పల్ :** ప్రజల హక్కులు, సమసమాజ స్థాపన కోసం కమ్యూనిస్టు అమరులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపిటిసి పెద్దగోని యాదయ్య స్మారక స్థూపావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశపడి కొందరు రాజకీయాల్లోకి వస్తారని, కానీ కమ్యూనిస్టులు మాత్రం ఆశయాల కోసం జీవితాంతం పోరాడుతారన్నారు. కార్మికులు, రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం కమ్యూనిస్టులు చేసిన త్యాగాలు సమాజానికి మార్గదర్శకమన్నారు. దేశ రాజకీయాల్లో కార్పొరేట్ శక్తులు ప్రవేశించి రాజకీయాలను వ్యాపారంగా మారుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సేవే పరమావధిగా భావించే కమ్యూనిస్టులు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతారన్నారు. పెద్దగోని యాదయ్య తన జీవితకాలం కుటుంబం కన్నా పార్టీని ప్రాణంగా పెట్టి పనిచేశాడని కొనియాడారు. గట్టుప్పల్ ప్రాంతంలో కమ్యూనిస్టు భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అనేక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించాడని పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కమ్యూనిస్టు అమరుల ఆశయ సాధన కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మూడు దశాబ్దాలుగా తెలంగాణ ప్రాజెక్టుల సాధన కోసం సిపిఐ పోరాటాలు కొనసాగిస్తోందని, డిండి–పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల పూర్తి కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.లాలు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చల్లం పాండురంగారావు, రైతు సంఘం జిల్లా కోశాధికారి కంపే దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోరాడి సాధించుకున్న హక్కుల రక్షణకు పోరాటాలు

### ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ.రెహమాన్

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** పోరాడి సాధించుకున్న హక్కుల రక్షణకు పోరాటాలు చేయాలని కార్మిక లోకానికి ఎఐటియుసి సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ.రెహమాన్ పిలుపునిచ్చారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలో ఎఐటియుసి మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెమమాన్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వెంకటరాజ్యం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాల నుంచి గుండెకాయ లాంటి 29 చట్టాలను రద్దు చేసి కొత్తగా 4 లేబర్ కోడ్లను తెచ్చిందన్నారు. కార్మికుల పనిగంటలకు పెంచి, సమ్మెహక్కును తొలగించి, నిరసనలు తెలియజేసే హక్కును హరిస్తుందన్నారు. ఈ కోడ్‌లతో కార్మికుల ఉద్యమాలను పోరాటాలను నిర్దాక్షణ్యంగా అణచివేయుటకు ధ్యేయంగా పెట్టుకుందన్నారు. ఆదానీ, అంబానీ లాంటి బడా పెట్టుబడిదారులకు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అప్పజెప్పే విషపూరితమైన కుట్ర మోదీ ప్రభుత్వం చేస్తుందన్నారు. వీటికి వ్యతిరేకంగా కార్మిక వర్గం మేడే స్ఫూర్తితో పెద్ద ఎత్తున ఉద్యమించాలని తద్వారా కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి కార్మిక వర్గానికి న్యాయం జరిగే విధంగా సమైక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ పుల్కల్ మండల్ కార్యదర్శి విజయకుమార్, చౌటుకూరు, మండల కార్యదర్శి, దుర్గారావు, రాములు, రాజు. నారాయణ, భూమయ్య, సజీద్ పద్మారావు, మల్లేశం, జనార్ధన్, పెంటయ్య, కృష్ణ, శ్రీకాంత్ చంద్రయ్య, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



## స్కాలర్‌షిప్స్, రీయింబర్స్‌మెంట్ కోసం 'సిఎం' ఇంటికి పాదయాత్ర

### ఎఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రణీత్‌గౌడ్




**ప్రజాపక్షం/కెయు క్యాంపస్ :** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం కాకతీయ యూనివర్సిటీ గేట్ వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి ప్రణీత్ గౌడ్, జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులకు రావాల్సిన ఆర్థిక సహాయం సంవత్సరాల పాటు పెండింగ్‌లో ఉండటం వల్ల వారు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజు బకాయిల కారణంగా అనేక కాలేజీలు విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నాయని, దీంతో పై చదువులు, ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల విద్యార్థులు చదువుకు దూరమవుతూ డ్రాప్‌అవుట్స్ పెరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన విద్యార్థులు మార్పు కోసం ప్రస్తుత ప్రభుత్వాన్ని గద్దెనెక్కించారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగించడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 28న నారాయణగూడలోని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి నివాసం వరకు భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల నుండి విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, కేయూ అధ్యక్షులు కొమ్ము సాయి సాయి, కార్యదర్శి నితిన్, నాయకులు రమ్య, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్

**ప్రజాపక్షం/చర్లపల్లి :** కార్మికుల హక్కులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు విఎస్.బోస్ డిమాండ్ చేశారు. రాబోయే మేడేను పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో మేడే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విఎస్.బోస్ మాట్లాడుతూ కార్మికుల ఐక్యతే వారి బలమని, హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలన్నారు. కార్మికుల హక్కుల కోసం సాధన కోసం జరిగిన పోరాటాలకు ప్రతీకగా నిలిచే మేడేను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సూరిబాబు, గడ్డం కృష్ణ, ఎఐటియుసి నాయకులు పోచయ్యగౌడ్, అశోక్, టి.యాదగిరి, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.



## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

### సిపిఐ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎండలు మండుతున్న సమయంలో సిపిఐ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి చల్లని తాగునీరు అందించడం అభినందనీయమని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. గడిచిన వారం రోజులుగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగాయని ప్రజలు అల్లాడుతున్నారన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు వరదా నర్సింహారావు ఆధ్వర్యంలో ఖమ్మం వన్‌టౌన్ పరిధిలోని అల్లిపురం క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి కొరత తీర్చేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వమే చలివేంద్రాలను ఏర్పాటు చేసి నిరంతరాయంగా తాగునీటిని అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని హేమంతరావు సూచించారు. సేవాభావంతో సిపిఐ వన్‌టౌన్ నాయకులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం స్ఫూర్తిదాయకమన్నారు. రానున్న కాలంలో మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజాసేవలో ముందు వరుసలో నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సిపిఐ నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, సిపిఐ నాయకులు మాడుగుల నాగేశ్వరరావు, యాకూబ్, చందు, సిద్ది శ్రీను, వెంకీ, ఉమా, ముత్తయ్య, తాళ్లూరి శ్రీను, సుశీల, నాగమణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



## ఈతకు వెళ్లి బాలుడు మృతి



ప్రజాపక్షం/గొల్లపల్లి : ఓ బాలుడు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందాడు.ఈ ఘటన జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లోని లోత్తునూరు గ్రామంలో చోటు చేసుకుంది.పోలీసుల సమాచారం మేరకు గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకకు బుగ్గారం మండలం బీర్సాని గ్రామానికి చెందిన కాంపెల్లి రితేష్ (13) అనే బాలుడు హాజర య్యాడు.వివాహనంతరం మధ్యాహ్నం సమయంలో స్నేహితులతో కలిసి గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలోకి ఈతకని దిగాడు.ఈత రాకపో వడంతో రితేష్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు .బాలుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.ఈ విష యమై బాలుడి తల్లి కాంపల్లి మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలి పారు.ప్రజలు ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా అనుభవం లేని వారు బావులు,చెరువులు వంటి నీటి వనరుల్లో ఈత కొట్టకుండా ఉండాలని పోలీసులు సూచించారు.

## జనగణన-2027లో స్వీయ గణన పూర్తి చేసిన ఎస్‌పి మహేష్




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల: ప్రజలు అందరూ జనగణనలో భాగంగా తమ కుటుంబ సభ్యుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సూచించారు. జనగణన2027లో భాగంగా ఆది వారం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో స్వీయ గణన ప్రక్రియలో పాల్గొని కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జనగణన ప్రక్రియలో ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమని, సరైన సమాచారం అందించడం ద్వారా సమగ్ర గణాంకాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జనగణన విజయవంతంగా నిర్వ హించేందుకు ప్రజలు చురుకుగా పాల్గొని బాధ్యతగా వివరాలు నమోదు చేసుకొవాలని కోరారు.

**శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలు...**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ వేడుక లకు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హాజరై శ్రీ వాసవి మాత చిత్ర పటానికి పుష్పమాల వేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. యాదగిరి, ఎస్.ఐ కిరణ్ కుమార్, ఆర్.ఎస్.ఐ. సాయి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలే స్వయంగా వివరాలు నమోదు చేయొచ్చు



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల: ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియో గించి ప్రజలే స్వయంగా వివరాలు నమోదు చేయోచ్చునని సిరిసిల్లా మున్సిపల్ చైర్మెన్ జిందంకళా చక్రపాణి అన్నారు.ఆదివారం స్వీయ జనగ ణనలో భాగంగా తమ కుటుంభ సభ్యుల వివరాలను నమోదు చేసుకోవా లని తెలిపారు.ఈనెల 26వ తేది నుండి మేప 10 వరకు వెబ్సైట్‌లో https/se.census.gov.in ప్రజలు స్వయంగా వారి వివరాలను నమోదు చేసుకోవచ్చునని అన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఉండగా డిజిటల్ విధానం సెల్ఫ్ ఇమ్యూనరేషన్ ఇట్టి డిజిటల్ విధానం ప్రక్రియ సరియైన వివరాలు వెబ్‌సైట్ లో పొందుపరచాలని కోరారు.కౌన్సిలర్ సభ్యులు,వెల్లుట్ల నరేష్,మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల గురించి ఆలోచించేది కాంగ్రెస్ ప్రభుత్వమే



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల: పేదల గురించి ఆలోచించే ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం అని ఇందిరమ్మ కమిటీ సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరి ధిలోని 12వ వార్డులో పేద కుటుంబానికి చెందిన కత్తెర పాక లత దాసు కు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు భూమి పూజలో పాల్గొని ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మించాలనే ఉద్దేశంతో ఇల్లు లేని ప్రతి పేదవాడికి 5 లక్షల రూపా యలు మంజూరు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు కట్టుకొని ఆనందంగా గడపాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకం ఇందిరమ్మ పథకం అన్నారు. ప్రతి పేదవాడి కళ్ళల్లో ఆనందం నింపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకం ప్రారంభించారన్నారు. ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇల్లు మంజూరు చేయడమే ప్రభుత్వం ధ్యేయం అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేశాక ఉచితంగా మహిళలకు బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు బిల్లు, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు నూనె శ్రీనివాసులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుడిశెట్టి బాలరాజు, కత్తెరపాక ఎల్లయ్య, నర్మెట సురేష్, నర్మెట పెద్ద శంకర్, స్వామి పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన



ప్రజాపక్షం/బెజ్జంకి: మండల పరిధిలోని దాచారం గ్రామంలో సిద్దిపేట వారి శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ బైర మానస రాజేందర్ సహకారంతో ఆదివారం రైతు వేదికలో ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులకు దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో బాల్ నర్సు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ప్రజాపక్షం/గంగాధర: ప్రభుత్వం ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రా ల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. గంగాధర మండలంలోని హిమ్మత్ నగర్, రంగారావుపల్లి, ఉప్పరమ ల్యాల, కురిక్యాల, మధురానగర్, గంగా ధర బూరుగుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివార్యం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, కేంద్రా లకు తీసుకువచ్చిన వరి ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళనకు గురికావద్దని పేర్కొన్నారు. రైతులు ఇబ్బంది పడ కుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి మిల్లు లకు తరలించాలని, రైతుల వివరాలు ఆన్‌లై న్‌లో నమోదు చేసి వారి బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ అయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. కేంద్రాల వద్ద ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావా లన్నారు. తహసీల్దార్ అంబటి రంజిత, ఎంపి డివో దమ్మని రాము, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ వెలిచాల తిరుమల రావు, సర్పం చుల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, సర్పంచులు బీర్ల ఆనందం, దాసరి శంక రయ్య, రేండ్ల శ్రీనివాస్, కడారి రేణుక కను కయ్య, వేముల భాస్కర్, పడాల భాగ్యలక్ష్మి రాజన్న, సాగి అజయ్ రావు, మేర్జ కొండయ్య, కర్ర బాపురెడ్డి తదితరులున్నారు.

## ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చు



ప్రజాపక్షం/సిద్దిపేట: 2027 జనాభ లెక్కల సేకరణలో భాగంగా ఈ నెల 26 నుండి మే 10 వరకు ప్రతి ఒక్కరు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు.ఆదివారం ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సాఫ్ట్ వేర్‌ను రూపొందించిందని దీని ద్వారా ఎవరైనా మొబైల్ ఫోన్,కంప్యూటర్,ఇంటర్నెట్ ఆవకాశం ఉన్న దేని ద్వారైనా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చని విరాల నమోదుకు 9 స్టెప్స్ ఉంటాయని http://se.senses.gov.in పోర్టల్‌లో లాగిన్ అయి కుటుంబ వివరాలను అలాగే సాఫ్ట్ వేర్ అడిగే 33 ప్రశ్నలకు సమాధానం నమోదు చేయాలని తర్వాత సాఫ్ట్ వేర్ ఇచ్చే యస్‌ఇ ఐడి స్క్రీన్ షాట్ తీసి పెట్టుకుంటే జనాభ లెక్కల కోసం ఇంటికి వచ్చే జనాభా ల్కెల అధికారులకు యస్‌ఇ ఐడి ని చూపిస్తే జనాభా ల్కెల నమోదు ప్రక్రియలో వివరానలు ఆమోదిస్తారని ఈ అవకాశాన్ని జిల్లాని ప్రజలు సద్వియోగం చేసుకోవాలని సూచించారు.

## కలెక్టరేట్‌లో వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలు



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వ హించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై శ్రీ వాసవి మాత చిత్ర పటానికి పుష్పమాల వేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఏ రాందాస్, సీపీఓ శ్రీనివాసాచారి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి స్వప్న పాల్గొన్నారు.

## దళిత కుటుంబానికి రూ,లక్ష సిఎంఆర్ఎఫ్

ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట: మద్దూరు మండలంలోని లద్నూరు గ్రామానికి చెందిన దళిత కుటుంబానికి చెందిన పాకాల వినీత్ రోడ్డు ప్రమాదంలో గాయపడగాఅనారోగ్య సమస్యలతో వైద్యానికి పెద్ద మొత్తంలో కర్చులు కావడంతో తీవ్ర బ్బందికి గురౌతున్నారని స్థానిక నాయకుల అభ్యర్ధనతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్‌ను సంప్రదించగా వెంటనె స్పందించిన కిరణ్ గౌడ్ వారి గురించి మంత్రి పొన్నం ప్రభకర్ గౌడ్‌తో మాట్లాడి సిఎంఆర్ఎఫ్ ద్వార, 1లక్షల రూపాయలను మంజూరు చేయించారు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరన్ కుమార్ గౌడ్. ఆదివారం స్థానిక నాయకులతో కలసి అందజేశారు. ఈ సందర్బంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ద్యేయం అని అన్నారు. జనగామ నియోజ కవర్గం వ్యప్తంగా ఇప్పటి వరకు సుమారుగా 10కోట్ల రూపాయల విలుపైన సిఎంఇర్ఎఫ్ ఎల్‌ఓసి చెక్కులను ఇస్తూ అండగా ఉన్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ట నాయకులు పాల్గొన్నారు.

## హక్కుల సాధనలో ఎఐటియుసి,ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్

జెఎసిలా పోరాట ఫలితమే

ఆర్‌టిసి కార్మికులకు లాభం



ప్రజాపక్షం/పెద్దపల్లి: హక్కుల సాధనలో ఏఐటీ యూసీ ముందు ఉంటుందని,ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటీయూసీ రామగుండం నగర సమితి అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ కరీం,శనిగరపు చంద్రశేఖర్ లు తెలిపారు. ఆదివారం రోజున గోదావరిఖనిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలోలవారు మాట్లాడుతూ తెలంగాణ ఆర్ టి సి ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ జేఏసి లా సమ్మె పోరాట ఫలితమే ఆర్ టి సి ని ప్రభుత్వంలో విలీనం చేయడానికి కమిటీని ఏర్పాటు చేశారని, 11శాతం పి ఆర్ సి నీ ప్రకటించడం జరిగిందని, కార్మికులకు సమ్మె కొన సాగించి ఉద్యమాలు రూపకల్పన చేసి పోరాడా లని కార్మిక వర్గాన్ని ఒక్కతాటిపైకి తీసుకొచ్చిన జేఏసి కి సామరస్యంగా భావోద్వేగానికి గురికా కుండా బలిదానాలు కాదు హక్కుల సాధనాగా కొనసాగాలి అని చెప్పి,రేవంత్ రెడ్డి సర్కారు తో పలు దఫాలుగా చర్చించి మార్గ దర్శకులు సిపిఐ జాతీయ నాయకులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా రథసారధి కామ్రేడ్ చాడా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శాసన సభ్యులు కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు, ఏఐటీ యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్ రాజ్ లకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కార్మిక సంఘాల జే ఏ సి నాయకులతో ప్రత్యక్షంగా చర్చలు జరిపినా ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, రాజ్యసభ సభ్యులు వేం నరేం దర్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ టి సి కార్మికుల కు తమ న్యాయమైన హక్కుల కోసం పోరాడి సాధించేందుకు ఏఐటీయూసీ ముందుం టుందని ఎర్ర జెండా కార్మికులదని వారు కార్మిక వర్గానికి గుర్తుచేశారు.ఆర్టీసీ కార్మిక సోదరులకు ఇది చారిత్రక మైన రోజనీ, కాని సమ్మె లో క్రియా శీలంగా వవహరించిన నర్సంపేట డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ మరణం దురదృష్టకరమని ఆయన కుటుంబానికి తీరని శోకం మిగిల్చారని వారు అన్నారు. కోలా శంకర్ గౌడ్ కుటుంబాన్ని అన్ని విధాలుగా అదూ కోవాలని, ప్రభుత్వం అండదం డలు ఉండాలని వారు కోరారు. ఈ సమావేశంలో శనిగరపు తిరుమల, శనిగరపుమతినా ముర్సా లీన్, శేఖర్, ఉసకోయిాల రసజ్ఞ,పాకాలపాటి నాగ మణిశేఖర్, దుబాసీ స్వరూప, షేక్ మసూద్, యాసర్ల రాజయ్య, వోలసాని రాజు కుమార్, ఈదునూరి రమేష్, మొహమ్మద్ సాభీర్, రాదా, శారద,బేబీ, సుగుణా, ఠాకూర్ కళావతి, బొందిలా సంగీత,తదితరులు పాల్గొన్నారు.

## గనిలో కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి

కార్మికుల సమస్యలపై మేనేజర్‌తో చర్చించిన ఏఐటియుసి నాయకులు



ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జీడికే 11వ ఇంక్లైన్ లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గని మేనేజర్ తో చర్చించడం జరిగిందని గుర్తింపు సంఘం ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గనిలో గాలి, నీరు సరఫరా సరిగా లేకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని,మెరుగైన గాలి సరఫరా లేకుండా కార్మికు లను విధులు నిర్వహించమని యాజమాన్యం ఒత్తిడి చేయడం సరైనది కాదని,వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వారు మేనేజర్ ను కోరారు. అదేవి ధంగా కార్మికులకు తగినన్ని పనిముట్లు అందించడం లేదని వాటిని పూర్తిగా సర ఫరా చేయాలని కోరారు, విధులకు వెళుతున్న కార్మికు లకు చైర్ కార్లు సరిపడా లేవని , వాటి సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని,అదేవి ధంగా ఎల్.హెచ్.డి సెక్షన్ లో మూడో చైర్ లిఫ్ట్ వెంటనే ఓపెన్ చేయాలని వారు మేనేజర్ ను కోరారు. ఈ సందర్భంగా గని మేనేజర్ స్పందిస్తూ వారం లోపు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నాయకులకు హామీ ఇచ్చారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి అర్జీ వన్ బ్రాంచి జిఎం కమిటీ సభ్యులు సిద్ధమల్ల రాజు, ఫిట్ సెక్రటరీ నాయిని శంకర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ గొడిశల నరేష్ తో పాటు మైన్స్ ,సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# స్వీయ గణన ప్రక్రియను విజయవంతం చేయాలి

సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకున్న కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల: జన గణన 2027 లో భాగంగా స్వీయ గణన ప్రక్రియను విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ అండ్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ పిలు పునిచ్చారు. జన గణన 2027 లో భాగంగా ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహించనున్న స్వీయ గణన ప్రక్రి యను జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ స్వీయ గణన చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ అండ్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... https://se.census.gov.in వెబ్ సైట్ ద్వారా లాగిన్ కావాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రి యను కేవలం 5 నిమిషాల సమయం పడుతుం దని, వెబ్ సైట్ పూర్తి స్థాయిలో సురక్షితమని స్పష్టం చేశారు. ప్రజల సమాచారం పూర్తి భద్రంగా ఉంటుందని వెల్ల డించారు. ఇంటింటికి వచ్చే ఎన్యూమరేటర్లు, సూపర్వైజ ర్లకు గుర్తింపు కార్డులు, ఇతర వివరాలు ఇచ్చామని తెలిపారు. జిల్లాలోని ప్రజల సర్వే కోసం వచ్చే వారికి 34 ప్రశ్నలకు సమాచారం ఇచ్చి సహరించాలని కోరారు. స్వీయ గణన లో భాగంగా ప్రజలు ఇచ్చే సమాచారంతో ప్రభుత్వ పథకా లకు అర్హత సాధించడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఈ నెల 26 వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు స్వీయ గణన జిల్లాలో నిర్వహించనున్నామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది జిల్లాలోని ప్రజా ప్రతినిధులు స్వీయ గణన చేసుకోవాలని పేర్కో న్నారు. సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు, ఇతర ప్రభుత్వ/ప్రైవేట్ ఉద్యోగులు వారి మొబైల్ ఫోన్ల ద్వారా నమోదు చేసుకోవ చ్చని తెలిపారు. జనాభా గణన సంబంధించి 1025 మంది ఎన్యూమరేటర్లు, 173 మంది సూపర్ వైజర్లకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి జన గణన అని, డిజిటల్ విధానంలో చేయను న్నారని వెల్లడించారు. ఇప్పటి వరకు 1117 హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ గుర్తించామని తెలపారు. ఈ కార్యక్రమంలో సీపీఓ శ్రీనివాసాచారి, ఈడీఎం శ్రీనివాస్, ఎస్ ఓ సంపత్ కుమార్ తది తరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: పేదప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సర్పంచుల ఫోరం అద్యక్షులు దొమ్మాటనర్సయ్య ,ఏఎంసీ చైర్‌పర్సన్ సబేర భేగం అన్నారు.ఆదివారం నారయణపూర్,కోరుట్లపేట,సింగారం గ్రామా లలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ళ గృహప్రవేశాలకు ఎలు గందుల నర్సింహులు,ప్రమీలబాలరాజు,మేడిపల్లి జ్యోతిదేవనందం,ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.రేవంత్‌సర్కార్ దేనికి కూడా వెనుకంజ వేయరని ప్రభుత్వపరంగా అభివృద్ధిపథకాలను సద్వినియోగ పరుచుకోవా లన్నారు.సీసీరోడ్లు,గృహప్రవేశాలు,ఉచిత పథకాలు,సబ్సిడి విధానం,సన్న బియ్యం,ఉచితకరెంట్ తో రేవంత్‌రెడ్డి అందరి మన్ననలు చూరగొన్నారని అన్నారు.ఆర్టీసి కార్మికులు సమ్మె చేస్తే ఒక్కరోజు లో పరిష్కరించి కార్మికు లతో శభాష్ అనిపించుకున్నారన్నారు.కార్యక్రమంలో గౌస్,వివిధ గ్రామల సర్పంచులు,కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి వంగగిరిధర్‌రెడ్డి,బాల్ రెడ్డి,మూర్తి,షకిల్,లబ్దిదారులు ఉన్నారు.

# క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట




సుల్తానాబాద్ ప్రీమియర్ లీగ్ పోటీలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ విజయ రమణారావు

ప్రజాపక్షం/సుల్తానాబాద్: గ్రామీణ క్రీడలను ప్రోత్స హించాలనే సంకల్పంతో క్రికెట్ పోటీలు నిర్వహిం చడం అభినందనీయమని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.ఆదివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూని యర్ కళాశాల మైదానంలో కీర్తిశేషులు అల్లాడి అర విందరావు స్మారక అర్థం సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఎస్ పి ఎల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతా లలో వేసవి సమయంలో యువత పెడదోవ పట్టవద్దనే సంకల్పంతో యువతలో దాగి వున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిం చడం అభినందనీయమన్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల తరహాలో 8 టీములు వేలం ద్వారా ఎన్నుకోబడి పోటీలలో పాల్గొంటారని అన్నారు. ప్రతి ఒక్క టీం 7 మ్యాచులు ఐపీఎల్ తరహాలో ఆడతయన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు గర్రెపల్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ జూపల్లి సందీప్ రావు ప్రథమ బహుమతి లక్ష రూపా యలు, ద్వితీయ బహుమతి 50 వేల రూపాయలు తోపాటు ప్రోత్సాహక బహుమతులు అందిస్తూ క్రీడలు కొనసాగడం శుభ పరిణామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్,మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు,కమిషనర్ టి రమేష్,మాజి ఎంపీటీసీ సూర శ్యామ్,తాళ్లపల్లి మనోజ్ గౌడ్,నిర్వాహకులు సంజీవ్,క్రాంతి, వేముల అనిల్, సతీష్,సిద్ధా తిరుపతి లతోపాటు క్రీడాకారులు,తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల సాకారం దిశగా ప్రభుత్వం కృషి

కూటిగల్‌లో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు ప్రారంభించిన ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట : ధూల్మిట్ట మండలం కూటిగల్, రెడ్యానాయక్ తాండాలలో నూతనంగా నిర్మిం చిన ఇందిరమ్మ ఇండ్ల సాముహిక గృహప్రవేశ కార్యక్ర మాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో స్థానిక నాయకులతో కలసి ఎంపి చామల కిరణ్‌కు మార్ రెడ్డి పాల్గోని లబ్ధిదారు లతో కలిసి గృహప్రవేశాలు నిర్వహించి ఇండ్లను ప్రారంభిం చారు. ఈ సందర్బంగా ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలోని బైరాన్ పల్లి, కూటిగల్ పోరాటాల ఖిల్లాలను స్మృతి చిహ్నాలుగా అభివృద్ధి చేస్తాం అని తెలిపారు. గతంలోనే వాటి అభివృద్ధికి 10 లక్షల రూపాయలను తన సొంత నిధుల నుండి సాంక్షన్ చేస్తానన్న హామిని గుర్తు చేశారు. కూటిగల్ గ్రామానికి ఎంపిగా ఎన్నికైన తరువాత మొదటి సారిగా వచ్చిన చామ లకు గ్రామస్థులు ఘన స్వాగతం తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఉమ్మడి మద్దూరు మండల మాజీ జడ్పిటీసీ గిరి కొండల్ రెడ్డి, జాలపల్లి గ్రామ సర్పంచ్ కమలాకర్ యాదవ్, జనగామ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నాగపురి కిరణ్ గౌడ్, వివిధ గ్రామాల సర్పం చ్‌లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గోన్నారు.



## సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ బాధ్యతల స్వీకరణ



ప్రజాపక్షం/సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని ,ప్రజలకు పారదర్శకంగా సేవలు అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాదురి, కలెక్టరేట్ సిబ్బంది నూతన కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే



ప్రజాపక్షం/శివ్వంపేట : పేదల సంక్షేం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ నర్సాపూర్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని పాంబండ గ్రామంలో వడ్ల ప్రభాకర్ మాన్కపద్మ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను సర్పంచ్ నాయిని సమతవేణుగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటరాంరెడ్డి, మాజీ సర్పంచ్ తలారి శివులు, కాంగ్రెస్ గ్రామకమిటి అధ్యక్షులు మైసయ్యయాదవ్‌లతో కలసి గృహప్రవేశాలను ప్రారంభించారు. పేద ప్రజలకు కూడు, గూడు కల్పించాలనే ఉద్దేశ్యంతో రేవంత్‌రెడ్డి ఉచితంగా సన్నబియ్యం ఉచితంగా అందిస్తూ ఉండడానికి ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తు పేదల ముఖాలలో ఆనందాన్ని చూడాలని కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు. అదేవిధంగా 17 మంది గర్భినీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ చేశారు. సర్పంచ్‌లు పుష్ప, దుర్గ్యానాయక్, వడ్ల నరసింహాచారి, నర్సింలుగౌడ్, మన్నె లక్ష్మ ణ్,పాల్గొన్నారు.

## రహదారికి మరమ్మతులు




ప్రజాపక్షం/రెబ్బెన : రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నాసిరకం బిటి రోడ్డుపై ప్రజాపక్షం దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. నారాయణపూర్ నుంచి పైకైగూడ వరకు వేసిన కొత్త రోడ్డు వారం రోజులకే పెచ్చులు ఊడిపోవడంపై ఈ నెల 19న ప్రచురితమైన కథనం అధికార యంత్రాంగంలో కదలిక తెచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో రహదారిని పరిశీలించి, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గత ఏడాది వేసిన కంకర మెటల్‌పై ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించకుండానే నేరుగా కొత్త పొర వేయడం వల్ల రోడ్డు పట్టు కోల్పోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు పూర్తి చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో రహదారి దెబ్బతినకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పల్లెల్లో జోరుగా అక్రమ మద్యం

ప్రజాపక్షం/రెబ్బెన : రెబ్బెన మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ముఖ్యంగా కృష్ణాపూర్ గ్రామంలో బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలుస్తుండటంతో సామాన్య కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని గ్రామ సర్పంచ్ స్వప్న వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఊరిలో మద్యం విక్రయాలు ఇంత బహిరంగంగా జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆమె మండిపడ్డారు.

### యువత భవిష్యత్తు అంధకారం

గ్రామాల్లో వైన్ షాపులను మించి బెల్టు షాపులు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయని సర్పంచ్ విమర్శించారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం మద్యం అందుబాటులో ఉండటంతో యువత పెడదోవ పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వేళల్లో కూడా ఎలాంటి భయం లేకుండా మద్యం విక్రయిస్తున్నారని, దీనివల్ల యువత భవిష్యత్తుతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని పేర్కొన్నారు. అక్రమ మద్యం వల్ల రెక్కాడితే గాని డొక్కాడని కూలీల జీవితాలు నాశనం అవుతున్నాయని సర్పంచ్ పేర్కొన్నారు. కష్టపడి సంపాదించిన డబ్బునంతా మద్యానికి తగలేస్తుండటంతో వారి కుటుంబాల్లో గొడవలు నిత్యకృత్యమయ్యాయని తెలిపారు. కృష్ణాపూర్ గ్రామపంచాయతీని మద్య రహితంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

### అధికారులు స్పందించాలి.. సర్పంచ్ స్వప్న

అక్రమ మద్యం విక్రయాల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని, ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే స్పందించి బెల్టు షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ స్వప్న వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. నిబంధనలు అతిక్రమించి మద్యం అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు.గ్రామస్తులు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## మీసేవ నిర్వాహకుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి

### జిల్లా మీసేవ ఫెడరేషన్ అధ్యక్షుడు సితారే క్షవీన్

ప్రజాపక్షం/నిజామాబాద్ : మీసేవ నిర్వాహకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటంలో ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర అధ్యక్షులు బైర శంకర్ అ న్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో జిల్లా మీసేవ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముఖ్య సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు సితారే క్షవీన్‌రాజ్, కార్యదర్శి మహ్మద్ సాహిద్‌అలీ నాయకత్వంలో జరిగిన ఈ సమావేశంలో మీసేవ రంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. మీ సేవ కమీషన్ల పెంపుపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు. సిఎం, పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి శ్రీధర్‌బాబు, కమీషనర్‌కు పాలాఇషేకం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు సితారే క్షవీన్‌రాజ్ మాట్లాడుతూ కమీషన్ పెంపు ఉద్యమ ఫలితామన్నారు. మీసేవ నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలు ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు. వాటి పరిష్కారం వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ మీసేవ ఫెడరేషన్ పూర్తి సహకారముంటుందని తెలిపారు. సుమారు ఎనిమిది జిల్లాల్లో ఈ పరిస్థితి కొనసాగుతున్నందున కొత్త మీసేవ కేంద్రాలకు తాత్కలికంగా అనుమతులు లేవు, జిల్లాకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీనిచ్చారు. రాష్ట్ర కమిటీ రాకతో జిల్లా మీసేవ ఫెడరేషన్ సభ్యుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. సమావేశంలో రాష్ట్ర నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు, మీసేవ నిర్వాహకులు పాల్గొన్నారు.

# బెట్టింగ్ భూతానికి కుటుంబాలు బలి..!

ప్రజాపక్షం/మెదక్ : ఒకప్పుడు ఉత్సాహాన్ని పంచిన క్రికెట్ నేడు ప్రాణాలను బలిగొంటున్న ప్రమాదకర ఆటగా మారుతోంది. నాడు సరదా ఆడిన ఆట నేడు చావుల ఆటగా తయారైంది. రోజు రోజుకు పుట్టగొగుల్లా పుట్టుకొస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ఇప్పుడు సామాన్యుల జీవితాలను చీల్చేస్తున్నాయి. బెట్టింగ్ యాప్స్ మాయలో పడి కుటుంబాలన్ని చిన్న బిన్నమై ఛిద్రమౌతున్నాయి. ముఖ్యంగా ఐపీఎల్ సీజన్ వస్తే చాలు మొబైల్ స్క్రీన్‌లలోకి దూసుకొచ్చే ఆన్‌లైన్ బెటింగ్ యాప్స్ సామాన్యుల జీవితాలతో జూదం ఆడుతున్నాయి. డిజిటల్ జూదానికి అలవాటు పడిన వాళ్ళు చివరకు ఆత్మహత్యలు చేసుకున్న సంఘలనలు ఉన్నాయి. 'ఈజీ మనీ' అనే మాయలో పడిన యువత క్షణాల్లో అప్పుల కూపంలో కురుకుపోతున్నారు. ఒక్క మ్యాచ్ గెలిస్తే డబుల్ మనీ అనే మోసపు మంత్రం అమాయకులను బలి తీసుకుంటుంది. "ఫిక్స్ టిప్స్ ఖాయం వంద గెలుపు" అంటూ యాప్స్ ఆకర్షణియ ప్రకటనలతో వల విసురుతున్నాయి. మొదట చిన్న మొత్తాలు గెలిపించి నమ్మకం పెంచి తర్వాత భారీగా డబ్బులు పెట్టించేలా ప్రలోభ పెడుతున్నాయి. చివరికి మిగిలేది అప్పులు, ఆవేదన, ఆత్మహత్యలకు దారులు తీస్తున్నాయి. ఒకప్పుడు గుప్తంగా నడిచిన బెట్టింగ్ ఇప్పుడు యాప్ రూపంలో ప్రతి ఇంటి గుమ్మం తట్టుతోంది. టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపులు, రిఫరల్ బోనస్‌లతో యువతను బానిసలుగా మార్చుతూ ఈ దందా రోజురోజుకు విస్తరిస్తోంది బెట్టింగ్‌లో నష్టపోయిన తర్వాత కుటుంబాలు ఆర్థికంగా కూలిపోతున్నాయి. అప్పుల ఒత్తిడి, ఇంట్లో కలహాలు, మానసిక ఆందోళనలు పెరిగి చివరకు తీవ్ర నిర్ణయాలకు దారి తీస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. పిల్లల చదువు, భవిష్యత్తు చీకటోకి జారిపోతోంది. దేశంలో ఎన్ని చట్టాలు ఉన్నా మాఫియా దందా కొనసాగుతూనే ఉంది. ఆన్‌లైన్ బెట్టింగ్ చట్టవిరుద్ధమే అయినా విదేశీ సర్వర్లు, కొత్త డొమైన్‌లతో మాఫియా మళ్లీ మళ్లీ పుట్టుకొస్తోంది. పోలీసుల దాడులు అక్కడ అక్కడ జరుగుతున్న సమస్య పూర్తిగా అదుపులోకి రావడం లేదు బెట్టింగ్ ఒక ప్రమాదకర మానసిక వ్యసనం ఒకసారి అలవాటు పడితే బయటపడటం కష్టం. ఇది వ్యక్తికి సంబంధించిన విషయం మాత్రమే కాదు పూర్తి కుటుంబాన్ని నాశనం చేసే శక్తి బెట్టింగ్ భూతానికి కలిగి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### బెట్టింగ్ అరికట్టడం ఎలా ?

క్రికెట్ బెట్టింగ్ కు అలవాటు పడి బానిసలుగా మారు







తున్న యువతకు ప్రభుత్వ యంత్రాంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి బెట్టింగ్ పై విస్తృత ప్రచారం చేపట్టాలి. అక్రమ బెట్టింగ్ యాప్స్ పై కఠిన నిషేధం అమలు చేయాలి. బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీల పై కఠిన పర్యవేక్షణ అవసరం. సోషల్ మీడియా ప్రకటనలపై నియంత్రణ చేసి నిఘాను పెంచాలి. బాధితులకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఏర్పాటు చేయడం వల్ల బెట్టింగ్ ను కట్టడి చేసే అవకాశం ఉంటుంది. గెలుపు కోసం వేసిన పందెం ఇప్పుడు జీవాతాలనే కోల్పోయే పందెంగా మా రింది.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేలుకొని గ్రామ, పట్టణ స్థాయిలో బెట్టింగ్ ఆరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే ఈ డిజిటల్ జూదం మరిన్ని కుటుంబాలను బలి తీసుకోవడం ఖాయం.

## స్వీయగణనను ప్రతిఒక్కరూ సద్వినియోగపర్చుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/నిజామాబాద్ : జనగణ న ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం కలెక్టరేట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో స్వీయ నమోదు చేసుకున్నారు. జనగణనలో ఎవరికి వారు స్వయంగా వివరాలు నమోదు చేసుకునేలా అందుబాటులోకి తెచ్చిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌తో వివరాలను నమోదు చేసుకున్నారు. జనగణన ప్రక్రియను సులభంగా, సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటల్ స్వీయగణన విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ వివరాలను వెబ్‌పోర్టల్‌లో కానీ మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని తెలిపారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ నమోదు చేసుకోవచ్చని, జనగణనకు సంబంధించిన సమాచారాన్ని 15 నిమిషాల వ్యవధిలో పూర్తి చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వంచే నియమించబడ్డ ఫీల్డ్ ఎన్యుమరేటర్లు మే 11 నుంచి జూన్ 9 వరకు క్షేత్రస్థాయిలో ఇంటికి వచ్చిన సమయంలో వారికి సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి నెంబర్ తెలియజేయాలని సూచించారు. ప్రజలు తమ వివరాలను ప్రస్తుతం ఆన్‌లైన్ పోర్టల్‌తో స్వీయ నమోదు చేసుకుంటే ధృవీకరణ సమయంలో వారు ఇంట్లో భౌతికంగా ఉండాల్సిన అవసరముండదని, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సమాచారాన్ని సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి ద్వారా ఎన్యుమరేటర్ పరిశీలించి ధృవీకరిస్తారన్నారు.



జనగణన ప్రక్రియలో సాంకేతికతను వినియోగించి సమగ్రతను పెంచటం ప్రతి పౌరుని వివరాలు జనగణనలో చేరేలా చూడటమే లక్ష్యంగా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ స్వీయ గణన ప్రక్రియను జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రతిఒక్కరి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని భరోసా కల్పించారు.

## చదువుల తల్లి సేవలో కలెక్టర్ దంపతులు

### బాసర క్షేత్రంలో భవేశ్ మిశ్రా, ఇలా త్రిపాఠి ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం / బాసర : దక్షిణ భారతదేశంలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆయన సతీమణి ఇలా త్రిపాఠి ఆదివారం నాడు దర్శించుకున్నారు. జిల్లా పరిపాలనా అధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వారు తొలిసారి క్షేత్రాన్ని సందర్శించడంతో ఆలయ యంత్రాంగం వారికి ఘన స్వాగతం పలికింది. ఆలయ ముఖద్వారం వద్దకు చేరుకున్న కలెక్టర్ దంపతులకు ఆలయ కార్యనిర్వహణాధికారి, అర్చక బృందం సాంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయం లోపలికి ఆహ్వానించారు. ముందుగా కలెక్టర్ దంపతులు పవిత్ర గోదావరి నదిని దర్శించుకొని అనంతరం ఆలయప్రాంగణంలోని గణపతి దేవుడికి మొక్కులు చెల్లించుకున్నారు.అలాగే క్షేత్రానికి వచ్చే భక్తులకు కనీస సౌకార్యాల కల్పనతో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆలయ అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో అర్చకులు కలెక్టర్ దదంపతులకు వేద మంత్రోత్సారణల మధ్య ఆశీర్వచనాలు అందించారు. అమ్మవారి శేష వస్త్రం వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు బాసర క్షేత్ర విశిష్టతను త్వరలో చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో బాసర తహసిల్దార్ ఆలయ సిబ్బంది, ఇతర రెవెన్యూ అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత

### కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాపక్షం/మెదక్ : రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వాసవి మాత జ యంతి ఉత్సవాలను కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వాసవి మాత జ యంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగే ష్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలను గావించి వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు వాసవి మాతా జయంతి ఉత్సవాలను రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సందర్భంగా వాసవి మాత జయంతిని జరుపుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఆర్యవైశ్యుల కులదేవతగా వాసవి మాతకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, డిపిఆర్ఓ రామచంద్ర రాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రపాల్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పల్లెర్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి బుక్క అశోక్, కోషధికారి మరుమల్ల అశోక్, సంఘం ఉత్సవ కమిటీ చైర్మన్ రాయ కంటి నాగరాజు, ఆ ర్య వైశ్య సంఘం మ్యాడం బాలకృష్ణ, రాగి అశోక్, పట్టణ కార్యదర్శి బచ్చు పార్థివనా థ్, ఉప్పల




శ్రీకాంత్, కోపురి శ్రీనివాస్, షిర్నా రాజేశ్వర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రపాల్, వుట్కూరి వీరేశం, కౌన్సిలర్ శివరామకృష్ణ, కొండా శ్రీనివాస్, పురం వెంకట నారాయణ, కొమ్మ వెంకటేష్, బజ్జూరి బిక్షపతి, మురళి, పొగాకు రామకృష్ణ, వనజ, సుష్మ, పద్మా పాల్గొన్నారు.

## భట్రాజు సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రజాపక్షం / నిర్మల్‌టౌన్ : నిర్మల్ జిల్లా భట్రాజు సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి ఈ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అధికారి అంబటి రవీందర్ రాజు మరియు ఎన్నికల పర్యవేక్షకులు అట్లూరి సత్యనారాయణ రాజు సమక్షంలో అధికారికంగా నిర్వహించారు. సంఘం నియమ నిబంధనల ప్రకారం 2026 నుండి 2029 వరకు అంటే మూడేళ్ళ పదవీ కాలం కోసం ఈ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షులుగా శ్రీ దేవరాజు లింగం రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం యొక్క ప్రధాన కార్యదర్శిగా శ్రీ నన్నపురాజు మనోజ్ రాజు ఎన్నికవగా కోశాధికారి బాధ్యతలను శ్రీ బట్టు హరిదాసు లింబాద్రి రాజుకు అప్పదించారు. అలాగే సంయుక్త కార్యదర్శులుగా శ్రీ కర్ణ రాజు ప్రీతం , శ్రీ సన్నపురాజు యుగంధర్ మరియు శ్రీ బండివార్ శివసాయి వర్ధన్ లు ఎంపికయ్యారు. తమపై మన్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులకు , ఎన్నికల అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మహారాష్ట్రకు తరలుతున్న బియ్యం

ప్రజాపక్షం / సారంగాపూర్ : ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందిస్తున్న సన్నబియ్యం పక్కదారి పడుతోంది. నిర్మల్ జిల్లా కేంద్రం నుండి మహారాష్ట్రలోని శివుని కేంద్రంగా యదేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రభుత్వం నిరుపేదలకు మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి ఇవ్వడంతో మరింత జోరు అందుకుంది. కొద్ది రోజులుగా నిర్మల్ నుండి స్వర్ణ ప్రధాన రహదారిపై పెద్ద మొత్తంలో రవాణా కొనసాగుతున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే మహారాష్ట్ర ఉండటంతో ఈ సారంగాపూర్ మండల కేంద్రం మీదుగా సులువు గా మా రింది. మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. అధికారులు ప్రతినిత్యం భారీ వాహనాలతో మహారాష్ట్రకు బియ్యం తరలుతున్నా మామూలుగా తీసుకుంటూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు అధికారుల మాటలు ప్రకటనలకే పరితమా, అక్రమ బియ్యాన్ని అరికడతాము, వాహనాలను జిప్తి చేస్తామని చెప్పె అధికారుల మాటలు ప్రకటనలకు పరిమితమా అనే చందంగా మారిందని అశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మేల్కొని అక్రమ బియ్యం దందాను అరికడతారని ఆశిస్తోంది.

## మేకల కొట్టం, వడ్ల కుప్ప దగ్ధం

### రూ. పది లక్షల ఆస్తి నష్టం

ప్రజాపక్షం/పాపన్నపేట: అగ్ని ప్రమాద ఘటనలో నివాస గుడిసె మేకల కొట్టం వడ్ల కుప్ప దగ్ధమైన ఘటన పాపన్నపేట మండలం మిన్పూర్ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి బాధిత కుటుంబాలు గ్రామస్తులు తెలిపిన వివరాలు, మిన్పూర్ గ్రామానికి చెందిన గోదారి సాయిలు తనకున్న కొద్దిపాటి స్థలంలో నివాసగుడిసే అందులోనే మేకలకొట్టాన్ని ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. మేక పిల్లలను కొట్టంలో ఉంచి పెద్ద మేకలను మేతకు తీసుకెళ్లగా కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళారు. ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుగునగా నివాసగుడిశా మేకల గొట్టం పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో నాలుగు మేకపిల్లలు లక్ష రూపాయల నగదు ఇతర గృహ ఉపకరణాలు దగ్ధం అయినట్లు బాధితులు పేర్కొన్నారు. ఈ ఘటనలో సుమారు పది లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు కన్నీటి పర్యంతరమయ్యారు. ఇదిలా ఉండగా గుడిసెకు అనుకొని ఖాళీ స్థలంలో మిన్పూర్ గ్రామానికి చెందిన హనుమంతు కిషన్ వడ్ల కుప్పగూడా తగలబడింది. ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లు తనకున్న స్థలంలో తూర్పార పెట్టగా మరికొన్ని వడ్లు కుప్పగా పోశాడు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో గుడిసెకు అంటుకున్న మంటలు ఎగిసిపడి వడ్ల కుప్ప తగలబడింది కిషన్ కూడా సుమారు లక్ష రూపాయల వరకు నష్ట వాటిల్లినట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు స్పందించిన అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనస్థలికి చేరుకొని మంటలను ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.





## ప్రభుత్వ భూముల్లో 'రాజకీయ'డేగలు!

### అక్రమ వెంచర్లుగా ప్రభుత్వ భూములు అధికారుల అండదండలతోనే దందా?

ప్రజాపక్షం/చెన్నూరు : చెన్నూరు పట్టణంలో రెవెన్యూ అధికారుల అండదండలతో ప్రభుత్వ భూ ముల్లో అక్రమ వెంచర్ల దందా విచ్చలవిడిగా సా గుతోంది. నిబంధనలను తుంగలో తొక్కి కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు ఒక ముఠాగా ఏర్పడి ప్రభుత్వ స్థలాలను అక్రమంగా పట్టా చేయించుకుని వెంచర్లుగా మార్చిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ శివారులోని సర్వే నంబర్లు 863, 864, 869 తో పాటు కత్తరశాల శివారులోని సర్వే నంబరు 405లో ఈ అక్రమాలు జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో పనిచేసిన ఒక తహసీల్దార్ కాసుల కక్కుర్తితో కనీసం సర్వే కూడా నిర్వహించకుండా తప్పుడు పట్టాలు జారీ చేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### మృతి చెందిన వ్యక్తి పేరిట పట్టా

కత్తరశాల గ్రామ శివారు సర్వే నంబరు 405/1అ, 405/1ఇ లోని ఒక ఎకరం 20 గుంటల ప్రభుత్వ భూమిని సర్పంచ్ కుటుంబ సభ్యురాలు చేతెల్లి సరోజ పేరిట, అలాగే పట్టణ శివారులోని 3 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని ఒద్ది మల్లక్క అనే మృతి చెందిన వృద్ధురాలి పేరిట గత తహసీల్దార్ ఏకకాలంలో పట్టా పుస్తకాలు జారీ చేయడం గమనార్హం. వాస్తవానికి ఈ స్థలంలో గత 30 ఏళ్లుగా నూకల సడవలి అనే వికలాంగుడు సాగు చేసుకుంటుండగా, రాజకీయ పలుకుబడి ఉన్న నేతలు అధికారులను బుట్టలో వేసుకుని 869/3 అనే కొత్త సర్వే నంబరును సృష్టించి అక్రమంగా పట్టాలు పొందారు. ఈ తప్పుడు పట్టాల ఆధారంగానే ప్రస్తుతం అక్కడ అక్రమ వెంచర్లు వెలిశాయి.



### అక్రమార్కులకు అధికారుల కవచం

రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న సర్వే నంబరు 840లోని ప్రభుత్వ స్థలాన్ని కూడా గతంలో ప్లాట్ల రూపంలో విక్రయించగా, ఇటీవల అధికారులు అక్కడ నిర్మించిన ఇళ్లను రద్దు చేశారు. ఇప్పుడు వెలుస్తున్న అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసే సాధారణ ప్రజలు కూడా భవిష్యత్తులో మోసపోయే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు స్థలాలు కరువవుతున్నా, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

### విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం: తహసీల్దార్

ఈ అక్రమ పట్టాల వ్యవహారంపై చెన్నూరు తహసీల్దార్ ఈర్ల మల్లిఖార్జున్ వివరణ ఇచ్చారు. ప్రభుత్వ స్థలంలో తప్పుడు పట్టా పొందిన చేతెల్లి సరోజకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని తెలిపారు. సరోజ, ఒద్ది మల్లక్కలు పొందిన ప ట్టాలపై సమగ్ర విచారణ జరిపి, అవి తప్పుడువని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.



## అంగరంగ వైభవంగా వాసవిమాత జయంతి వేడుకలు

### అభరణాలు సమర్పించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ పూజల్లో ఎంపి ధర్మపురి



ప్రజాపక్షం/నిజామాబాద్ : వాసవిమాత జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం సంతోషకరమని, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. ఆదివారం వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి పురస్కరించుకుని కిషన్ గంజ్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించగా ఎంపీ ధర్మపురి అరవింద్ పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం సంతోషకరమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ఆర్యవైశ్యులు ఎప్పుడు ముందుంటారన్నారు. అంతకుముందు అమ్మవారికి ఆభరణాలు సమర్పించారు.

### వైభవంగా శోభాయాత్ర

నగరంలోని పెద్దబజార్‌లోని నగరేశ్వర దేవాలయం వద్ద ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. శివాజీనగర్ వద్ద బజార్ గాంధీచౌక్ మీదుగా కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది. ఒగ్గు కళాకారులు, పులి వేషాలు, బోనాలు, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు ఆద్యాంతం కన్నుల పండగగా కొనసాగింది. నగరంలోని కిషన్ గంజ్ వాసవి మాత ఆలయంలో అమ్మవారి నామకరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

ప్రజాపక్షం
Telugu National Daily

కరీంనగర్
సోమవారం
27-04-2026
www.prajapaksham.in

సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్‌లో 99వ సినిమాగా ఆర్.బి. చౌదరి నిర్మాణంలో విశాల్ స్వీయ దర్శకత్వంలో రానున్న చిత్రం 'మకుటం'. విశాల్, అంజలి కాం బోకి ఉన్న హిట్స్, క్రేజ్ అందరికీ తెలిసిందే. అయితే ఈ 'మకుటం' చిత్రంలోనూ విశాల్ సరసన అంజలి నటించనున్నారు.

# రీల్



## 'మకుటం'లో హీరోయిన్‌గా అంజలి

సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్‌లో 99వ సినిమాగా ఆర్.బి. చౌదరి నిర్మాణంలో విశాల్ స్వీయ దర్శకత్వంలో రానున్న చిత్రం 'మకుటం'.విశాల్, అంజలి కాం బోకి ఉన్న హిట్స్, క్రేజ్ అందరికీ తెలిసిందే. అయితే ఈ 'మకుటం' చిత్రం లోనూ విశాల్ సరసన అంజలి నటించనున్నారు. ఈ మేరకు అం జలి, విశాల్ కలిసి ఓ కాన్సెప్ట్ వీడియోని చేశారు. హీరోయిన్ అంజలి వద్దకు దర్శకుడైన విశాల్ కథ చెప్పడానికి వెళ్తాడు. ఇక కథ చెప్పండి డైరెక్టర్ అని అంజలి అంటారు. ఒక అంద మైన గ్రామం అని విశాల్ అంటే.. అసలు మీ వద్ద కథ ఉందా? అని అంజలి అడగడంతో విశాల్ పారిపో తారు. మంచి కథ అని మేనేజర్ చెప్పారే.. విశాల్ ఏంటి ఇలా చెబుతున్నారని అంజలి అనుకుంటారు. కథ అడుగుతోందే.. ఎలా.. రేపు వచ్చి మరో కథ చెబుదాం అని విశాల్ వెళ్లి పోతారు.ఈ కాన్సెప్ట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.ఈ మూవీకి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు. స్క్రీన్ ప్లే, డైరెక్షన్ బాధ్యతలను విశాల్ చూసుకుంటున్నారు. ఈ మూవీకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలోనే ప్రకటించనున్నారు. అది ప్రొడక్షన్ వాళ్లు చూసుకుంటారు కదా.. ముందు మీరు కథ చెప్పండని కౌంటర్ వేస్తారు అంజలి. ఇలా విశాల్ కథ చెబుతూ ఉంటే మ ధ్య మధ్యలో అంజలి సెటైర్‌లు వేస్తుంటారు. విశాల్ ఇలా ఏదేదో చెబుతుంటారు..

# 30న వస్తున్న 'కర'



పంటో.. గడ్డో ..పాపమో..పుణ్యమో తను నాటింది..తనే నరుక్కోవాలి. నేను నాటిన విత్తనం ఇప్పుడు కోత కొచ్చింది. అంత కంటే ముందు నామీద పడ్డ మచ్చని తుడిచేయాలి. నన్ను నమ్ముకున్న వారిని ముందుకు తీసుకెళ్లాలి. నా పేరు కరసామి'' అని ఓ యువకుడు తన బాధను వ్యక్తం చేస్తున్నాడు. ఇంతకీ కరసామి మీద పడ్డ మచ్చ ఏంటి? అతను తనకు ఎదురైన సమస్యను ఎలా దాటి తనపై పడ్డ మచ్చను తుడుచుకున్నాడు.. అనేది తెలుసుకోవాలంటే ధనుష్ హీరోగా నటించిన 'కర' సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్. ఏప్రిల్ 30న ఈ సినిమా రిలీజ్ అవుతోంది. కుష్మిత గణేష్ సమర్పణలో డా. ఇషారి కె. గణేష్ నిర్మించిన చిత్రం 'కర'. ఈ మూవీకి విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించారు. ఈ సినిమాను ఏప్రిల్ 30న తెలుగు రాష్ట్రాల్లో విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ బ్యానర్ మీద సిహెచ్ సతీష్ కుమార్, రాజేష్ కుమార్ బొబ్బర రిలీజ్ చేస్తున్నారు. ధనుష్‌కి జోడీగా మమితా బైజు నటించింది. తాజాగా ఈ సినిమా తెలుగు టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఓ వైపు సమస్యను ఎదుర్కొనే యువకుడిగా, మరో వైపు భావోద్వేగాలు కలగలిసిన వ్యక్తిగా ఓ పరిణితిగల పాత్రలో మెప్పించబోతున్నారనే విషయం స్పష్టమవుతోంది. తన దైన స్టైల్లో ధనుష్ పాత్రలో ఒదిగిపోయారనేది టీజర్‌లో తెలుస్తోంది. యంగ్ మ్యూజిక్ సెన్సేషనల్ జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తోన్న ఈ చిత్రానికి థేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ధనుష్, మమిత బైజు, కె.ఎస్.రవికుమార్, కరుణాస్, ఎం.ఎస్. బాస్కర్, శ్రీజ రవి ఇతరులు నటిస్తున్నారు.

## 'మైసా' కేరళలో యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం



నేషనల్ క్రష్ రష్మిక మందన్న పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'మైసా'తో తన కెరీర్‌లో అత్యంత సవాలుతో కూడిన పాత్ర చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఇంటెన్స్ గ్లింప్స్‌తో మంచి బజ్ సృష్టించింది. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో అన్‌ఫార్ములా ఫిలిమ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. తాజాగా కేరళలో 15 రోజుల బ్రూటల్ యాక్షన్ ప్యాక్డ్ షూటింగ్ షెడ్యూల్ ప్రారంభమైంది. కేచా ఖంపక్డీ మాస్టర్ హై వోల్టేజ్ యాక్షన్ కొరియోగ్రఫీని అందిస్తున్నారు. రష్మికతో పాటు కీలక నటీనటులు పాల్గొంటున్న ఈ యాక్షన్ షెడ్యూల్ సినిమాలో మేజర్ హైలెట్‌గా ఉండబోతుంది. 'మైసా'లో రష్మిక ఒక గోండ్ గిరిజన అమ్మాయిగా కనిపిస్తోంది. ఈ పాత్రకు ఎమోషనల్ డెప్త్‌తో పాటు శారీరక దృఢత్వం కూడా అవసరం. ఇందుకోసం రష్మిక అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్ ఆండి లాంగ్ పర్యవేక్షణలో బ్యాంకాక్‌కు వెళ్లి కఠినమైన స్టంట్, కాంబాట్ ట్రైనింగ్ తీసుకున్నారు. రోజుకు దాదాపు ఎనిమిది గంటల పాటు అడ్వాన్స్‌డ్ స్టంట్స్, హ్యాండ్ టు హ్యాండ్ ఫైట్, హైస్పీడ్ యాక్షన్ టెక్నిక్స్ నేర్చుకున్నారు. రష్మిక మైసాలో ఇప్పటివరకు చూడని ఇంటెన్స్, ఎక్స్‌ప్లోసివ్ అవతార్‌లో సంచలనం సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో ఈశ్వరి రావు, గురు సోమసుందరం, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీని శ్రేయాస్ పి కృష్ణ నిర్వహిస్తుండగా, జేక్స్ బీజోయ్ సంగీతాన్ని అందిస్తున్నారు. అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ ఆండి లాంగ్ యాక్షన్ సన్నివేశాలను పర్యవేక్షిస్తున్నారు. రష్మిక మందన్న, ఈశ్వరీ రావు, గురు సోమసుందరం, రావు రమేష్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, డిఓపి: శ్రేయాస్ పి కృష్ణ.

## బ్యూటిఫుల్ లవ్ స్టోరీ 'గోదారి గట్టుపైన'



యంగ్ హీరో సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా 'గోదారి గట్టుపైన'తో అలరించబోతున్నారు. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే టీజర్, సాంగ్స్ అద్భుతమైన రెస్పాన్స్ తో సినిమా మంచి బజ్ క్రియేట్ చేసింది. ట్రైలర్ అప్డేట్ ఇచ్చారు. 'గోదారి గట్టుపైన' ట్రైలర్ ఏప్రిల్ 27న లాంచ్ చేయనున్నారు. ట్రైలర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ క్యూట్ రొమాంటిక్ వైబ్‌తో కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి నాగ వంశీ కృష్ణ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీని సాయి సంతోష్, ప్రొడక్షన్ డిజైన్‌ను ప్రవాల్య, ఎడిటింగ్‌ను అనిల్ కుమార్ పి, సౌండ్ డిజైన్‌ను నాగార్జున తల్లపల్లి నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం మే 8న వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు, రాజీవ్ కనకాల, లైలా, దేవి ప్రసాద్, సుదర్శన్, రాజ్ కుమార్ కసిరెడ్డి, వైవా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మ నటిస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం సుభాష్ చంద్ర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మధులిక సంచన లంక, డీపీవో సాయి సంతోష్, సంగీతం నాగ వంశీ కృష్ణ, ఎడిటర్ అనిల్ కుమార్ పి.

## 'గాయపడ్డ సింహం' గ్రేట్ కంటెంట్‌తో వస్తోంది

### ట్రైలర్ లాంచ్ లో దుల్కర్ సల్మాన్



తరుణ్ భాస్కర్ న్యూఏజ్ ఎంటర్‌టైనర్ 'గాయపడ సింహం'తో అలరించబోతున్నారు. ఈ చిత్రం కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో మే 1న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. పవన్ సాదినేని సమర్పణలో ఈ చిత్రాన్ని సప్తస్వ మీడియా వర్కర్స్, పిఐపి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్లపై కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే ట్రైజర్, ఉర్రూతలూగించే పాటలతో మంచి బజ్‌ను సృష్టించింది, తాజాగా విడుదలైన థియేట్రికల్ ట్రైలర్ ఉత్సాహాన్ని మరింత పెంచింది. వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ ఈ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ 'గాయపడ్డ సింహం' టైటిల్ విన్నప్పటి నుంచే నాకు చాలా క్యూరియాసిటీ కలిగింది. 'ఆకాశంలో ఒక తార' సినిమా చేస్తున్నప్పుడు పవన్ ఈ సినిమా గురించి ప్రతిదీ చెప్పుండేవారు. ఇందులో నటిస్తున్న అందరూ నా మంచి ఫ్రెండ్స్. ట్రైలర్ మైండ్ బ్లోయింగ్‌గా వుంది. ప్రతి విజువల్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఇది తప్పకుండా బిగ్ సమ్మర్ బ్లాక్‌బస్టర్ అవుతుందని నమ్మకం ఉంది. ఈ సబ్జెక్ట్ అందరికీ రిలేటబుల్‌గా ఉంటుంది. మనలో చాలామంది ఎప్పుడో ఒకసారి అమెరికా వెళ్లాలని కల కంటారు. కాబట్టి ఆడియన్స్ ఖచ్చితంగా కనెక్ట్ అవుతారు. 'గాయపడ్డ సింహం' గ్రేట్ కంటెంట్‌తో వస్తోంది. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ ఈ సినిమా ఐడియా చెప్పినప్పుడు చాలా నచ్చింది. కాన్సెప్ట్ బాగా అనిపించి వెంటనే కొనేశాం. ఇందులో ఇద్దరు హీరోలు ఉన్నారు. సెకండ్ హాఫ్‌లో ఐదు ఎపిసోడ్స్ థియేటర్‌లో బాగా ఎంటర్‌టైన్ చేస్తాయి. అవి వర్క్ ఐతే ఇది మరో జాతిరత్నాలు అవుతుంది. శ్రీ విష్ణు క్యారెక్టర్ కూడా చాలా బాగా డిజైన్ చేశారు. ఫస్ట్ హాఫ్‌లో జేడీ సీరియస్‌గా ఉంటే, సెకండ్ హాఫ్‌లో నవ్విస్తాడు. చాలా ప్లాన్‌తో తెరకెక్కించారు. హీరోయిన్ ఫరియా అబ్దుల్లా, మానస, డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్, నిర్మాత భాను, పవన్ సాదినేని పాల్గొన్నారు.

## 'శ్రీనివాస మంగాపురం'లో బ్రహ్మాజీ ఫస్ట్ లుక్ రిలీజ్



ఆర్ ఎక్స్ 100, మంగళవారం చిత్రాలలో ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకున్న దర్శకుడు అజయ్ భూపతి, ప్రస్తుతం 'శ్రీనివాస మంగాపురం' ప్రాజెక్ట్‌కి దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు సోదరుడి కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. రవీనా టాండన్ కుమార్తె రాషా థడాని ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. కలెక్షన్ కింగ్ మోహన్ బాబుఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో వెర్సటైల్ యాక్టర్ బ్రహ్మాజీ కీలక పాత్రని పోషిస్తున్నారు. ఆయనకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ 'బాలు' పాత్రలో ఆయన ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్‌లో మైక్ పట్టుకొని హ్యాపీ వైబ్‌లో కనిపించారు బ్రహ్మాజీ. 'బాలు' పాత్ర అందరినీ థియేటర్లలో పక్కాగా ఎంటర్‌టైన్ చేయబోతుంది. అగ్ర నిర్మాత అశ్విని దత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. జయ కృష్ణ ఘట్టమనేని, రాషా థడాని, మోహన్ బాబు, డా. నరేష్ వికే. సమర్పణ: అశ్విని దత్, నిర్మాత: పి.కిరణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాకమూరి నారాయణ స్వామి, ఫైట్స్: రియల్ సతీష్.

# బ్రిటిష్ పాలకులకు మోదీకి తేడా లేదు

• 'విభజించు... పాలించు' తరహా విధానం • నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాల్సిందే • ఎఐటియుసి నాయకత్వంలో పోరుకు సమాయత్తం • ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్




**తిరుపతి:** ''బ్రిటిష్ పాలకులకు నరేంద్రమోదీకి తేడా లేదు. విభజించు... పాలించు తరహా విధానం అవలంబిస్తున్నారు... నష్టాల సాకుతో ప్రభుత్వ రంగ సంస్థలు అంబానీ, అదానీకి ధారాదత్తం చేస్తున్నారు. పథకం ప్రకారం చిన్న తరహా పరిశ్రమలు నాశనం చేయడానికి కంకణం కట్టుకున్నారు'' అని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ నిప్పులు చెరిగారు. తిరుపతి నగరంలో ఆదివారం ఎఐటియుసి ఎపి 18వ రాష్ట్ర మహాసభలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రాష్ట్రం నలువలల నుంచి వచ్చిన వేలాది మంది కార్యకర్తలు ఎర్ర జెండాలు చేత పట్టి తిరుపతి వీధుల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎఐటియుసి కార్యకర్తలు, నేతల నినాదాలతో తిరు నగరి హోరెత్తింది. అనంతరం తుడా కార్యాలయ సమీపంలోని ఇందిరా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ప్రధాన వక్తగా హాజరైన అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ... కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో అసలు సమస్యలే లేవని ప్రధాని మోదీ బుకాయిస్తుంటే, అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇటు మహారాష్ట్రలోనూ అంతా బాగుందంటూ చంద్రబాబు నాయుడు ముందుగానే వంత పాడుతున్నారని ఆమె విమర్శించారు. అమెరికా ఇరాన్ యుద్ధ ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా ఉందని... కేంద్రం దానిని నియంత్రించడంలో విఫలమైందన్నారు. మే4వ తేదీ తర్వాత పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసిందని...ఇది సామాన్యుడి నడ్డి విరవడమేనని మండిపడ్డారు. ఇంధన కొరత కారణంగా దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర క్యూలైన్లు కనిపిస్తున్నా పాలకులకు చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కార్మిక చట్టాల నిర్వీర్యం... బానిసత్వానికి బాటలు**

బ్రిటిష్ పాలన నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని కౌర్ ఆవేదన వ్యక్తం చేశారు. 44 చట్టాలను కలిపి కేవలం 4 లేబర్ కోడ్లుగా మార్చడం అంటే కార్మికులను తిరిగి బానిసలుగా మార్చడమేనని ఆమె విశ్లేషించారు. నూతన చట్టాల ప్రకారం కార్మికులు తమ హక్కుల కోసం సమ్మెకు నోటీసు ఇచ్చి ఆందోళనకు దిగితే, నియన్ నాయకులపై కేసులు పెట్టి అరెస్టు చేసేలా నిబంధనలు మార్చారని ధ్వజమెత్తారు. గత పది సంవత్సరాలుగా కనీస వేతనాలు పెంచలేదని, నేడు కార్మికులతో 12 గంటలు పని చేయించుకుని కేవలం 8 గంటల వేతనం మాత్రమే ఇస్తున్నారని దుయ్యబట్టారు. శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాల నియామకాలు ఆగిపోయాయని, కేవలం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలోనే నియామకాలు చేస్తూ యువత భవిష్యత్తును అంధకారం చేస్తున్నారని విమర్శించారు. 70 లక్షల ఉద్యోగాల నుంచి నేడు 20 లక్షల ఉద్యోగాలకు కుదించడం మోదీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.

**కార్పొరేట్ శక్తులకు ఊడిగం**

దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రధాని మోదీ తన సన్నిహితులైన అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారని అమర్‌జీత్ కౌర్ విమర్శించారు. చిన్న తరహా పరిశ్రమలను పథకం ప్రకారం నాశనం చేస్తూ, కార్పొరేట్ శక్తులకు అడుగులకు మడుగులు వత్తుతున్నారని విమర్శించారు. భారత ప్రధానిగా ఉండి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మోదీ సాగిలపడుతున్నారని, ఇండియా పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ చెబుతున్నా మోదీ నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా కలిగిన దేశంగా ఉండి కూడా, ప్రపంచ యుద్ధాల విషయంలో భారత్ తన గొంతుకను వినిపించలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**రాజ్యాంగ మార్పు... ప్రజాస్వామ్యానికి ముప్పు**

బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్నే మార్చివేయాలని చూస్తోందని కౌర్ హెచ్చరించారు. ఎన్నికల కమిషనర్ నియామకాన్ని తమ చేతుల్లో ఉంచుకుని, తమకు అనుకూలంగా ఎన్నికలు జరిపించుకుంటున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్ వంటి విధానాలను తీసుకువచ్చి లక్షలాది మంది ఓటు హక్కును హరిస్తున్నారని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ (డీలిమిటేషన్) బిల్లును కూడా ఒక కుట్రపూరితమైన ఆలోచనతోనే ప్రవేశపెట్టారని, పార్లమెంటులో వడవ వంతు మెజారిటీ లేకపోయినా మహిళల భుజంపై తుపాకీ పెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని విమర్శించారు. ఇలాంటి వినాశకరమైన కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ వంటి నేతలు మద్దతు పలకడం చారిత్రక తప్పిదమని ఆమె స్పష్టం చేశారు.

**విద్య, వైద్యం దూరం... పోరాటమే మార్గం**

ప్రభుత్వ విద్యాలయాలను వసివేస్తూ, విశ్వవిద్యాలయాలను జీసీ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని కౌర్ విమర్శించారు. దేశంలో పౌష్టికాహార లోపంతో 5 శాతం మంది పిల్లలు వధాగా మారుతున్నారని, పార్లమెంటులో వాస్తవాలు వెల్లడించినా కేంద్రం తప్పుడు లెక్కలతో ప్రజలను మభ్యపెడుతోందని ధ్వజమెత్తారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడమే కాకుండా, వారి పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్యం అందకుండా చేస్తున్నారని ఆవేదన చెందారు. గుజరాత్, హర్యానా వంటి రాష్ట్రాల్లో కార్మికులు ఇప్పటికే రోడ్లపైకి వచ్చి కనీస వేతనాల కోసం వీరోచిత పోరాటాలు చేస్తున్నారని ఆమె గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ఎఐటియుసి నాయకత్వంలో కార్మికులు, రైతులు కలిసి కేంద్రంపై పోరాడాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ వారిలాగే మోదీ కూడా 'విభజించు పాలించు' విధానంతో సమాజంలో చిచ్చు పెడుతున్నారని, దీనిని అడ్డుకోవడానికి మరొక స్వాతంత్ర్య పోరాటం వంటి ఉద్యమం అవసరమని అమర్‌జీత్ కౌర్ ఉద్ఘాటించారు. ఈ మహాసభకు ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య అతిథులను వేదిక పైకి ఆహ్వానించారు. తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాధాకష్ణ వందన సమర్పణ చేశారు. ఈ సభలో ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు పి.హరినాథ్ రెడ్డి, ఎఐటియుసి జాతీయ కార్యదర్శి జి. ఓబులేసు, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ మణిలక్ష్మి, డి ఆదినారాయణ, రామాంజనేయులు, వీ వినాయకరావు, రాధాకష్ణ వర్తి, నాగసుబ్బారెడ్డి, రాజారెడ్డి, గంద్రల గోపు, జి.లలితమ్మ, గోపాలకష్ణ, మునెప్ప, రమేష్, సుబ్బరాయుడు, బాలకాశి, స్రవంతి, కవిత, దామోదర్ రావు (ఆర్‌టిసి), పొనగంటి శివయ్య (ఎలక్ట్రిసిటి), చంద్రశేఖర్ రెడ్డి (అడ్వకేట్), నాసర్ జీ (ఎఐఎస్ఎఫ్), పెంచలయ్య (ప్రజానాట్యమండలి), సాత్విక (ఎఐవైఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయికి ప్రజావాణి

(మొదటి పేజీ తరువాయి)

దూర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు,లేదా జిల్లా కేంద్రానికి వచ్చే బదులుగా వారి వద్దకే 'ప్రజావాణి' సేవలను మరింత చేరువ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిఎంఒ అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజావాణి పనితీరు, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షి ంచారు. 'అర్జీలు,ఫిర్యాదుల' పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని, అందుకు ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని అధికారులను సిఎం ఆదేశించారు.

**నిర్ణీత గడువులోపు పరిష్కారం..**

ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువు ఉండాలని,ఆలస్యం జరగకూడదని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఫిర్యాదుల నమోదు,ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి చేయాలని, జిల్లా, రాష్ట్ర స్థాయిలో 'రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని సూచించారు.ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని సూచించారు.ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును కూడా నమోదు చేసి, వాటిని సంబంధిత విభాగాలకు పంపించాలని, పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలన్నారు. ప్రతి స్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని సిఎం ఆదేశించారు.

**అవసరమైతే అప్పీల్ వ్యవస్థ ... ఆలస్యమైతే అధికారిదే బాధ్యత...**

ప్రతి జిల్లా, ప్రతి శాఖలో కూడా ప్రత్యేక ప్రజావాణి విభాగాలను ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఒక స్థాయిలో పరిష్కారం కాకపోతే, ఆ పైస్థాయి అధికారికి అర్జీ అందేలా 'ఆటో ఎస్కలేషన్' వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించారు. పిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని సిఎం స్పష్టం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని,పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునేందుకు వీలుండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలని సిఎం అన్నారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించడంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కింది స్థాయిలోనే కొన్ని పరిష్కరించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి ఇక 'రెవెన్యూ డివిజన్'కు ... కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన మరుసటి రోజు 2023 డిసెంబర్ 8వ తేదీన 'ప్రజావాణి కార్యక్రమాన్ని' ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి మంగళవారం, శుక్రవారం హైదరాబాద్‌లోని 'మహాత్మా జ్యోతిభా పూలే ప్రజాభవన్'లో ప్రజావాణి విజయవంతంగా అమలవుతోంది. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలు, విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలు, దరఖాస్తులను స్వీకరించి, వాటిని వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు చెబుతున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయిలో కలెక్టర్ల అధ్వర్యంలో ప్రతి వారం 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఇక నుంచి రెవెన్యూ డివిజన్ స్థాయిలో, ఆ తర్వాత దశలో మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం విస్తరించనుంది.

## భారత్ – న్యూజిలాండ్ సంతకాలు

(మొదటి పేజీ తరువాయి)

పియూష్ గోయల్, న్యూజిలాండ్ వాణిజ్య పెట్టుబడుల శాఖ మంత్రి టాడ్ మెక్లే సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరుగనున్నాయి. ఈ ఒప్పందం ద్వారా ఔషధాలు, వైద్య పరికరాలకు సులభంగా అందుబాటు లభించడం వల్ల భారతదేశానికి మరిన్ని తాత్కాలిక ఉపాధి అవకాశాలు కూడా దక్కుతాయి. ఈ ఒప్పందం ప్రకారం భారతదేశానికి న్యూజిలాండ్ నుంచి ఎగుమతి అయ్యే ఉన్ని, బొగ్గు, కలప, వైన్స్, అవకాడో, బ్లూ బెర్రీల వంటి 95 శాతం వస్తువులపై సుంకాలను తొలగించినా, లేదా తగ్గించినా రైతులను దేశీయ పరిశ్రమను రక్షించేందుకు పాల ఉత్పత్తులు, ఉల్లిపాయలు, చక్కెర, సుగంధ ద్రవ్యాలు, వంట నూనెలు, రబ్బరు దిగుమతులను అందించడంలో న్యూఢిల్లీ ఎటువంటి రాయితీలకు అవకాశం ఇవ్వలేదు. తయారీ, మౌలిక సదుపాయాలు, సేవలు, ఆవిష్కరణలు, ఉద్యోగ కల్పన రంగాలలో రాబోయే 15ఏళ్లలో భారతదేశంలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడానికి కట్టుబడి ఉన్న న్యూజిలాండ్, కివీ పండ్లు, యాపిల్ ఎగుమతులపై కోటా ఆధారిత సుంకాల తగ్గింపులను కూడా పొందనున్నది. 5 ఏళ్లలో 5 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయడమే ఈ ద్వైపాక్షిక ఒప్పందం లక్ష్యం. ఈ ఒప్పందం లక్ష్యం పశ్చిమాసియా సంక్షోభం సహా ప్రపంచ అనిశ్చితుల కారణంగా ఇబ్బందులు పడుతున్న భారతీయ ఎగుమతిదారులకు ఓషియానియా ప్రాంతంలో తమ వ్యాపారాన్ని వైవిధ్యపర్చడంలో ఈ ఒప్పందం సహాయపడుతుంది. భారత దేశం ఇప్పటికే ఆస్ట్రేలియాతో వాణిజ్య ఒప్పందాన్ని అమలుచేసింది. ఈ ఒప్పందం ప్రకారం న్యూజిలాండ్, గొర్రె మాంసం, ఉన్ని , బొగ్గు వంటి 95 శాతానికిపైగా అటవీ, కలప ఉత్పత్తుల వంటి వస్తువులకు సుంకం రహిత యాక్సెస్‌ను పొందుతుంది. దీంతో పాటు కివీ పండ్లు, వైన్, కొన్ని సముద్రపు ఆహారాలు, చెర్రీలు, అవకాడోలు, పర్సిమన్‌లు, బల్క్ ఇన్‌ఫాంట్ ఫార్ములా, మనుకా తేనె, మిల్క్ అల్బుమిన్‌ల వంటి అనేక వస్తువులపై సుంకం రాయితీలు లభిస్తాయి. దేశీయ రైతులు, ఎంఎస్ఎంఇల ప్రయోజనాలను పరిరక్షించేందుకు పాలు, మీగడ, మజ్జిగ, పెరుగు జున్ను వంటి రాజకీయంగా సున్నితమైన పాడి వంటి రంగంలో ఎలాంటి రాయితీలను భారత్ ఇవ్వడం లేదు. ఈ ఒప్పందం పరిధిలోకి రాని ఇతర ఉత్పత్తులలో కూరగాయల ఉత్పత్తులు ( ఉల్లిగడ్డలు, శనగలు, బఠానీలు, మొక్కజొన్న, బాదం), చక్కెర, కృత్రిమ తేనె, జంతు, వృక్ష లేదా సూక్ష్మ జీవుల కొవ్వులు, నూనెలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, రత్నాలు, ఆభరణాలు, రాగి దాని ఉత్పత్తులు, అల్యూమినియం ఇతర వస్తువులు ఉన్నాయి. సేవల రంగానికి సంబంధించి నైపుణ్యం గల వృత్తులలోని భారతీయ నిపుణుల కోసం న్యూజిలాండ్ ఏటా 5,000 వీసాల కోటాతో, మూడు సంవత్సరాల కాలపరిమితితో తాత్కాలిక ఉపాధి ప్రవేశ వీసా మార్గాన్ని అందిస్తుంది. ఈ మార్గం ఆయుష్ వైద్యులు, యోగా శిక్షకులు, భారతీయ చెఫ్‌లు, సంగీత ఉపాధ్యాయులు వంటి భారతీయ వృత్తులతో పాటు కార్మిక శక్తి చలనశీలతను బలోపేతం చేయడం, సేవల వాణిజ్యం వంటి అధిక దిగుబడి ఉన్న రంగాలను కూడా కవర్ చేస్తుంది. ఈ ఒప్పందం ప్రకారం భారతీయ రైతులకు ఉత్పాదకత, నాణ్యతను మెరుగు పర్చడంలో సహాయపడే లక్ష్యంతో న్యూజిలాండ్ కివీ పండ్లు, యాపిల్ పండ్లు, తేనెపై ఒక ప్రత్యేక వ్యవసాయ సాంకేతిక కార్యాచరణ ప్రణాళికను ఏర్పాటు చేస్తుంది. ఈ సహకారంలో శ్రేష్ఠతా కేంద్రాల స్థాపన, మెరుగైన నారు పదార్థాలు, సాగుదారుల సామర్థ్య నిర్మాణం, పండ్ల తోటల నిర్వహణకు సాంకేతిక మద్దతు, పంట కోత అనంతర పద్ధతులు, సప్లయ్ చైన్ వంటి పని తీరు, ఆహార భద్రత వంటి అంశాలు ఉన్నాయి.భారతదేశపు వైన్స్, స్పిరిట్‌ల నమోదును సులభతరం చేయడానికి తన చట్టాన్ని సవరించడంతో సహా భౌగోళిక గుర్తింపుల (జిఐ'లు) విషయంలో న్యూజిలాండ్ తన నిబద్ధతను విస్తరించనుంది. సుంకాల సరళీకరణతోపాటు మెరుగైన నియంత్రణ సహకారం, క్రమబద్ధీకరించిన కస్టమ్స్, పారిశుద్ధ్య, వృక్ష–పారిశుద్ధ్య చర్యలు, వాణిజ్య క్రమశిక్షణకు సాంకేతిక అడ్డంకుల ద్వారా సుంకాలేతర అడ్డంకులను పరిష్కరించే నిబంధనలను కూడా ఈ ఒప్పందం కలిగి ఉంది. గుడ్ మ్యాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీస్ (జిఎంపి), గుడ్ క్లినికల్ ప్రాక్టీస్ (జిసిపి)లను ఆమోదించడానికి వీలు కల్పించడం ద్వారా న్యూజిలాండ్‌లో వేగవంతమైన నియంత్రణ సదుపాయం లభించి, భారతదేశంలోని ఫార్మా, వైద్య పరికరాల రంగానికి ప్రోత్సాహం లభిస్తుంది. భారతదేశం ఇప్పటివరకూ ఫైవ్ ఐస్ (ఎఫ్‌విఇవై) కూటమిలోని మూడు సభ్యదేశాలైన ఆస్ట్రేలియా, యూకె, న్యూజిలాండ్‌లతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందా(ఎఫ్‌టిఏ)లను ఖరారు చేసింది. ఈ ఐదు గూఢచార సమాచార భాగస్వామ్య నెట్‌వర్క్ దేశాలు ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, యూకె, యూఎస్, కెనడాతో వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు కొనసాగుతున్నాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com